# లోకానికి నేనే వెలుగు




## శ్రీసభ - మహా ఘోర నేరాలు


సంపుటి : 46 ఏప్రిల్-జూన్ 2023 సంచిక : 2



భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

### సంపాదక వర్గం :

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్

### గురు విద్యార్థుల బృందం :

బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 46 ఏప్రిల్-జూన్ 2023 సంచిక : 2

## శ్రీసభ - మహా ఘోర నేరాలు

**ఫాదర్ కుర్మా తోమాస్**
సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**
ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 91-040-29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminaryhyd.org

# విషయసూచిక

సంపాదకీయం.................................................. **05**

**1.** **శ్రీసభలో మహా ఘోర నేరాల ప్రస్తావన**
*– ఫాదర్ కుర్మా తోమాస్* ................................ **07**

**2.** **శ్రీసభలో మహా ఘోర నేరాల చారిత్రక నేపథ్యము**
*– బ్రదర్ తాతిరెడ్డి ప్రణయ్ కుమార్* .................... **15**

**3.** **విశ్వాసమునకు విరుద్ధమైన ఘోర నేరాలు**
*– బ్రదర్ పెండెం ఇస్రాయేలు* .......................... **23**

**4.** **దివ్యబలిపూజ, దివ్య సత్ప్రసాదమునకు విరుద్ధమైన ఘోర నేరాలు**
*– బ్రదర్ యంబటి మహేష్, బ్రదర్ ఆర్నాల్డ్ బెనెడిక్ట్*
*(అనువాదము: బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్)* ..... **32**

**5.** **పాప మన్నిపు దివ్య సంస్కారమునకు విరుద్ధమైన ఘోర నేరాలు**
*– బ్రదర్ చిట్టెం మధు కుమార్, బ్రదర్ పెదపూడి*
*అంతోని రాజు, బ్రదర్ రుద్రపాటి ప్రవీణ్ కుమార్* ..... **42**

**6.** **స్త్రీలకు గురుత్వాభిషేకము ఒసగుటకు నిరర్థకముగా ప్రయత్నించుట**
*– బ్రదర్ తనబల్ ఫ్రాన్సిస్ చిన్నప్పర్*
*(అనువాదము: బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్)* ..... **58**

**7.** **పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధమైన ఘోర నేరాలు**
*– బ్రదర్ కర్రి శేఖర్, బ్రదర్ నేకూరి జాయ్ చందు* .... **65**



# సంపాదకీయం



**ప్రియ పాఠకులారా!**

శ్రీసభ మహా ఘోర నేరాలు, వీటినే లతీను భాషలో 'దెలిక్త గ్రవియోర' (*Delicta Graviora*– the more Grave Delicts) అని పిలుస్తారు. ఈ నేరాలు చాలా ఘోరమైనవి, తీవ్రమైనవి. ఈ మహా ఘోర నేరాలు దివ్య సంస్కారాల పట్ల ఇంకా యాజకులచేత విరక్తత్వ జీవితానికి వ్యతిరేకముగా చేయు నేరాలు. కాబట్టి వీటిని అతి జాగ్రత్తగా విచారించి నేరమునకు పాల్పడిన విశ్వాసులను రోమను కూరియాలో అతి ముఖ్యమైన విభాగమైన, విశ్వాస పరిరక్షణ విభాగము (Dicastery for the Doctrine of the Faith) మాత్రమే ఈ నేరాలను విచారించు అధికారము కలిగి, అవసరతను బట్టి ఆ నియమములను సవరించు అధికారమును కలిగియున్నది. ఈ నేరాల గురించి సామాన్య విశ్వాసులకు బహుశా చాలా తక్కువమందికి అవగాహన ఉండి ఉండవచ్చు. ప్రస్తుత సినడాలిటి బాటలో పయనిస్తూ ఉండగా, శ్రీసభ జీవనము, పయనములో సామాన్య విశ్వాసులు వారి పాత్రను తెలుసుకొని శ్రీసభను ముందుకు నడిపించు పరిస్థితులలో ఉన్నాము. శ్రీసభ గురించి మరింత ఎక్కువగా తెలుసుకొనుటకు, ముఖ్యముగా మహా ఘోర నేరాల గురించి తెలుసుకొనుటకు విశ్వాసులందరు ప్రయత్నించాలి. ఎందుకంటే శ్రీసభను ఈ నేరాల నుండి కాపాడవలసిన బాధ్యత ప్రతి విశ్వాసికున్నది. ఆ ఉద్దేశముతోనే, భక్త యోహాను గురువిద్యాలయములోని గురువిద్యార్థులకు ఎన్నుకొనదగ పాఠ్యాంశముగా అందించు ఒక అంశమును, వారు దాదాపు విద్యా సంవత్సరమంతా, ఈ మహా ఘోర నేరాలను వ్యక్తిగత అధ్యయనము చేసి వారు రచించిన వ్యాసాలు ఇందులో పొందుపరచబడ్డాయి.

కేవలము ఈ వ్యాసాల పఠనము ద్వారా మాత్రమే ఈ మహా ఘోర నేరాల గురించి పూర్తి అవగాహన కలుగకపోయినా, కొంతైన విషయపరిజ్ఞానము కలుగుతుందని భావించి ఈ వ్యాసాలను మీకు అందిస్తున్నాము.

ఈ వ్యాసాలను తెలుగు భాషలో అందించుట చాలా కష్టమైన పని. ఈ పనిని గురువిద్యార్థులు శ్రద్ధతో చేపట్టి వారు మీకు అందించడానికి సాహసం చేశారు. శ్రీసభ చట్టములో వాడబడిన కొంత పదజాలము, భావ వ్యక్తీకరణ తెలుగు భాషలో తర్జుమా చేయుట చాలా కష్టము. సులువుగా అర్థము చేసుకొనుటకు ప్రక్కన లతీను భాషలో, ఆంగ్లభాషలో అందించడం జరిగింది. విడిగా ఒక్కొక్క వ్యాసాన్ని చదివినా, అన్ని వ్యాసాలను పఠించుట ద్వారా మరింత ఎక్కువగా ఈ మహా ఘోర నేరాల పట్ల అవగాహన ఏర్పడుతుంది. వ్యాసాలను వారి శైలిలో రచించిన గురువిద్యార్థులందరు అభినందనీయులు. మీ పఠనము వారికి ప్రోత్సాహము. ఇంకా ఎన్నో మంచి వ్యాసాలు మీకందించ మీ సహకారాన్ని మాకందించగలరు.

భవదీయుడు
**ఫాదర్ కుర్మా తోమాస్**
సంచిక సంపాదకులు

# 1. శ్రీసభలో మహా ఘోర నేరాల ప్రస్తావన

**- ఫాదర్ కుర్మా తోమాస్**

## పరిచయం



శ్రీసభ ఆరంభము నుండి యధార్థమైన బోధ, విశ్వాసము పట్ల ఎంతో జాగరూకతను, శ్రద్ధను కలిగి ఉంది. తప్పుడు బోధను ఖండిస్తూ, సత్య సువార్తను వ్యాపింపచేయుటలో ఎంతో అంకితభావమును కలిగి ఉన్నది. పరిశుద్ధ గ్రంథములో అపోస్తలుల కాలము నుండి ఈ ప్రయత్నమును మనము గమనించగలము (గలతీ 1:6-9). "మేము కాని, లేక దివి నుండి దిగివచ్చిన దేవదూతయేకాని, మేము బోధించిన దానికంటె భిన్నమైన సువార్తను మీకు బోధించిన యెడల అతడు శపింపబడునుగాక!" (గలతీ 1:8) ఈ విధముగా, అపోస్తోలిక వారసత్వము ద్వారా ఈ అధికారము ఈ లోకములో క్రీస్తు ప్రతినిధియైన రోమను పాపుగారి పాలనలో, పీఠాధిపతులు సత్య బోధను పరిరక్షిస్తూ అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ, శ్రీసభలో సత్య బోధను, విశ్వాసము, దివ్యసంస్కారాల పట్ల వ్యతిరేఖముగా చేసిన ఘోర నేరాలను కొన్ని శతాబ్దాలుగా వాటిని "మహా ఘోర నేరాలు" (*delicta graviora* – more grave delicts) గా పరిగణించి, అటువంటి మహా ఘోర నేరాలను తగు రీతిగా విచారించి తగిన శిక్షను అమలు చేయు అధికారమును రోమను కూరియాలో అతి ప్రధాన విభాగమైన విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే ఇవ్వబడింది. శ్రీసభలో ఈ తరహా నేరాలకు పాల్పడిన సామాన్య విశ్వాసులు, మఠవాసులు, గురువులను విచారించే అధికారము మేత్రాసన పీఠాధిపతులకు కాక, రోమను కూరియా విభాగమైన విశ్వాస పరిరక్షణ విభానికి (ఇక నుండి ఈ వ్యాసములో విశ్వాస పరిరక్షణ విభాగముగా

ప్రస్తావించబడును). మాత్రమే ఉంటుంది. వీటి తీవ్రతను బట్టి, ఈ నేరాల వలన శ్రీసభకు కలిగే ముప్పు వలన ఈ మహా ఘోరమైన నేరాలను విచారించే అధికారము శ్రీసభలో అతి ముఖ్యమైన విభాగానికి మాత్రమే ఇవ్వబడింది.

ఈ నేరాలకు ఏ విశ్వాసియైన పాల్పడిన యెడల, మేత్రాసన పీఠాధిపతి లేదా పాపుగారి ఆదిపత్య గురుత్వ మఠవాస సంస్థ పెద్దలు తక్షణమే ప్రాథమిక విచారణ (preliminary enquiry) జరిపి విశ్వాస పరిరక్షణ విభాగానికి తెలియపరచాలి. వారి ఆదేశాల మేరకు వాటికి సంబంధించిన సమాచారమును లేదా వాటిని విచారించుటకు అనుమతిని పొంది తదనుగుణంగా శ్రీసభ చట్టము ప్రకారము, ఈ తరహా నేరాలను విచారించుటకు విశ్వాస పరిరక్షణ విభాగము ఏర్పాటు చేసిన నియమముల ప్రకారము అదే విధముగా ప్రాంతీయ శ్రీసభ చట్టములు ఏవైనా వర్తిస్తే వాటికనుగుణంగా చట్ట పరమైన విధానాల ద్వారా విచారించి నివేదికను విశ్వాస పరిరక్షణ విభాగానికి అందించాలి. మహా ఘోర నేరాల విభజనను, వాటిని విచారించు పద్ధతులను క్లుప్తముగా తెలియపరచుట ఈ వ్యాసము యొక్క మఖ్య ఉద్దేశము.

## శ్రీసభలో మహా ఘోర నేరాల విభజన

ఈ మహా ఘోర నేరాలు ముఖ్యముగా 5 భాగాలుగా విభజింపబడ్డాయి. ఒక్కొక్క భాగములో వాటికి సంబంధించిన నేరాలు ప్రత్యేకముగా విశదీకరించబడ్డాయి. అవి ఏవనగా:

## I. విశ్వాసమునకు విరుద్ధమైన మహా ఘోర నేరాలు

1. కతోలిక విశ్వాస సిద్ధాంతమును, ఏదైన ఒక అంశమును తిరస్కరించుట (Heresy)
2. కతోలిక విశ్వాసమును పూర్తిగా విడిచిపెట్టుట (Apostacy)
3. రోమను పాపుగారి అధికారన్ని తిరస్కరించుట (Schism)

## II. దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాదమునకు విరుద్ధమైన మహా ఘోర నేరాలు

1. దైవదూషణగావించు ఉద్దేశముతో దివ్య సత్ప్రసాదమును స్వీకరించుట, వారితో ఉంచుకొనుట, విసరి వేయుట.

2. దివ్య బలిపూజను సమర్పించుటకు నిరర్థకముగా ప్రయత్నించుట (attempt the Eucharistic Sacrifice)
3. గురువులు దివ్య బలిపూజను చేయుచున్నట్లు అనుకరించుట (simulate the Eucharistic Sacrifice)
4. కతోలిక శ్రీసభతో ఐఖ్యత లేని క్రైస్తవ సంఘాలకు చెందిన యాజకులతో కలసి దివ్య బలిపూజలో పాల్గొనుట.
5. దైవదూషణగావించు ఉద్దేశముతో కేవలము అప్పమును లేక అప్పమును, ద్రాక్షారసమును దివ్య బలిపూజ వెలుపల లేదా దివ్య బలిపూజలో ఆశీర్వదించుట.

## III. పాప మన్నిపు దివ్య సంస్కారమునకు విరుద్ధమైన మహా ఘోర నేరాలు

1. గురువు పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధముగా ఎవరితో కలసి పాపము చేశాడో వారికి పాప మన్నింపును నిరర్థకముగా అందించుట.
2. నిరర్థకముగా పాపమన్నింపును ఇచ్చుట (Attempted Sacramental Absolution), నిషేదింపబడిన గురువు పాప సంకీర్తనమును వినుట.
3. పాప మన్నింపును ఒసగుచున్నట్లు అనుకరించుట (Simulation of the sacramental absolution).
4. పాప సంకీర్తన సమయములోగాని, పాప సంకీర్తన నెపముతోగాని, పాప సంకీర్తన దివ్య సంస్కారమును ఒసగు గురువుతో, పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయుటకు ప్రేరేపించుట. (Solicitation to sin against the sixth commandment of the Decalogue).
5. ప్రత్యక్షముగా లేక పరోక్షముగా పాప మన్నింపు దివ్య సంస్కారములో వెల్లడించిన (పాప సంకీర్తన ముద్రకు సంబంధించిన విషయాలను) బహిర్గతము చేయుట (Direct and Indirect violation of the Sacramental Seal).

6. పాప సంకీర్తన దివ్య సంస్కారములో వెలువరించబడిన విషయాలను ఏదైన ఆధునిక సాంకేతిక పరికరాలతో రికార్డు చేయుట లేదా దురుద్దేశముతో ఏదైన ప్రసార మాధ్యమాలలో వాటిని ప్రచురించి బహిర్గతము చేయుట.

## IV. స్త్రీలకు గురుత్వాభిషేకము ఒసగుటకు నిరర్థకముగా ప్రయత్నించుట

1. ఒక స్త్రీకి గురుపట్టాభిషేకమును ఒసగుటకు నిరర్థకముగా ప్రయత్నించుట (Attempting to Confer Sacred Ordination on a Woman) లేదా ఒక స్త్రీ నిరర్థకముగా గురుపట్టమును పొందుటకు ప్రత్నించుట (A Woman attempting to receive the Sacred Ordination).

## V. పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధముగా వయోపరిపక్వతలేని వారితో చేయదగు మహా ఘోర నేరాలు

1. యాజక క్రమానికి చెందిన వారు (cleric) పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తులతో లేదా మతిస్థిమితములేని వారితో పాపముచేయుట.
2. యాజక క్రమానికి చెందిన వారు (cleric) లైంగిక తృప్తి కొరకు లేదా లాభాల కొరకు వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తుల అశ్లీల చిత్రాలను సేకరించుట, కలిగియుండుట, ప్రదర్శించుట లేదా పంచుట.

## శ్రీసభలో మహా ఘోర నేరాల విచారణ విధానము

ఎవరైతే ఈ మహా ఘోర నేరాలకు పాల్పడతారో వారిని రోమను శ్రీసభ చట్టము (ఈ వ్యాసములో ఇక నుండి శ్రీ.చ.గా ప్రస్తావించబడును) ప్రకారము, తూర్పు దేశాల శ్రీసభ చట్టము (ఈ వ్యాసములో ఇక నుండి తూ.దే.శ్రీ.చ.గా ప్రస్తావించబడును) ప్రకారము, రోమను కూరియా విభాగమైన విశ్వాస పరిరక్షణ విభాగము ఏర్పాటుచేసిన నియమాల ప్రకారము ఆ నేరాల తీవ్రతను బట్టి శిక్షిస్తుంది. ఈ నేరాలు యాజకవర్గానికి (clerics) చెందిన వారిచే చేయబడినట్లైతే యాజక హోదా నుండి తొలగించబడతారు లేదా జీవితకాల ప్రాయశ్చిత్తముకు యాజక హోదా నుండి ఉపసంహరించబడతారు.

శ్రీసభలో మహా నేరాల విషయములో నేర సంహరణకై చర్యలు లేదా నిందితులను విచారించుటకు విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే అధికారము ఇవ్వబడిన ఈ నేరాలకు గడువు ఇరవై సంవత్సరాలు. నేర విచారణ చేపట్టుటకు గడువు శ్రీ.చ. 1362 §2 మరియు తూ.దే.శ్రీ.చ. ప్రకారము 1152 §3 ప్రకారము లేదా వయోపరిపక్వత లేని 18 సంవత్సరాలలోపు వారికి సంబంధించిన నేరాలలో ఆ బాధితుల 18వ యేట నుండి ప్రారంభమౌతుంది. ఇవి కాక విశ్వాస పరిరక్షణ విభాగము కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఇంకా పొడిగించు హక్కు కలిగియున్నది. ప్రస్తుతము అమలులో ఉన్న నియమాలు రాక మునుపు ఈ నేరాలకు పాల్పడిన, విశ్వాస పరిరక్షణ విభాగము విచారణ గడువును పై చెప్పబడిన వాటికంటే ఎక్కువ గడువును సిఫార్సు చేయు అధికారము కలిగియున్నది. దీనిని బట్టి శ్రీసభలో ఈ మహా ఘోర నేరాల విచారణ ఎంత ప్రాముఖ్యత కలిగియున్నదో అర్థము చేసుకోవచ్చు.

శ్రీసభలో మహా ఘోర నేరాల విషయములో విశ్వాస పరిరక్షణ విభాగము, రోమీయ కతోలిక శ్రీసభ, తూర్పు దేశాల కతోలిక శ్రీసభలకు, అపోస్తొలిక అత్యున్నత న్యాయస్థానము. ఈ మహా ఘోర నేరాల విచారణకు సంబంధించిన అత్యున్నత న్యాయస్థానము. ఈ నేరాలను న్యాయస్థాన పద్దతుల (Judicial Process) ప్రకారము లేదా న్యాయస్థానాంతర అధికారిక పత్రము (Extra Judicial Decree) ప్రకారము విచారించబడతాయి. ఈ విశ్వాస పరిరక్షణ విభాగ పరిధిలో విచారించబడి అమలు చేయబడే శిక్షలకు ప్రత్యేకముగా పాపుగారి ఆమోదము అవసరము లేదు.

మేత్రాసన పీఠాధిపతి లేదా పాపుగారి ఆదిపత్య గురుత్వ మఠవాస సంస్థ పెద్దలు (Major Superiors of Clerical Religious Institutes or Societies of Apostolic Life of Pontifical Right) మహా ఘోర నేరాల విషయమై సమాచారమును పొందిన తరువాత, ఆ నేరము చేయబడినదని కనీస నిర్ధారణకు వచ్చిన పిదప, శ్రీ.చ.1717,తూ.దే. శ్రీ.చ. 1468 ప్రకారము ప్రాథమిక విచారణ చేసి, విశ్వాస పరిరక్షణ విభాగానికి సమాచారమును అందించవలెను. కొన్ని పరిస్థితులలో విశ్వాస పరిరక్షణ విభాగమే స్వయముగా ఆ నేరమును విచారిస్తుంది

లేని పక్షమున, మేత్రాసన పీఠాధిపతి లేదా పాపుగారి ఆదిపత్య గురుత్వ మఠవాస సంస్థ పెద్దలకు ఏ విధంగా విచారణలో ముందుకు కొనసాగాలో సూచనలు ఇస్తుంది. ఈ లోపు ప్రారంభ దశనుండి, అధికారులు, శ్రీ.చ. 1722 మరియు తూ.దే.శ్రీ.చ. 1473 ప్రకారము కొన్ని చట్టపరమైన నిషేధాలను విధించవచ్చు. విశ్వాస పరిరక్షణ విభాగానికి ప్రత్యక్ష్యముగా ఫిర్యాదు చేయబడిన మహా ఘోర నేరాల విచారణకు సాధారణంగా ప్రాథమిక విచారణ కొరకు ఆ విభాగమే స్వయముగా లేదా ప్రతినిధుల ద్వారా నిర్వహిస్తుంది. స్వీయరక్షణ హక్కుకు (Right of Defence) భంగము కలుగకుండా, కేవలము చట్టపరమైన పద్దతుల ఉల్లంఘన నుండి విశ్వాస పరిరక్షణ విభాగాము మినహాయింపు ఇవ్వవచ్చును.

## మహా ఘోర నేరాల తుది నిర్ణయాలు

విశ్వాస పరిరక్షణ విబాగము మహా ఘోర నేరాల విచారణ ఏ స్థాయిలోనైనా లేదా ప్రత్యక్షముగా యాజక హోదాలో ఉన్న వారి తొలగింపునుద్దేశించి, లేదా జీవితకాల ప్రాయశ్చిత్తమునుద్దేశించి యాజక హోదా నుండి ఉపసంహారణ కొరకు పాపుగారి నిర్ణయమునకు ప్రవేశపెట్టవచ్చును. ఈ క్రమములో భాగముగా ఆ వ్యక్తికి స్వీయరక్షణ హక్కును కలుగజేసిన తరువాత మహా ఘోర నేరము ఖచ్చితముగా చేయబడినదని నిర్ధారణకు వచ్చిన తరువాత, యాజక హోదాలో ఉన్నవారు పాటించవలసిన విరక్తత్వ జీవిత బాధ్యతనుండి మినహాయింపు కూడా ఇవ్వబడుతుంది.

యాజక హోదాలో ఉన్న వారు ఈ మహా ఘోర నేరాల విషయములో నిందితులు ఏ క్షణములోనైనా యాజక అభిషేకము ద్వారా పొందే బాధ్యతలు, హక్కులనుండి విరక్తత్వ జీవిత బాధ్యత నుండి సైతం, విడుదల కొరకు పాపుగారికి విన్నవించే హక్కు కలిగియున్నారు. మఠవాస జీవితములో ఉన్నవారైతే వారి మాటపట్టు ద్వారా వచ్చే బాధ్యతల నుండి మినహాయింపు నిమిత్తమై పాపుగారికి విన్నవించే హక్కు కలిగియున్నారు.

మహా ఘోర నేరాల ఫిర్యాదు, విచారణ, నిర్ణయాలు మియహాయించి, వయోపరిమితిలేని 18 సంవత్సరాలలోపు వారికి సంబంధించిన నేరాలలో పాపుగారికి సంబంధించిన నిగూఢతను (Pontifical Secrecy) పాటించవలెను.

ఎవరైతే ఉద్దేశపూర్వకముగా ఈ నిగూఢతను ఉల్లంగిస్తారో లేదా నిందితులకు, సాక్షులకు, విచారణలో భాగస్థులైన వారికి హాని కలుగజేస్తారో, బాధితుల ఫిర్యాదు మేరకు లేదా అధికారులు స్వయముగా చేపట్టిన విచారణ ద్వారా విధించు తగు శిక్షకు అర్హులు. ఈ మహా ఘోర నేరాలను విచారించుటలో విశ్వాస పరిరక్షణ విభాగము ఏర్పాటు చేసిన నియమాలు, శిక్షలు, శ్రీసభ చట్టములో, తూర్పు దేశాల శ్రీసభల చట్టములో ఏర్పాటు చేయబడిన నేర విచారణ పద్దతులను పాటించవలెను.

## మహా ఘోర నేరాల విచారణకు గడువు:

సాధారణముగా ఒక నేర విచారణ చేయుటకు కొంత నిర్ణీత సమయము ఉంటుంది. ఆ సమయములోపు ఆ నేర విచారణను చేయాలి, లేకపోతే గడువు ముగిసిపోయిందని నేరారోపణగావింపబడ్డ వారు శిక్షనుండి తప్పించుకొను అవకాశమున్నది. అదే విధముగా ఈ మహా ఘోర నేరాలకు కూడా నిర్ణీత గడువును విశ్వాస పరిరక్షణ విభాగము, శ్రీసభ చట్టము ఏర్పాటు చేసిన గడువుతో అవసర పరిస్థితులలో, తీవ్ర పరిస్థితులలో ఇంకా గడువును పొడిగించు అధికారము కలిగియుంది. "నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", (*Normae de gravioribus delictis*) మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 8 §1ఈ విధముగా తెలియజేస్తుంది, రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగ పరిధిలోకి వచ్చే నేరాలకు సంబంధించి, విచారణను 20 సంవత్సరాలలోపు ప్రారంభించాలి. ఆర్టికలు 8 §2 శ్రీసభ చట్టము 1362 §2 ప్రకారము, తూర్పు దేశాల శ్రీసభ చట్టము 1152 §3 ప్రకారము, "నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", (*Normae de gravioribus delictis*) మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 6, సం. 1 గడువు, ఆ చిన్నారులు 18 సంవత్సరాల వయస్సు నిండినప్పటి నుండి ప్రారంభమై ఇరవై సంవత్సరాలలోపు విచారణ ప్రారంభించాలి. ఆర్టికలు 8 §3 ప్రత్యేక పరిస్థితులలో ఈ నియమములు అమలులోకి రాకముందు ఆ నేరములు చేయబడినా, విశ్వాస పరిరక్షణ విభాగము ఈ గడువు ఇంకా పొడిగించు అధికారము కలిగియున్నది. కాబట్టి శ్రీసభ ఈ మహా ఘోర నేరాల విషయములో ఎంత జాగ్రత్త వహిస్తుందో అర్థము చేసుకోవాలి.

## ముగింపు

ఆది నుండి శ్రీసభ క్రీస్తు ప్రభుని ఆజ్ఞ మేరకు “మీరు ప్రపంచమందంతట తిరిగి, సకలజాతి జనులకు సువార్తను బోధింపుడు”. (మార్కు 16:15) అనే ఆజ్ఞను తప్పక నెరవేరుస్తూ, సత్య సువార్తను నలుమూలల వ్యాప్తిచేస్తూ, ఆ బాధ్యత నిర్వహణలో భాగముగా తప్పుడు బోధను ఖండిస్తూ, క్రీస్తు ప్రభు స్థాపించిన దివ్య సంస్కారాల పవిత్రతను పరిరక్షిస్తూ, పవిత్రాత్మ ప్రేరణతో, నడిపింపుతో తన బాధ్యతను ఎంతో నిష్టతో నెరవేరుస్తుంది. ఈ మహా ఘోర నేరాలను తెలుసుకోవడం విశ్వాసులమైన మనందరి కర్తవ్యం. వీటిని తెలుసుకోవడం మాత్రమే కాదు, సత్య సువార్త వ్యాప్తికి అన్ని విధాల తోడ్పడుతూ, మన అనుదిన జీవితము ద్వారా ప్రకటిస్తూ, దివ్య సంస్కారాల పవిత్రతను కాపాడుటకు సిద్ధముగా ఉండాలి. శ్రీసభలో పరిచర్య చేయుటకు అంకితభావము కలిగిన తగు పరిచారకులను అందించు బాధ్యత ప్రతీ విశ్వాసిపై ఉన్నది. శ్రీసభలో పరిచర్య చేయువారు తగురీతిగా తర్ఫీదుపొంది, ఈ మహా ఘోర నేరాలకు పాల్పడకుండా వారికి అప్పగింపబడిన విశ్వాసులను సన్మార్గములో నడిపించుటకు కావలసిన అంకితభావము, తర్ఫీదు శ్రీసభ అందిస్తుంది. ఆ తర్ఫీదులో సామాన్య విశ్వాసులు సైతం భాగస్వామ్యులే. యాజకులు ఈ విశ్వాసుల కుటుంబాల నుండే ఎన్నుకోబడతారు. చిరు ప్రాయము నుండి తల్లిదండ్రులు పిల్లలకు విశ్వాసము, కతోలిక శిక్షణ తప్పకుండా అందించాలి. ఈ విధముగా మనమందరము శ్రీసభలో సత్య సువార్త వ్యాప్తికి, విశ్వాస పరిరక్షణకు, దివ్య సంస్కారాల పవిత్రతను కాపాడుటకు మనవంతు సహకారాన్ని అందించగలము.

# ౨. శ్రీసభలో మహా ఘోర నేరాల చారిత్రక నేపధ్యము

– బ్రదర్ తాతిరెడ్డి ప్రణయ్ కుమార్

## పరిచయం



రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగమునకు శ్రీసభలో మహా ఘోర నేరాలను విచారించుటకు రూపొందించబడిన నియమముల నేపద్యమును అందించుటకు ఈ వ్యాసము ప్రయత్నిస్తుంది. నేటి పరిస్థితులకు అనుగుణంగా శ్రీసభలో ఈ మహా ఘోర నేరాలను విచారించు నిమిత్తము నియమములను ఏర్పరుచుటకు, పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు వారి స్వయం లేఖయైన "సాక్రమెంతోరుమ్ సాంక్తితాతిస్ తూతేల" (*Motu proprio -Sacramentorum Sanctitatis Tutela*) ద్వారా విశ్వాస పరిరక్షణ విభాగానికి అధికారానిచ్చారు. ఈ విభాగము ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని ఈ నియమాలను నవీకరిస్తుంది. ఈ వ్యాసము, ఈ నియమములు, వాటికి తగిన శిక్ష, ఈ మహా ఘోరాలను శ్రీసభ చట్ట ప్రకారము, విశ్వాస పరిరక్షణ విభాగము ఏర్పాటు చేసిన నియమముల ప్రకారము విచారించే పద్దతుల చారిత్రక నేపధ్యమును క్లుప్తముగా అందించుటకు ప్రయత్నిస్తుంది. శ్రీసభ ఈ నియమాలను, పద్దతులను, శిక్షలను ఏర్పాటు చేయుటకు గల ముఖ్య ఉద్దేశము దివ్య సంస్కారముల పవిత్రత కాపాడి, వాటికి అగౌరవము కలుగనివ్వకుండా కాపాడుట, దైవ దూషణ, ఇతర నేరాలకు పాల్పడిన విశ్వాసులను శిక్షించుట ద్వారా వారిలో మనోపరివర్తనను కలిగింపజేయుటకు ప్రయత్నిస్తుంది. ఒక మాటలో చెప్పాలంటే వీనియన్నింటి ముఖ్య ఉద్దేశము "ఆత్మల రక్షణ" (*salus animarum*).

**చారిత్రక విశిష్టత:**

దివ్య సంస్కారాల పవిత్రతకు విరుద్ధముగా చేసిన ఘోర నేరాలను మొట్ట మొదటి సారిగా 14వ బెనెదిక్తు పాపుగారు 1741వ సంవత్సరములో వారి అపోస్తొలిక లేఖయైన "సాక్రమెంతుమ్ పెనితెన్సియే" *(Sacramentum Poenitentiae)* లో ప్రస్తావించారు. ఈ తరహా నేరాలను 15వ బెనెదిక్తు పాపుగారు ప్రచురించినటువంటి శ్రీసభ చట్టము 1917లో ప్రస్తావించారు. అప్పట్లో ఈ నేరాలను విచారించడానికి పవిత్ర మండలి సభకు (Holy Office) మాత్రమే అధికారము ఉండేది. ఈ విచారణ సభ ఏర్పాటు చేసిన నియమముల ప్రకారము పనిచేసేది. ఈ విచారణ సభకు స్వయాన గురువులే నాయకులు. శ్రీసభ చట్టము 1917 ప్రచురితమైన కొన్ని సంవత్సరాల తరువాత పవిత్ర మండలి సభ 1922 సంవత్సరములో "క్రిమెన్ సొల్లిచితత్సియోనిస్" *(Crimen Sollicitationis)* అనే లేఖ ద్వారా ఈ నేరాలకు సంబంధించిన సూచనలను గరుంచి తెలిపినది.

1917 సంవత్సరములో శ్రీసభ చట్టము అమలులోకి వచ్చిన కొన్ని సంవత్సరాల తరువాత 1922 వ సంవత్సరములో పవిత్ర మండలి సభ "క్రిమెన్ సొల్లిచితత్సియోనిస్" *(Crimen Sollicitationis)* అనే ఒక ఉపదేశమును అందించింది. ఈ ఉపదేశము మేత్రాసనాలకు, శ్రీసభ న్యాయసభలకు పాపసంకీర్తన సమయములోగాని, పాప సంకీర్తన నెపముతోగాని, పాప సంకీర్తన దివ్య సంస్కారమును ఒసగు గురువుతోగాని, వేరొక వ్యక్తితో గాని, పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయుటకు ప్రేరేపించు మహా నేర విచారణకు సంబంధించిన ఒక వివరణాత్మక ఉపదేశమును అందించింది. ఈ మహా ఘోర నేరము పాప సంకీర్తన దివ్య సంస్కారము యొక్క పవిత్రత, గౌరవము ఒక గురువుచే భంగపరపబడే మహా ఘోర నేరము. 1922 సంవత్సరములో ఇవ్వబడిన ఉపదేశము 1917 సంవత్సరపు శ్రీసభ చట్ట నేపద్యములో నవీకరించబడిన "సాక్రమెంతుమ్ పెనితెన్సియే" *(Sacramentum Poenitentiae)* అపోస్తొలిక ప్రబోధము. దీనిని 1741వ సంవత్సరములో 14వ బెనెదిక్తుపాపుగారు అందించారు.

ఈ మహా ఘోర నేరాలను విచారించుటలో చాలా విషయాలను పరిగణలోనికి

తీసుకోవాలి ప్రత్యేకముగా చట్టపరమైన అంశాలు. ఈ తరహా నేరాలు దేశ పౌర చట్టాలకు ఎటువంటి ప్రాముఖ్యత లేకపోయినా, కేవలము శ్రీసభకు మాత్రమే ఇటువంటి నేర విచారణ ఎంతో ముఖ్యమైనది. ప్రత్యేకముగా పాప సంకీర్తన దివ్య సంస్కార గౌరవము, పాప సంకీర్తన దివ్య సంస్కారముద్ర, పాప మన్నింపును కోరు విశ్వాసి గౌరవము, ఈ నేరారోపణగావింపబడిన గురువును విచారించుటలో పాప సంకీర్తన దివ్య సంస్కారముద్రను ప్రమాదములో పెట్టకుండా, ఉల్లంగించకుండా విచారించుట ఎంతో కష్టతరము.

ఈ ప్రత్యేక విచారణ పద్దతి, నేర నిర్ధారణ విషయములో ప్రత్యక్ష నేర నిర్ధారణ పద్దతి కాక పరోక్ష నైతిక నిర్ధారణ పద్దతిని వినియోగిస్తుంది. ఈ పరోక్ష నేర నిర్ధారణ పద్దతి ప్రకారము, ఒక గురువుపై నేరారోపణ చేయువారి వ్యక్తిత్వము, విశ్వసనీయతను విచారించుట, నేరారోపణగావింపబడిన గురువు జీవితము, నడవడిక విచారించబడతాయి. ఒక రోమను కతోలిక గురువుపై ఇటువంటి నేరారోపణ చాలా తీవ్రమైనది. కాబట్టి నేర నిర్ధారణ జరిగే వరకు ఇటువంటి నేరారోపణగావింపబడిన గురువు పరువు మర్యాదలకు భంగము కలిగింపకుండ అదే విధముగా ఒక గురువుపై ద్వేషపూరిత అభియోగము జరుగకుండా, జాగ్రత్తపడడం ఎంతో ముఖ్యమైనవి. శ్రీసభ నేర విచారణ న్యాయసభ, చివరి నిర్ణయము చేసేవరకు, చాల నిబద్ధతతో ఈ నేర నిర్ధారణ పద్దతిలో భాగస్తులైన వారిని పరిరక్షిస్తూ, ఎటువంటి వ్యక్తిగత ప్రచారానికి తావివ్వకుండ చూడాలి.

1922 వ సంవత్సరములో ఇవ్వబడిన ఉపదేశములో ఒక ప్రత్యేక శీర్షిక శ్రీసభ చట్ట ప్రకారము నేరమైన "క్రిమెన్ పెస్సిముమ్" *(Crimen Pessimum)* అనే ఒక ప్రత్యేక నేరము గురించి కేటాయించబడింది. ఈ నేరము గురువర్గములో ఉన్నవారు స్వలింగసంబంధమైన అవినీతి విషయాలను విచారిస్తుంది. ఈ భాగము ఈ విధమైన నేరాలను విచారించుటకు ఆయా నేరాలకు సంబంధించి కావలసిన ప్రత్యేక పద్దతులను ఏర్పాటుచేయాలని సూచించింది. ఈ "క్రిమెన్ పెస్సిముమ్" ఘోర నేరమైన వయోపరిమితిలేని వారికి వ్యతిరేఖముగా ప్రవర్తించుట అదే విధముగా పశువులతో లైగింక సంబంధాల విషయమై విచారించుటకు అనుగుణముగా నేర విచారణ పద్దతులు ఏర్పాటు చేయాలని సూచించింది.

“క్రిమెన్ సొల్లిచితత్సియోనిస్” *(Crimen Sollicitationis)* ఉపదేశము కతోలిక శ్రీసభలో గురువర్గములో ఉన్న వారు పాల్పడిన లైగింక సంబంధిత నేరాల విచారణ విషయమై ఏర్పాటు చేసిన పూర్తి యంత్రాంగముగా భావింపకూడదు. ఈ యంత్రాంగము కేవలము పాప సంకీర్తన దివ్య సంస్కార నేపధ్యములో అతి సున్నిత పరిస్థితులను, ఒక గురువు కలిగియుండ వలసిన నిబద్ధతను ఉద్దేశించి, దైవ చట్టము, ఒక విశ్వాసి అతి ముఖ్యమైన తన ఆత్మ సంబంధిత విషయాలను గురువుతో పంచుకునే సందర్భములో ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా లేదా చోటు చేసుకొనిన సందర్భాలను విచారించుటకు ఏర్పాటు చేసిన విచారణ పద్దతులు మాత్రమే. కాల క్రమేణ ఈ పద్దతులను గురు హోదాలో ఉన్నవారు పాల్పడే వేరే అవినీతి పనులను విచారించుటకు కూడా వినియోగించడం జరిగేది. విద్యారంగంలో బాధ్యతా పదవిలో ఉన్న వారు పాల్పడే అవినీతి పనులను నివారించుటకు ఒక ప్రత్యేక చట్టమును అమలుచేయాలనేది ఈ మధ్య కాలంలో లేదా కొన్ని సంవత్సరాల తరువాత వచ్చిన ఆలోచన. కాబట్టి గత శతాబ్దములో ఏర్పాటు చేసిన నియమాల ప్రకారము నేటి పరిస్థితులలో చేయబడిన నేరాలను వాటికనుగుణంగా నేర విచారణ చేయడం సరియైనది కాదు.

1922వ సంవత్సరములో ఇవ్వబడిన ఉపదేశము ఒక పీఠాధిపతి పైచెప్పబడిన మహా ఘోర నేరాలను విచారించవలసిన సందర్భాలలో వినియోగించు నిమిత్తము ఉపయోగపడే నియమాలను అందించింది. 1962 వ సంవత్సరములో పునీత 23 జాన్ పాపుగారు 1922 ఉపదేశమును పున:ముద్రణను గావించి, మఠవాస జీవితములో ఉన్న గురువులను ఉద్దేశించి ప్రత్యేక పద్దతులను ఒక చిన్న శీర్షికగా జతపరచి వాటిని 1962 లో ద్వితీయ వాతికను మహాసభకు (1962-1965) హాజరుకానున్న పీఠాధిపతులందరికి అందించాలని ఆదేశించారు. ఇంకా ఏ పీఠాధిపతియైతే ఈ తరహా నేరాలను విచారించాల్సియున్నదో వారికి అందించడం జరిగింది. నిజానికి ఆ పున:ముద్రణ గావించబడిన పత్రాల పంపిణిజరుగలేదని చరిత్ర మనకు తెలియజేస్తుంది.

1917 సంవత్సరములో ప్రచురణలోనికి వచ్చిన శ్రీసభ చట్టము అదే విధముగా రోమను కూరియా పనిచేయు తీరు సంస్కరణలు, ద్వితీయ వాతికను

మహాసభ సంస్కరణలలో భాగాలు. 1965–1983 వరకు శ్రీసభ చట్టము ప్రత్యేకముగా శ్రీసభలో నేర విచారణ చట్టము గురించి అనేక అభిప్రాయాలు వ్యక్తపరచబడ్డాయి. నేర విచారణ యంత్రాంగ విషయములో వికేంద్రీకరణ యొక్క ప్రాధాన్యత, పీఠాధిపతుల స్వేచ్ఛానిర్ణయ వెసులుబాటు, శిక్షించే ఉద్దేశముతోగాక కాపరి బాధ్యత శైలిలో విచారించుట అనే అనేక భావాలు వెలుగులోకి వచ్చాయి. గురు హోదాలో ఉన్న వారి అవినీతి పనులను దండించే ఉద్దేశ పద్దతులకు బదులు, బాగుచేయు ఉద్దేశ పద్దతులను అమలుచేయాల్సిన ఆవశ్యకత వ్యక్తపరచారు. ఈ విధంగా ఆలోచించడం వలన ఈ యంత్రాంగములో పనిచేయువారు, ఈ నేరాలకు పాల్పడిన వారు మళ్ళీ తిరిగి వాటికి పాల్పడే అవకాశం, ముప్పు ఎంతో ఉన్నదని గ్రహించలేకపోయారు.

పాప సంకీర్తన దివ్యసంస్కారమునకు వ్యతిరేకముగా చేసిన మహా ఘోర నేరాలు రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగము (పూర్వము పవిత్ర మడలి సభ 1965 లో పేరు మార్పుచేయడం జరిగింది, 2021లో ఫ్రాన్సిస్ పాపుగారు మళ్ళీ మార్పు చేశారు.) పరిధిలోనే ఉంచబడింది. 2001లో విశ్వాస పరిరక్షణ విభాగము ప్రత్యేక నియమములు ఏర్పాటుచేసే వరకు "క్రిమెన్ సొల్లిచితత్సియోనిస్" *(Crimen Sollicitationis)* ఉపదేశమును అనుసరించే విచారణగావించబడ్డాయి.

ద్వితీయ వాతికను మహాసభ తరువాత, విశ్వాస పరిరక్షణ విభాగానికి కేవలము కొన్ని సందర్భాలలో మాత్రమే గురు వర్గములో ఉన్నవారు, వయోపరిమితిలేని వారికి వ్యతిరేకముగా చేసిన అవినీతి పనులను విచారించుటకు అందించబడ్డాయి. కొన్ని సందర్భాలలో ఈ నేరాలు, పాప సంకీర్తన దివ్య సంస్కారానికి సంబంధించినవి, చాలా సందర్భాలలో గురు బాధ్యతల నుండి, జీవితాంతము పరిత్యాగ జీవిత బాధ్యతల నుండి మినహాయింపు అభ్యర్థనలకు సంబంధించినవి. ఈ తరహా అభ్యర్ధనలు 1989 వరకు ఈ విశ్వాస పరిరక్షణ విభాగమే నిర్వర్తించేది. (1989 నుండి 2005 వరకు ఈ తరహా మినహాయింపులు రోమను కూరియా దైవార్చన విభాగము నిర్వహించింది. 2005 నుండి ఇప్పటి వరకు రోమను కూరియా గురువుల విభాగము నిర్వర్తిస్తుంది).

పునీత రెండవ జాన్ పౌలు పాపుగారిచే అమలు చేయబడిన 1983 శ్రీసభ చట్టము ఈ నిబద్ధతను 1395 §2 లో పొందు పరచబడింది. "గురు హోదాలో ఉన్న వ్యక్తి ఏ విధముగానైనా పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా, ఈ విధమైన నేరము బలవంతముగా లేదా బెదిరింపుతోగాని లేదా భహిరంగముగా, 16 సంవత్సరాల వయస్సు లోపు వ్యక్తులతో పాపమునకు పాల్పడినట్లైతే, తగిన శిక్షను విధించాలి, అవసరమైతే గురు హోదా నుండి కూడా తొలగించాలి". ఈ 1983 శ్రీసభ చట్టము ప్రకారము శ్రీసభ చట్ట పరమైన విచారణ మేత్రాసనములో జరుగుతాయి. న్యాయ నిర్ణయాలకు భిన్నముగా అభ్యర్ధనలు రోమను రోతాకు సమర్పించవచ్చు, కాని పరిపాలనాధికారముతో చేపట్టిన చర్యలకు భిన్నముగా అభ్యర్ధనలు రోమను కూరియా గురు విభాగానికి (Congregation for the Clergy) సమర్పించబడాలి.

## పవిత్ర/అపోస్తోలిక పీఠము వయోపరిపక్వతకు సంబంధించిన నిర్ణయము

1994వ సంవత్సరములో పవిత్ర/అపోస్తోలిక పీఠము అమెరికను దేశ పీఠాధిపతులకు శ్రీసభ చట్ట పరమైన వయోపరిపక్వతకు వ్యతిరేకముగా చేయు నేరములకు సంబంధించిన వయస్స, 18 సంవత్సరాలుగా నిర్ధారించింది. నేర విచారణ మొదలుపెట్టుటకు గడువు 10 సంవత్సరాలుగా నిర్ధారించింది. ఈ గడువు బాధితుల 18వ పుట్టిన రోజు నుండి ప్రారంభమౌతుందని నిర్ధారించింది. పీఠాధిపతులు తమ మేత్రాసనాలలో ఈ విచారణ ప్రారంభించాలని గుర్తుచేసింది. న్యాయ నిర్ణయాలకు భిన్నముగా అభ్యర్ధనలు రోమను రోతాకు సమర్పించవచ్చు, కాని పరిపాలనాధికారముతో చేపట్టిన చర్యలకు భిన్నముగా అభ్యర్ధనలు రోమను కూరియా గురు విభాగానికి (Congregation for the Clergy) సమర్పించబడాలని తెలియజేసింది. 1994 నుండి 2001 వరకు ఈ తరహా నేరాలకు పవిత్ర/అపోస్తోలిక పీఠమునకు సిఫార్సు చేయబడలేదు. 1996వ సంవత్సరములో ఈ విధమైన ఏర్పాటు ఐర్లాండు దేశమునకు కూడా అందించబడింది.

## మహా ఘోర నేరాల పున:ప్రస్తావన

ఈ లోగా, రోమను కూరియాలో లైగింక నేరాల ప్రస్తావన మళ్ళీ వెలికి వచ్చింది. చివరిగా పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు గురు వర్గములో ఉన్న వారు 18 సంవత్సరాలలోపు ఉన్న వ్యక్తితో లైంగిక అత్యాచారానికి పాల్పడిన నేరాలను విచారించుటకు ప్రత్యేక పద్ధతులను ఏర్పాటు చేయ, వాటిని విచారించుటకు రోమను కూరియా విభాగమైన విశ్వాస పరిరక్షణ విభాగానికి పరిమితమైన నేరాలలో చేర్చ నిశ్చయించారు. నేర విచారణ మొదలుపెట్టుటకు గడువు 10 సంవత్సరాలు. ఈ గడువు బాధితుల 18వ పుట్టిన రోజు నుండి ప్రారంభమౌతుంది. ఈ నూతన చట్టము ఏప్రిల్ 30, 2001 సంవత్సరములో పాపుగారి స్వయంప్రతిపత్తితో వ్రాసిన లేఖయైన (*Motu proprio*) "సాక్రమెంతోరుమ్ సాంక్తితాతిస్ తూతేల" (*Sacramentorum Sanctitatis Tutela*) ద్వారా అమలు చేశారు. అప్పటి విశ్వాస పరిరక్షణ విభాగ ముఖ్యులైన కార్డినలు యోసెఫ్ రాత్సింగర్ (16వ బెనెదిక్తుపాపుగారు), ఈ విభాగ కార్యదర్శియైన తార్చిసియో బెర్తోనె అతిమేత్రాణులు ఒక లేఖను మే 18, 2001లో ప్రతి రోమను కతోలిక పీఠాధిపతికి పంపించారు. ఈ లేఖ ద్వారా, శ్రీసభలో ఘోర నేరాలకు సంబంధించి నూతన చట్టము, వాటి విచారణకు వినియోగించ వలసిన పద్ధతులను, "క్రిమెన్ సొల్లిచితత్సియోనిస్" (*Crimen Sollicitationis)* ఉపదేశము రద్దుచేసిన విషయమును తెలియపరిచారు. ఒకటి, ఎటువంటి ప్రవర్తన శ్రీసభలో ఘోర నేరాలుగా పరిగణింపబడి, వాటి విచారణ విశ్వాస పరిరక్షణ విభానికి మాత్రమే కలిగియుంటుందన్న విషయాన్ని కూడా ఆ లేఖలో విశదపరిచారు. రెండు, అనైతిక ప్రవర్తన, దివ్య సంస్కారాల పవిత్రత, గౌరవమునకు సంబంధించిన నేరాలు విచారించు అధికారము విశ్వాస పరిరక్షణ విభాగము మాత్రమే కలిగియుంది. విశ్వాస పరిరక్షణ విభాగమే నేర విచారణ ప్రత్యేక పద్ధతులను, చట్ట పరమైన శిక్షలను ఏర్పాటు చేసింది.

'సాక్రమెంతోరుమ్ సాంక్తితాతిస్ తూతేల" (*Sacramentorum Sanctitatis Tutela*) అమలులోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాల తరువాత, విశ్వాస పరిరక్షణ విభాగము, ఈ మహా ఘోర నేరాల విషయమై నియమములను, తగు మార్పులను

చేయుట అవసరమని భావించి, పూర్తిగా కాకుండా, విచారణ పద్ధతులలో చట్టమును అవలంబించుటలో కొన్ని మార్పులను చేయాలని ప్రతిపాదించింది. కార్డినళ్ళు, పీఠాధిపతులు, విశ్వాస పరిరక్షణ విభాగ సభ్యులు తగు అధ్యయనము చేసిన తరువాత, వాటి ఫలితాలను 21 మే, 2010లో 16వ బెనెదిక్తు పాపుగారికి సమర్పించారు. పాపుగారు వారి అనుమతిని తెలిపి ఆ మార్పులను అమలుచేయుటకు అంగీకరించారు. దాదాపు 11 సంవత్సరాల తరువాత కాలానుగుణంగా శ్రీసభలో ఘోర నేరాలకు సంబంధించిన నియమాలను, వాటి విచారణ పద్ధతులను నవీకరించి, విశ్వాస పరిరక్షణ విభాగము, ప్రస్తుతము అమలులోనున్న మహా ఘోర నేరాలకు సంబంధించిన నియమాలు, నేర విచారణ పద్ధతులు ప్రస్తుత ఫ్రాన్సిస్ పాపుగారిచే 11 అక్టోబరు 2021 న అమోదించబడ్డాయి. ఈ మహా ఘోర నేరాలను విచారించుటలో చేయూతగా ఉండుటకు విశ్వాస పరిరక్షణ విభాగము 16 జులై, 2020 లో మరియు 2 జూన్ 2022 లో ముఖ్యముగా గురు హోదాలోనున్న వారి ద్వారా 18 సంవత్సరాలలోపు ఉన్న వ్యక్తులతో అత్యాచారానికి పాల్పడిన వారిని విచారించుటకు కొన్ని సహాయక నియమాలను అందించింది.

**ముగింపు**

శ్రీసభలో మహా ఘోర నేరాలు వాటి విచారణ పద్ధతులు ఏ విధంగా పరిణతి చెందాయో తెలుసుకున్నాము. శ్రీసభ అంచెలంచెలుగా, విశ్వాస పరిరక్షణకు, దివ్య సంస్కారాల పావిత్ర్యతకు, గురు హోదాలోనున్న వారి అనైతిక ప్రవర్తనను అరికట్టుటకు ఎంతగా కృషిచేస్తుందో మనము తెలుసుకున్నాము. ఈ విధంగా శ్రీసభ, విశ్వాసులు ఈ మహా ఘోర నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలను తీసుకుంటుంది. ఈ ప్రస్తుత కాలంలో ఈ నియమాలు, నేర విచారణ పద్ధతుల గురించి అవగాహన కలిగియుండటం ఎంతో ముఖ్యము. అ ఉద్దేశముతోనే ఈ వ్యాసము క్లుప్తముగా చారిత్రక నేపధ్యమును అందించుటకు ప్రయత్నించింది. వీటి గురించి అవగాహన పెంచుకొని శ్రీసభలో ఇటువంటి మహా ఘోర నేరాలు జరుగకుండా దివ్య సంస్కారాల పవిత్రతను కాపాడవలసిన బాధ్యత మనందరిది.

# 3. విశ్వాసమునకు విరుద్ధమైన ఘోర నేరాలు

- బ్రదర్ పెండెం ఇస్రాయేలు

## పరిచయం



రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగము (Dicastery for the Doctrine of the Faith), విశ్వాసానికి వ్యతిరేకంగా చేసిన నేరాలను విచారించడం, తీర్పు ఇవ్వడం వంటి విధిని కలిగి ఉంది, అవి కతోలిక మత విశ్వాసాల, కతోలిక మత భ్రష్టత్వం మరియు విభేదాలు. విశ్వాస పరిరక్షణ విభాగము కతోలిక ప్రపంచం అంతటా విశ్వాసం, నైతికతను రక్షించు విధిని కలిగి ఉంది. కాబట్టి, విశ్వాసం, నైతికతకు దోషాలవల్ల హాని కలగకుండా ఉండేందుకు, విశ్వాసానికి విరుద్ధంగా లేదా ప్రమాదకరమైన రచనలు మరియు అభిప్రాయాలను పరిశీలించే బాధ్యత కూడా కలిగి ఉంది.

విశ్వాస పరిరక్షణ విభాగము మహా ఘోర నేరాలను విచారించు నిమిత్తము ఏర్పాటు చేసిన నియమాలననుసరించి, ఆర్టికల్ 2 §1 ప్రకారము "ఆర్టికలు 1లో ప్రస్తావించబడిన విధముగా శ్రీసభ చట్టము (శ్రీ.చ.) 751, 1364, తూర్పు దేశాల శ్రీసభ చట్టము (తూ.దే.శ్రీ.చ.) 1436, 1437 ప్రకారము, విశ్వాసమునకు వ్యతిరేఖముగా పాల్పడు నేరాలు, కతోలిక మత భ్రష్టత, కతోలిక మత పరిత్యాగము, రోమను పాపుగారి అధికారాన్ని తిరస్కరించుట". విశ్వాస పరిరక్షణ విభాగము ఈ బాధ్యతను నెరవేర్చుటకు, దైవ ప్రజలందరు సువార్త సందేశమును స్వచ్ఛముగా, పూర్తిగా స్వీకరించుటకు, శ్రీసభలో సత్య సువార్తకు సేవనందిస్తుంది.

## 1. కతోలిక మత భ్రష్టత మహా ఘోర నేరము (Heresy) (కతోలిక విశ్వాస సిద్ధాంతమును, ఏదైన ఒక అంశమును తిరస్కరించుట)

కతోలిక మత భ్రష్టత అనగా జ్ఞానస్నానం స్వీకరించిన కతోలిక విశ్వాసులు, ఆత్మల రక్షణ విషయమై విశ్వసించవలసిన విశ్వాస సత్యాలను, ఏదైన ఒక అంశమును పూర్తిగా తిరస్కరించడం లేదా సందేహించడం. కతోలిక శ్రీసభలో జ్ఞానస్నానం పొందినవారు లేదా కతోలిక శ్రీసభలోనికి స్వీకరించబడిన వారు విశ్వాస సత్యాలను దైవీకముగా, కతోలిక విశ్వాసంతో అంగీకరించాలి. వాటిలో ప్రధానమైనవి, పరమ పవిత్ర త్రిత్వము, క్రీస్తు మనుష్యవతారము, శ్రీసభ పరిచర్య ద్వారా పాపముల మన్నింపు, పునరుత్థానము, మరియమాత నిష్కళంకత్వము, మారియమాత మొక్షారోపణం మొదలైనవి. ఈ పైనుదహరించబడిన విశ్వాస సత్యాలను లేదా ఏదైన ఒక అంశమును పూర్తిగా తిరస్కరించడం లేదా సందేహించడం ద్వారా కతోలికమత భ్రష్టత అనే మహా ఘోర నేరానికి పాల్పడినవారౌతారు. ఇటువంటి వారిని విచారించు అధికారము కేవలము విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే కలదు.

గురు వర్గములో ఉన్నటువంటి వారు, ముఖ్యముగా దృఢమైన కతోలిక మత సిద్ధాంతాన్ని, పరిశుద్ధ గ్రంథ ఆధారముగా, శ్రీసభచే ఆమోదింపబడి, ప్రత్యేకముగా వివిధ సమాఖ్యల ద్వారా విశదముగావించబడి రోమను పాపుగారిచే అధికారికముగా అదించబడిన పత్రాల ఆధారముగా కాపాడుటకు, వ్యాప్తి చేయుటకు పాటుబడాలి. ఈ ప్రక్రియలో అనాధికారిక సృజనాత్మకతకు తావీయక, అసత్య శాస్త్రీయతకు పాల్పడక జాగ్రత్తలు వహించాలి. ఈ మహా ఘోర నేరము, ఒక విశ్వాసి ఉద్దేశపూర్వకముగా కతోలిక మత సిద్ధాంతాలను తృణీకరించడం లేదా సందేహించడం. ఈ నేరమును ఆపాదించడానికి, ఆయా పరిస్థితులలో ఉన్న విశ్వాసులను పీఠాధిపతి లేదా అపోస్తోలిక పీఠము వారించినా, వారు ఇంకా ఆ పరిస్థితిలో ఉద్దేశపూర్వకముగా కొనసాగితేనే వారు ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినవారౌతారు. శ్రీసభ ఇటువంటి విశ్వాసులకు వారి ఆలోచనా విధానాన్ని లేదా తప్పుడు సిద్ధాంతాన్ని, రచనలను సరిదిద్దుకొనే అవకాశము ఎప్పుడూ కల్పిస్తూనే ఉంటుంది. అటువంటి అవకాశాలను పెడచెవిన పెట్టి ఆ

తప్పుడు సిద్ధాంతాలలో కొనసాగడం ఈ మహా ఘోర నేర విచారణకు దారి తీస్తుంది.

కతోలిక మత భ్రష్టత మహా ఘోర నేరమునకు పాల్పడిన వారికి, గురు హోదాలో ఉన్న వ్యక్తులకు, సామాన్య విశ్వాసులకు శ్రీసభ విధించే శిక్ష, ఒక విశ్వాసి తాను ఏ శ్రీసభ చట్టమునకు కట్టుబడి ఉన్నాడో/ఉన్నదో ఆయా శ్రీసభ చట్టము ప్రకారము, శ్రీసభ సహవాసము నుండి తక్షణ స్వయం బహిష్కరణ (*latae sententiae* excommunication). వారు గురు హోదాకు చెందినవారైతే తక్షణ స్వయం బహిష్కరణతో పాటు అవసరమైతే ఇతర శిక్షలు, మరియు తీవ్ర పరిస్థితులలో గురు శ్రేణినుండి కూడా తొలగించబడవచ్చును.

## 2. కతోలిక మత పరిత్యాగ మహా ఘోర నేరము (Apostacy) (కథోలిక విశ్వాసమును పూర్తిగా విడిచిపెట్టుట)

కతోలిక మత పరిత్యాగము అనేది కతోలిక శ్రీసభలో జ్ఞానస్నానమును పొందిన లేదా కతోలిక శ్రీసభలోనికి స్వీకరించబడిన విశ్వాసులు కతోలిక విశ్వాసాన్ని పూర్తిగా పరిత్యజించుట. కతోలిక మత భ్రష్టత ఏదైన ఒక విశ్వాస సత్యమును తిరస్కరించడం లేదా సందేహించడమైతే, కతోలికమత పరిత్యాగము, కతోలిక విశ్వాసమును పూర్తిగా పరిత్యజించడం. ఈ మహా ఘోర నేరమును కొందరు విశ్వాసులు అధికారిక చర్య ద్వారా కతోలిక మతమును పరిత్యజిస్తుంటారు. ఈ నేరారోపణగావించుటకు, ఈ నేరము ఉద్దేశపూర్వకముగా, బహిరంగముగా చేసినదై ఇతరులచేత గ్రహించబడినదై ఉండాలి. ఇటువంటి నేరమునకు పాల్పడిన విశ్వాసులను విచారించు అధికారము విశ్వాస పరిరక్షణ విభాగమునకు మాత్రమే కలదు.

కతోలిక మత పరిత్యాగమనే మహా ఘోర నేరమునకు పాల్పడిన వారికి, గురు హోదాలో ఉన్న వ్యక్తులకు, సామాన్య విశ్వాసులకు శ్రీసభ విధించే శిక్ష, ఒక విశ్వాసి తాను ఏ శ్రీసభ చట్టమునకు కట్టుబడి ఉన్నాడో/ఉన్నదో ఆయా శ్రీసభ చట్టము ప్రకారము, శ్రీసభ సహవాసము నుండి తక్షణ స్వయం బహిష్కరణ (*latae sententiae* excommunication). వారు గురు హోదాకు చెందినవారైతే తక్షణ స్వయం బహిష్కరణతో పాటు అవసరమైతే ఇతర శిక్షలు, తీవ్ర పరిస్థితులలో

గురు శ్రేణినుండి కూడా తొలగించబడవచ్చును.

## 3. రోమను పాపుగారి అధికారన్ని తిరస్కరించు మహా ఘోర నేరము (Schism)

రోమను పాపుగారి అధికారన్ని తిరస్కరించుట (Schism) అనగా కతోలిక శ్రీసభలో జ్ఞానస్నానమును పొందిన లేదా కతోలిక శ్రీసభలోనికి స్వీకరించబడిన విశ్వాసులు రోమను పాపుగారితో, వారికి లోబడి ఉన్నవారితో సత్సంబంధం కలిగి ఉండాలి. శ్రీసభతో సత్సంబంధం కలిగి ఉండడం చాలా ముఖ్యమైన విషయము ప్రత్యేకముగా విశ్వ శ్రీసభ కాపరియైన రోమను పాపుగారితో. వారితో సత్సంబంధం కలిగియుండుట అంటే వారు బోధించే, ఆదేశించే విశ్వాస సత్యాలను, వారి నాయకత్వములో పీఠాధిపతులు బోధించే, ఆదేశించే విశ్వాస సత్యాలను అంగీకరించడం. వారి ఆధ్యాత్మిక పాలనకు తలవంచడం. రోమను పాపుగారి అధికారాన్ని తిరస్కరించు మహా ఘోర నేరమునకు పాల్పడిన వారికి, గురు హోదాలో ఉన్న వ్యక్తులకు, సామాన్య విశ్వాసులకు శ్రీసభ విధించే శిక్ష, ఒక విశ్వాసి తాను ఏ శ్రీసభ చట్టమునకు కట్టుబడి ఉన్నాడో/ఉన్నదో ఆయా శ్రీసభ చట్టము ప్రకారము, శ్రీసభ సహవాసమునుండి తక్షణ స్వయం బహిష్కరణ (*latae sententiae* excommunication). వారు గురు హోదాకు చెందినవారైతే తక్షణ స్వయం బహిష్కరణతో పాటు అవసరమైతే ఇతర శిక్షలు, తీవ్ర పరిస్థితులలో గురు శ్రేణినుండి కూడా తొలగించబడవచ్చును.

## విశ్వాసమునకు వ్యతిరేకముగా చేయు మహా ఘోర నేరముల విచారణ విధానము

శ్రీసభలో మహా ఘోర నేరాలను విచారించు అధికారము కేవలము విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే కలదు. పీఠాధిపతులు వారి పరిధిలో విశ్వాసమునకు వ్యతిరేకముగా పాల్పడిన నేరములను విచారిస్తూ ఉంటారు. అదే విధముగా పీఠాధిపతులతో కలసి ప్రతి అభిషిక్త గురువు శ్రీసభలో విశ్వాసమును, సత్య సువార్తను వ్యాప్తి చేయుటకు పాటుబడుతూ, స్వచ్ఛమైన, పూర్తియైన సువార్త సందేశమును దైవ ప్రజలకు అందించు బాధ్యత కలిగి ఉన్నారు. అదే విధముగా కతోలిక విశ్వాసమునకు, సిద్ధాంతమునకు వ్యతిరేకమైన తప్పుడు బోధ, తప్పుడు

రచనల వలన విశ్వాసులకు హాని కలుగకుండా, పర్యవేక్షణ చేయాలి. కతోలిక విశ్వాసులు విశ్వాసమునకు, శ్రీసభలో నైతిక విలువలకు సంబంధించిన రచనలు చేసినపుడు, శ్రీసభ చట్టము ప్రకారము, స్థానిక శ్రీసభ అధికారుల పర్యవేక్షణకు లేదా ఆ రచనలు శ్రీసభ బోధనకనుగుణంగా ఉన్నవో లేదో నిర్ణయించుటకు ఆ రచనలను సమర్పించవలెను. వాటి ముద్రణకు కూడా అనుమతిని తప్పనిసరిగా పొందవలెను. ఈ విధముగా పీఠాధిపతులు వారి పరిధిలో విశ్వాసులు ఈ నేరాలకు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ బాధ్యతను నిర్వర్తించుటకు కొన్ని, కతోలిక సిద్ధాంతములో నిపుణుల బృంద సహాయముతో ముఖ్యముగా పీఠాధిపతుల సమాఖ్యకు తోడ్పడుటకు ఈ నిపుణులను అధికారికముగా ఒక బృందముగా ఏర్పాటుచేసి పీఠాధిపతులకు సహాయము చేయుటకు కూడా ఏర్పాటుచేయవచ్చు. కొన్ని తీవ్రమైన లేదా క్లిష్టమైన పరిస్థితులలో విశ్వాస పరిరక్షణ విభాగము స్వయముగా చేపట్టి శ్రీసభ చట్టము, ప్రత్యేకముగా ఏర్పాటుచేయబడిన నియమముల ప్రకారము పరిశీలించి తగు చర్యలను తీసుకుంటుంది.

పీఠాధిపతుల పరిధిని గౌరవిస్తూ, విశ్వాస పరిరక్షణ విభాగము, కతోలిక విశ్వాసము, నైతిక బోధనకు సంబంధించిన, విశ్వాసుల అభ్యంతరకరమైన రచనలు ఎప్పుడు పీఠాధిపతుల సమాఖ్య పరిధి దాటుతాయో, ఎప్పుడైతే ఆ రచనలు విశ్వాసానికి వ్యతిరేకముగా ప్రభావాన్ని చూపుతాయో అప్పుడు విశ్వాస పరిరక్షణ విభాగము స్వయముగా చట్టపరమైన తగు చర్యలు తీసుకుంటుంది. ఆ సందర్భాలలో ఈ క్రింది పద్ధతులను పాటిస్తుంది.

## 1. ప్రాథమిక విచారణ:

విశ్వాస పరిరక్షణ విభాగ దృష్టిని సదరు రచనలు ఆకర్షించినట్లైతే ఆ రచనలను ఆ విభాగ పెద్దలు, నిపుణులు ప్రతి వారము గుమిగూడే సమావేశ పరిశీలనకు సమర్పిస్తుంది. ఈ సమావేశవటాన్ని విశ్వాస పరిరక్షణ విభాగ 'కాంగ్రెస్సో' *(Congresso)* అని పిలుస్తారు. ఈ పరిశీలనలో భాగముగా సదరు రచనలు ఎంత తీవ్రమైనవో నిర్ణయించిన తరువాత, వాటిని లోతుగా అధ్యయనము చేయుట అవసరమో లేదో నిర్ణయిస్తారు. తరువాత సదరు రచనలలో ఉన్న అభ్యంతరాల విషయమై, కతోలిక విశ్వాస అధికారిక బోధన, వాటికి సంబంధించిన అధికారిక

అపోస్తోలిక రచనలు, పత్రాల ఆధారముగా అభ్యంతరకరమైన విషయాలను సమీకరించి పరిశీలిస్తారు.

## 2. అధ్యయనము:

ప్రాథమిక విచారణ తరువాత, రచయిత వివరాలను నిర్ధారించుకున్న తరువాత, రచనలు క్షుణ్ణంగా అధ్యయనముచేసి ఆ విషయాలపై పట్టు ఉన్న కొంతమంది నిపుణుల సహకారముతో విచారిస్తారు. ఆ అధ్యయన ఫలితాలను 'కాంగ్రెసో'కు సమర్పిస్తారు. 'కాంగ్రెసో' స్థానిక అధికారుల పరిధిలో ఉన్నట్లైతే వారికి సిఫార్సు చేస్తారు. ఒక వేళ తక్షణ చర్యలు అవసరమైతే సాధారణ విచారణ చట్ట పరంగా ప్రారంభించాలని నిర్ణయిస్తారు. 'కాంగ్రెసో' నిర్ణయము మేరకు రచనలలో ఉన్న అభ్యంతరాలు, వాటి తీవ్రత, ప్రభావము, విశ్వాసులకు జరుగబోయే హాని మొదలగునవి పరిగణిస్తుంది.

## 3. సాధారణ విచారణ:

సాధారణ విచారణ రెండు దశలుగా జరుగుతుంది. మొదటిది అంతర్గత దశ (internal phase), రెండవది భాహ్యా దశ (external phase). అంతర్గత దశలో రచయిత ప్రమేయము ఉండదు. భాహ్యా దశలో రచయితకు తన రచనలలో ఉన్న అభ్యంతర అంశాలపై విశ్లేషణ సమర్పించు అవకాశము కలిగి ఉంటారు.

అంతర్గత దశలో 'కాంగ్రెసో' ఇద్దరు లేదా కొంతమంది నిపుణులను నియమించి సదరు రచనలు కతోలిక అధికారిక బోధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని వారి అభిప్రాయమును వ్యక్తపరచమని అప్పగిస్తారు. అదే సమయములో 'కాంగ్రెసో' సదరు రచయిత తరుపున రచనలలో ఉన్న మంచి విషయాలపై దృష్టిపెట్టి రచయిత తరుపున వాదించుటకు కూడా నియమిస్తారు, వారికి అన్ని పత్రాలను, చర్యలను పరిశీలించు హక్కు కలిగి ఉంటారు. వీటి ఫలితాలను విశ్వాస పరిరక్షణ విభాగము 'కన్సుల్త' *(Consulta)* కు సమర్పిస్తారు. ఈ 'కన్సుల్త'లో అధికారులు, రచయిత తరుపున వాదించు వారు, రచయితకు సంబంధించిన పీఠాధిపతి/అధికారి కలిగి ఉంటారు. వీరందరు వారి వాదనలను మాట, వ్రాత పూర్వకముగా సమర్పించిన తరువాత వాదోపవాదాలు ఆలకించిన

తరువాత కేవలము అధికారులు మాత్రమే ఉండి ఓటు ద్వారా ఈ రచనలు కతోలిక విశ్వాసమునకు వ్యతిరేకముగా ఉన్నది లేనిది నిర్ధారిస్తారు.

భాహ్య దశలో, అంతర్గత దశ తీర్మానము మేరకు అభ్యంతరకర అంశాలను రచయితకు అందిచాలో లేదో నిర్ణయించిన తరువాత, సాధారణ విచారణ నిర్ణయమును పాపుగారి నిర్ణయమునకు సమర్పిస్తారు. ఈ సమయములో రచయితకు, రచయిత పీఠాధిపతికి/అధికారికి, ఆ విషయాలకు సంబంధించిన రోమను కూరియా విభాగాలకు సమాచారము అందిస్తారు. రచయితకు అభ్యంతరకర అంశాలను సమర్పించిన తరువాత, రచయిత వివరణ, చర్చలు భాహ్య దశలోని భాగాలు. రచయిత శ్రీసభ చట్టము ప్రకారము లెక్కించబడు మూడు నెలల గడువులో అభ్యంతంకర అంశాలపై వివరణను పంపించాలి. పీఠాధిపతి/అధికారి వారి అభిప్రాయమును కూడా సమర్పిస్తారు. రచయిత స్పందించని పక్షములో సాధారణ విచారణ అధికారులు తగు నిర్ణయాలను వెల్లడిస్తారు. రచయితతో వ్యక్తిగత సమావేశముకు కూడా అవకాశము ఉంటుంది. రచయిత వివరాలు సేకరించిన తరువాత ఏవైనక్రొత్త అంశాలు వెలుగులోకి వచ్చినట్లైతే మళ్ళీ 'కన్సుల్త' కు సమర్పిస్తారు. తగు వాదనలు, నిర్ణయాల అనంతరం, రచయిత వివరణ అభ్యంతరకర అంశాల పరిష్కారముగా ఉన్నట్లైతే, మంచి ఫలితాలను కలిగి ఉన్నట్లైతే సాధారణ విచారణ అక్కడితో ముగుస్తుంది. లేనట్లైతే విశ్వాస పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటారు. ఈ నిర్ణయాలు అందరికి తెలియపరచాలా లేదా అని నిర్ణయించి, పాపుగారి అనుమతి కొరకు సమర్పిస్తారు తరువాత రచయిత పీఠాధిపతికి/అధికారికి, సంబంధించిన పీఠాధిపతుల సమాఖ్యలకు, రోమను కూరియా విభాగాలకు తెలిపరుస్తారు.

## 4. అసాధారణ విచారణ:

ఏవైన రచనలు విశ్వాసానికి వ్యతిరేకముగా స్పష్టముగా గోచరమైనపుడు, విశ్వాస పరిరక్షణ విభాగంగా 'కాంగ్రెసో' అసాధారణ విచారణ మేరకు, అతి త్వరగా పరిశీలించాలని నిర్ణయిస్తారు. ఈ నిర్ణయము ఏదైన రచన స్పష్టముగా విశ్వాసానికి వ్యతిరేకముగా వ్రాయబడి, అది తేటతెల్లముగా గోచరమైనప్పుడు వినియోగిస్తారు. తక్షణమే పరిశీలన చేస్తారు, బహుశా అప్పటికే ఆ తప్పుడు

రచన విశ్వాసానికి కొంత హాని కలిగించి ఉండవచ్చు. ఆ రచయిత యొక్క పీఠాధిపతికి/అధికారికి, సంబంధిత రోమను కూరియా విభాగాలకు వెంటనే సమాచారము అందిస్తారు.

ఈ అసాధారణ విచారణలో భాగముగా, 'కాంగ్రెస్సో' ఒక నిపుణుల బృందమును నియమించి, తక్షణమే ఈ విశ్వాస వ్యతిరేక రచనలను, అభ్యంతరాలను నిర్ధాంచవలసినదిగా కోరతారు. నిపుణుల బృందము ఇచ్చిన నివేదికను సాధారణ విచారణ సభ్యులకు సమర్పిస్తారు, వారు మున్ముందుగా ఈ అంశాలను, అభ్యంతరాలను పరిశీలించిన తరువాత పాపుగారి అనుమతి పొందిన తక్షణమే పీఠాధిపతి/అధికారి ద్వారా రచయితకు అందజేస్తారు. ఆ తప్పుడు రచనలను, సిద్ధాంతములను సరిదిద్దుకొనుటకు రచయితకు రెండు నెలల గడువు ఇస్తారు. పీఠాధిపతి/అధికారి రచయితను ఆలకించిన తరువాత, వ్రాత పూర్వకముగా సమర్పించ అవసరత ఉన్నట్లైతే, ఆ వ్రాతపూర్వక సవరింపు, వివరణ విశ్వాస పరిరక్షణ విభాగానికి పంపిస్తారు. దానిని సాధారణ విచారణ సభ్యుల నిర్ణయానికి సమర్పిస్తారు.

## 5. విశ్వాస పరిరక్షణలో క్రమశిక్షణ చర్యలు:

ఒక వేళ సదరు రచయిత తన రచనలను తగు రీతిగా, అవసరమైతే బహిర్గతముగా సరిదిద్దుకోనట్లైతే, సాధారణ విచారణ అధికారులు, సదరు రచయిత కతోలికమత భ్రష్టత, పరిత్యాగము, రోమను పాపుగారి అధికారమును తిరస్కరించు మహా ఘోర నేరమునకు పాల్పడ్డారని నిర్ధారణ చేసినట్లైతే, విశ్వాస పరిరక్షణ విభాగము ఆ రచయిత శ్రీసభ సహవాసము నుండి తక్షణ స్వయం బహిష్కరణ శిక్షను ప్రకటిస్తారు. తక్షణ స్వయం బహిష్కరణ శిక్షకు అర్హమైన తీవ్రత లేని పక్షమున తగిన శిక్షను శ్రీసభ చట్టము, ప్రత్యేకముగా ఏర్పాటుచేయబడిన నియమముల ప్రకారము శిక్షను విధిస్తారు. ఇటువంటి విధముగా ఖరారు చేయబడిన నిర్ణయాలపై పున:పరీక్షకు అవకాశము ఉండదు. ఈ తరహా విచారణ శ్రీసభలో ఏర్పాటు చేయబడిన న్యాయస్థాన పద్దతుల ద్వారా లేదా అధికారికముగా చేపట్టే పద్దతుల ద్వారా విచారించబడతాయి. కొన్ని తీవ్రమైన పరిస్థితులలో స్వయముగా పాపుగారి నిర్ణయమునకు సమర్పించబడతాయి.

## ముగింపు:

శ్రీసభలో విశ్వాస పరిరక్షణ బాధ్యత ఎంతో ముఖ్యమైనది. రోమను కూరియా విభాగాలలో అతి ముఖ్యమైన విభాగము, విశ్వాస పరిరక్షణ విభాగము. ఈ వ్యాసములో విశ్వాస పరిరక్షణ విషయములో మూడు ముఖ్యమైన మహా ఘోర నేరాల గురించి విశ్లేషించబడింది. ఇటువంటి మహా ఘోర నేరాలను విచారించే అధికారము విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే ఉన్నా, స్థానికముగా పీఠాధిపతి/ అధికారి, విశ్వాస పరిరక్షణలో, తగు చర్యలు చేపట్టే విషయములో బాధ్యత వహిస్తారు. ఇది కేవలము పీఠాధిపతుల/అధికారుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి విశ్వాసి బాధ్యత. ఈ కొద్దిపాటి వివరణ ద్వారా ఇటువంటి మహా ఘోర నేరాలు శ్రీసభలో చోటు చేసుకోకుండా మనవంతు కృషిని అందించాలి.

# 4. దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాదమునకు విరుద్ధమైన ఘోర నేరాలు

- బ్రదర్ యంబటి మహేష్,
- బ్రదర్ ఆర్నాల్డ్ బెనెడిక్ట్

## పరిచయం


బ్రదర్ యంబటి మహేష్


బ్రదర్ ఆర్నాల్డ్ బెనెడిక్ట్

దివ్య సత్ప్రసాదము క్రైస్తవ విశ్వాసమునకు మూలము, ఆధారము అని కతోలిక సత్యోపదేశ సంక్షేమము బోధిస్తుంది (1324). దివ్యసత్ప్రసాదము కతోలిక విశ్వాసానికి ఆయువు పట్టు. క్రీస్తు ప్రభు పరమ పవిత్ర శరీరరక్తాల పవిత్రతను అందరు గౌరవ మర్యాదలతో కాపాడాలి. ఇది ప్రతి విశ్వాసి యొక్క విధి. ఈ విధిని నిర్వర్తించుటకు శ్రీసభ ఎంతో జాగ్రత్త వహిస్తుంది. క్రీస్తు శరీర రక్తాలకు ఎటువంటి అగౌరవము, అమర్యాద కలుగకుండా సంరక్షిస్తూ, దివ్య బలిపూజకు, దివ్య సత్ప్రసాదమునకు వ్యతిరేకముగా నేరములను చేసినవారిని కఠినముగా శిక్షిస్తుంది. ఈ నేరములను శ్రీసభలో మహా ఘోర నేరాల జాబితాలో చేర్చి, చట్ట పరంగా, ప్రత్యేకముగా అమలు చేయబడిన నియమముల ప్రకారము నిందితులను శిక్షించుటకు స్వయాన రోమను కూరియా విభాగమైన, విశ్వాస పరిరక్షణ విభాగానికి ఒసగబడింది. ఈ వ్యాసములో పవిత్ర దివ్య బలిపూజ, ప్రభు శరీర రక్తాలైన పవిత్ర దివ్య సత్ప్రసాదమునకు విరుద్ధమైన మహా ఘోర నేరాలను ప్రస్తావించి, వాటికి విధించే శిక్షను తెలుసుకుంటాము.

## దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాదమునకు విరుద్ధమైన మహా ఘోర నేరాలు

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్టిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3§ సం. 1–2 లో దివ్య సత్ప్రసాదము, దివ్య బలిపూజకు విరుద్ధమైన మహా ఘోర నేరాల గురించి తెలియజేస్తుంది. ఆ మహా ఘోర నేరాలు ఏవనగా:

1. దైవదూషణగావించు ఉద్దేశముతో దివ్య సత్ప్రసాదమును స్వీకరించుట, వారితో ఉంచుకొనుట, విసరి వేయుట.
2. దివ్య బలిపూజను సమర్పించుటకు నిరర్థకముగా ప్రయత్నించుట (attempt the Eucharistic Sacrifice).
3. గురువులు దివ్య బలిపూజను చేయుచున్నట్లు అనుకరించుట (simulate the Eucharistic Sacrifice).
4. కతోలిక శ్రీసభతో ఐఖ్యత లేని క్రైస్తవ సంఘాలకు చెందిన యాజకులతో కలసి దివ్య బలిపూజలో పాల్గొనుట.
5. దైవదూషణగావించు ఉద్దేశముతో కేవలము అప్పమును లేక అప్పమును, ద్రాక్షారసమును దివ్య బలిపూజ వెలుపల లేదా దివ్య బలిపూజలో ఆశీర్వదించుట.

### 1. దైవదూషణగావించు ఉద్దేశముతో దివ్య సత్ప్రసాదమును స్వీకరించుట, వారితో ఉంచుకొనుట, విసరివేయుట

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్టిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3 §1, సం. 1 దైవ దూషణగావించు ఉద్దేశముతో దివ్య సత్ప్రసాదమును, స్వీకరించుట, తీసుకొనుట, దొంగిలించుట, అపహరించుట, లాగుకొనిపోవుట, దోచుకొనుట మొదలగునవి. కతోలిక విశ్వాసులు, ఆశీర్వదింపబడిన పవిత్ర అప్పము లేదా ఆశీర్వదింపబడిన పవిత్ర రక్తము లేదా రెండింటిని దైవ దూషణ నిమిత్తము పైన చెప్పబడిన విధముగా చేసినట్లైతే ఈ మహా ఘోర నేరము చేసినవారౌతారు. ఈ నేరము దివ్య బలిపూజలో చేసినా, దివ్య బలిపూజ వెలుపల చేసినా శిక్షార్హము. ఈ నేరము దివ్య సత్ప్రసాదమును అందించు సాధారణ పరిచారకుని దగ్గర నుండి అపహరించినా,

ప్రత్యేక పరిచారకుల దగ్గర నుండి అపహరించినా శిక్షార్హము. ఇంకా వేరే విధానాలలో అపహరించినా ఈ నేరమునకు పాల్పడినట్లే, ఉదాహరణకు, దివ్య సత్ప్రసాదమును భద్రపరచు పాత్ర నుండి గాని, దివ్య బలిపూజలో వినియోగించే ప్రభు రక్తమును ఉంచు పాత్రము నుండి గాని, దివ్య మందసము నుండి గాని, పవిత్ర అవశేషాలనుంచువాటి నుండి గాని, ఆరాధనకు పవిత్ర అప్పమును ప్రదర్శించుటకు వినియోగించు పరికరము నుండి గాని, ఇంకా ఇతర పవిత్ర పాత్రల నుండి గాని అపహరించుట. ఈ నేరములో భాగముగా, దైవ దూషణ నిమిత్తము, బలవంతముగా, దోపిడితో, రహస్యముగా పవిత్ర పాత్రలను, దివ్య సత్ప్రసాదముతో గాని, దివ్య సత్ప్రసాదము లేకుండా గాని, అపహరించుట కూడా ఈ నేరమునకు పాల్పడినట్లు పరిగణించబడుతుంది.

ఈ నేరమునకు పాల్పడుటలో దైవ దూషణ నిమిత్తము, దివ్య సత్ప్రసాదమును నోటిలో స్వీకరించినా, చేతిలో స్వీకరించినా, స్వీకరించి వేరొక శరీర భాగములో ఉంచినా, దివ్య మందసము నుండి దొంగిలించినా, తీసుకొని పవిత్ర అప్పమునుంచు పరికరములో పెట్టినా, చేతి గుడ్డలో ఉంచినా, వేరొక గిన్నిలో లేదా పాత్రలో ఉంచినా, వేరే ఏదైన విధానంలో స్వీకరించినా ఈ నేరమును చేసినట్లు పరిగణింపబడుతుంది. ఇంకా కొంతమంది, దైవ దూషణ ఉద్దేశముతో దివ్య సత్ప్రసాదమును నోటిలో స్వీకరించి తరువాత నోటి నుండి బయటకు తీసి వేరొక చేతి గుడ్డలో లేదా వేరోక డబ్బాలో పెట్టి ఇంటికి తీసుకొని వేళ్ళే సందర్భాలు కూడా ఉండవచ్చు. కేవలము దివ్య సత్ప్రసాదమును స్వీకరించుట ఈ నేరమునకు పాల్పడినట్లు కాకపోయినా, దైవ దూషణ గావించు ఉద్దేశము ఉన్నట్లైతే ఈ నేరముగావించినట్లవుతుంది. ప్రస్తుత నేపద్యములో దైవ దూషణ అనగా, దివ్య సంస్కారాలను, దేవునికి అంకితము చేయబడిన వ్యక్తినిగాని, వస్తువునుగాని, స్థలమునుగాని అశుచిగావించుట, అమంగళము చేయుట. క్రీస్తు ప్రభు పవిత్ర శరీర రక్తాలను అమంగళముగావించుట చాలా తీవ్రమైనది, దుష్టమైనది. స్వయాన క్రీస్తు ప్రభుపై దాడి చేసినట్లు.

ఇటువంటి పరిస్థితులలో శ్రీసభ అధికారులు ప్రభు శరీర రక్తాలకు, దివ్య బలిపూజకు ఎటువంటి అవమానము, అగౌరవము కలుగకుండా ఎంతో అంకితభావముతో పనిచేయాలి. ఇటువంటి పరిస్థితులను క్షుణ్ణంగా విచారించి

తగిన శిక్షను విధించి, తగిన ప్రాయశ్చిత్తమును చేయాలి. ప్రత్యేక చర్యలు, నియమముల ద్వారా ఇటువంటి నేరాలు జరుగకుండా పర్యవేక్షించాలి. ముఖ్యముగా ఇటువంటి నేరాలు, మూఢనమ్మకాల వలన, అదుపులేని భావోద్వేగాల వలన, ముఖ్యముగా అనైతికమైన కామము లేదా కొన్ని మానసిక వైపరీత్యాల వల్ల జరిగే ప్రమాదము ఉన్నది. ఇటువంటి నేరాలు, చాలా సందర్భాలలో అశు చికరమైన, క్షుద్రమైన, లైంగిక, అసభ్యకరమైన, భక్తిహీనమైన, క్షుద్ర బలులు, మాంత్రికమైన, దుష్టాత్మల, సైతాను పూజలకు వినియోగించు ఉద్దేశముతో అపహరిస్తుంటారు. ఇంకా దివ్య సత్ప్రసాదమును దొంగిలించి జంతువులకు తినిపించుట, పవిత్ర అప్పమును ప్రభు రక్తమును అసభ్యకరమైన, భక్తిహీనమైన పనులకు వినియోగించుట, నల్ల పూజ/సైతాను పూజ (black mass), సైతాను ఆరాధన క్రియలకు, మాంత్రిక పూజలకు, మూఢాచారాలకు, సోది, చనిపోయిన వారితో సంభాషించుటకు, ఇతర తాంత్రిక పూజలకు వాడే ప్రమాదము ఉంటుంది. ఇటువంటి దైవ దూషణగావించు ప్రవర్తనను వెంటనే నిర్ధారించి, తగు చర్యలు వెంటనే చేపట్టాల్సిన బాధ్యత ప్రతి విశ్వాసికి ఉంది అత్యంత ముఖ్యముగా శ్రీసభ అధికారులకు ఉంది.

ఉద్దేశపూర్వకముగా దివ్య సత్ప్రసాదమును విసరివేయుట లేదా నోటి నుండి బయటకు ఊయుట. దీనినే లతీను భాషలో “అబిఎక్సియో” (abiectio) అని పిలుస్తారు. అకస్మాత్తుగా వాంతిచేసుకొనుట, అనారోగ్యముతో లేదా అకస్మాత్తు కదలిక వలన, దగ్గు వలన దివ్య సత్ప్రసాదము నోటి నుండి బయటకు జారి పడినట్లైతే ఈ మహా ఘోర నేరము చేసినట్లు కాదు. అకస్మాత్తుగా అనుకోకుండా దివ్య సత్ప్రసాదము చేతి నుండి లేదా నోటి నుండి నేల మీద జారవిడిచినా ఈ నేరము చేసినట్లు కాదు. అటువంటి సందర్భాలలో దైవార్చన నియమాలలో తెలియపరచిన విధముగా స్పందించవలెను. ఏది ఏమైనా అనాలోచితముగా అవాంతరాలు జరుగకుండా కడు జాగ్రత్తలు తీసుకోవాలి, దివ్య సత్ప్రసాదమునకు ఎటువంటి అమర్యాద కలుగకుండా శ్రద్ధ వహించాలి.

ఈ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు శ్రీసభ విధించే శిక్ష, శ్రీసభ సహవాసము నుండి అపోస్తోలిక పీఠ అధికారమునకు అప్పగింపబడిన తక్షణ స్వయం బహిష్కరణ. ఈ నేరము అంర్గతముగా గావింపబడిన యెడల అపోస్తోలిక

ప్రాయశ్చిత్త విభాగమునకు (Apostolic Penitentiary) అప్పగింపబడుతుంది లేని పక్షమున అనగా బహిరంగముగా నేరమునకు పాల్పడినట్లైతే విశ్వాస పరిరక్షణ విభాగానికి (Dicastery for the Doctrine of the Faith) అప్పగించబడుతుంది. ఈ నేరమునకు పాల్పడిన వ్యక్తి యాజక అంతస్థుకు చెందిన వారైతే ఇంకా ఇతర శిక్షలతో పాటు, గురు పదవి నుండి కూడా తొలగించబడి, జీవితాంతము ప్రాయశ్చిత్తము చేయు శిక్ష విధించబడుతుంది.

## 2. దివ్య బలిపూజను సమర్పించుటకు నిరర్థకముగా ప్రయత్నించుట (attempt the Eucharistic Sacrifice)

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3 §1, సం. 2 దివ్య బలిపూజను సమర్పించుటకు నిరర్థకముగా ప్రయత్నించుట అనే మహా ఘోర నేరము గురించి తెలియజేస్తుంది. ఈ మహా ఘోర నేరము పవిత్ర దివ్య బలిపూజను గురుపట్టాభిషేకము పొందని వ్యక్తి చేత నిరర్థకముగా ప్రత్నింపబడుట. గురు పట్టాభిషేకము పొందిన గురువులు మాత్రమే దివ్య బలిపూజను సమర్పించగలరు లేదా అప్ప ద్రాక్ష రసములను క్రీస్తు ప్రభు శరీర రక్తాలుగా ఆశీర్వదించగలరు. శ్రీసభ చట్టము (శ్రీ.చ.) 900 §1 ప్రకారము క్రీస్తు స్థానములో దివ్య బలిపూజను అర్పింపగల వ్యక్తి కేవలము గురు పట్టాభిషేకము పొందిన గురువు మాత్రమే. ఇంకా శ్రీ.చ. 907 డీకనులు/ఉపగురువులు లేదా సామాన్య విశ్వాసులు దివ్య బలిపూజ చేయుటకు అనర్హులుగా తెలియజేస్తుంది. అభిషిక్త గురువుకే అంకితము చేయబడిన కృతజ్ఞతా ప్రార్థన, సంజ్ఞలు కూడా గురుత్వములో లేని వారు చెప్పకూడదు, చేయకూడదు.

శ్రీ.చ. 1379 §1, సం. 1లో ప్రస్తావించబడిన నేరము ఈ విధముగా వివరిస్తుంది. "ఎవరైతే దైవార్చన కార్యమైన దివ్య బలిపూజను నిరర్థకముగా సమర్పించుటకు ప్రయత్నిస్తారో, వారు శ్రీసభలో తక్షణ శిక్షయైన నిషేధమునకు (*latae sententiae* penalty of interdict), డీకను/ఉపగురువు అయితే తాను పొందిన డీకను/ఉపగురువు పదవి నుండి శ్రీసభలో తక్షణ శిక్షయైన (పదవి నుండి) నిర్బంధనకు (*latae sententiae* suspension) లోనవుతారు". ఈ నేరమును అపాదించుటకు వారు ఉద్దేశపూర్వకముగా దివ్య బలిపూజలోని,

కేవలము అభిషిక్త గురువుకు మాత్రమే కేటాయించబడిన కృతజ్ఞతా ప్రార్థనను, అప్పద్రాక్షరసాల ఆశీర్వాద ప్రార్థనతో సహా చెప్పినపుడు, అక్కడ ఉన్నవారు దివ్య బలిపూజ జరుగుతున్నదన్న ఊహాలో ఉన్నట్లైతే ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లే.

గురుత్వములో లేని వారు నిరర్థకముగా దివ్య బలిపూజను దైవార్చన పూజా పుస్తకములో ఉన్న విధముగా పూర్తిగా చేయుట మాత్రమే గాక, కృతజ్ఞతా ప్రార్థనలోని ముఖ్య భాగమైన ఆశీర్వాద ప్రార్థనను చెప్పుట/నిర్వహించుట ద్వారా కూడా ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినవారౌతారు. ఈ మహా ఘోర నేరమును ఆపాదించుటకు, కృతజ్ఞతా ప్రార్థనలోని ముఖ్య భాగమైన ఆశీర్వాద ప్రార్థనను చెప్పుట/నిర్వహించుట చాలు. సామాన్య విశ్వాసులైతే శ్రీసభలో తక్షణ శిక్షయైన నిషేధమునకు (*latae sententiae* penalty of interdict), డీకను/ఉపగురువు అయితే తాను పొందిన డీకను/ఉపగురువు పదవినుండి శ్రీసభలో తక్షణ శిక్షయైన (పదవినుండి) నిర్బంధనకు (*latae sententiae* suspension) లోనవుతారు. ఈ కోణములో చూసినప్పుడు శ్రీ.చ. 1041 సం. 6 ప్రకారము, ఒక డీకను/ఉపగురువు, గురుత్వాభిషేకము పొందక మునుపు, గురువుకు లేదా పీఠాధిపతి పదవిలో ఉన్నవారు చేయ వలసిన దైవార్చన కార్యాలను తాను నిర్వహించినట్లైతే, శ్రీ.చ. 1044 §1 సం. 3 ప్రకారము తాను పొందిన డీకను పదవి ద్వారా పొందిన పరిచర్యను కొనసాగించుటకు వీలుండదు.

## 3. గురువులు దివ్య బలిపూజనుచేయుచున్నట్లు అనుకరించుట (simulate the Eucharistic Sacrifice)

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3 §1, సం. 3 గురువులు దివ్య బలిపూజను చేయుచున్నట్లు అనుకరించుట (simulation of the Eucharistic Sacrifice) గురించి తెలియజేస్తుంది. శ్రీ.చ. 1379 §5 ప్రకారము ఎవరైతే దివ్య సంస్కారాలను నిర్వహిస్తున్నట్లు నటిస్తారో వారికి తగిన శిక్షను విధించాలి అని తెలియజేస్తుంది. శ్రీ.చ. 1379 §5 ప్రత్యేకముగా దివ్య బలిపూజ గురించి మాట్లాడకపోయినా, ప్రతి దివ్య సంస్కారాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన శిక్ష విధించాలని తెలియజేస్తుంది. కాని "నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్",

*(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3 §1, సం. 3 ప్రకారము ఎవరైతే దివ్య బలిపూజను నిర్వహిస్తున్నట్లు, పాప సంకీర్తనమును వినుచున్నట్లు అనుకరణ/నటన మహా ఘోర నేరాల జాబితాలో చేర్చబడ్డాయి.

దివ్య సంస్కారాలను నిరర్థకముగా నిర్వహించుటకు ప్రయత్నించుటకు, దివ్య సంస్కారాలలు నిర్వహిస్తున్నట్లు అనుకరించడానికి తేడా గమనించాలి. గురుత్వములో లేని వారు, దివ్య బలిపూజను ఇంకా కేవలము గురుత్వములో ఉన్న వారు మాత్రమే నిర్వహించగలిగిన దివ్య సంస్కారాలను నిర్వహించుటకు నిరర్థకముగా ప్రయత్నించుట అవుతుంది. గురుత్వములో ఉన్న వారు, వారు దివ్య సంస్కరములను నిర్వహించు అధికారము కలిగినా కొన్ని సందర్భాలలో, ముఖ్యముగా దివ్య సంస్కారాలను నిర్వహించ నిషేధించబడిన పరిస్థితులలో గురువులు, దివ్య సంస్కారాలను నిర్వహిస్తున్నట్లు అనుకరిస్తారు/నటిస్తారు. అనుకరించు వారికి గురుత్వము ఉండి, ఆ దివ్య సంస్కరమును నిర్వహించు స్థితిలో లేరని తెలిసినా వారు ఆ దివ్య సంస్కరమును నిర్వహిస్తున్నట్లు అనుకరిస్తారు లేదా నటిస్తారు. ప్రస్తుతము మనము పరిశీలించే మహా ఘోర నేరము దివ్య బలిపూజను అనుకరించు మహా ఘోర నేరము. ఈ నేరమునకు గురుత్వ అభిషేకమును పొందినవారు మాత్రమే పాల్పడగలరు. గురుత్వములో ఉన్న వారు దివ్య బలిపూజను చేయు అధికారము కలిగియున్న, భాహ్యముగా వారు దివ్య బలిపూజను సమర్పిస్తున్నట్లు గోచరించినా అంతర్గతముగా వారికి ఉద్దేశములేని యెడల లేదా కొన్ని పరిస్థితులలో వారు శ్రీసభ చట్టము చేత దివ్య బలిపూజ నిర్వహించకుండా నిర్భందింపబడినపుడు వారు కేవలము దివ్య బలిపూజ చేస్తున్నట్లుగా అనుకరిస్తారు లేదా నటిస్తారు. కాబట్టి ఈ రెండు మహా ఘోర నేరాల మధ్య తేడాను గమనించాలి. గురుత్వములో లేని వారు చేసే నేరము దివ్య సంస్కారాలను నిరర్థకముగా నిర్వహించుటకు ప్రయత్నించుట (Attempted celebration of Sacrament), దివ్య సంస్కారాలను అనుకరించు మహా ఘోర నేరము, గురుత్వములో ఉన్న వారు, ఆ దివ్య సంస్కారాలను నిర్వహించగలిగి, ఆ ఉద్దేశమును వ్యక్తనరచకుండా, కేవలము అనుకరించుట వలన (Simulation of celebration of Sacrament), విశ్వాసులను ఆ దివ్య సంస్కారాలు నిర్వహిస్తున్నట్లు వారిని ప్రక్క త్రోవలో నడిపించుట చాలా ఘోరమైన విషయము.

దివ్య సత్ప్రసాదము, దివ్య బలిపూజ సంస్కారములను అనుకరించు మహా ఘోర నేరములలో భాగముగా ఉద్దేశపూర్వకముగా, దివ్య బలిపూజలో ఆశీర్వదింపబడని అప్పమును, ద్రాక్షరసమును ప్రజలకు దివ్య సత్ప్రసాదముగా పంచుట ఈ నేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడుతుంది. శ్రీ.చ. 1379 §5 ప్రకారము, ఈ మహా ఘోర నేరాలకు పాల్పడినవారికి తగిన శిక్ష విధించాలని విశదపరుస్తుంది.

## 4. కతోలిక శ్రీసభతో ఐఖ్యత లేని క్రైస్తవ సంఘాలకు చెందిన యాజకులతో కలసి దివ్య బలిపూజలో పాల్గొనుట.

“నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్”, *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3 §1, సం. 4 కతోలిక శ్రీసభతో ఐక్యత లేని క్రైస్తవ సంఘాలకు చెందిన పరిచారకులతో కలసి దివ్య బలిపూజ నిర్వహించుట/పాల్గొనుట గురించి తెలియజేస్తుంది. ఈ మహా ఘోర నేరము అపోస్తోలిక వారసత్వమునుగాని, గురుపట్టాభిషేక గౌరవమును గుర్తించని కతోలికేతర పరిచారకులతో కలసి దివ్య బలిపూజను సమర్పించుట లేదా వారు నిర్వహించే సాంఘ్యములో కలసి కొనియాడుటను గురించి పరిగణిస్తుంది. శ్రీ. చ. 908, తూ.శ్రీ.చ. 702, కతోలికేతర పరిచారకులతో ముఖ్యముగా కతోలిక శ్రీసభతో ఐఖ్యతలేని క్రైస్తవ సంఘాల పరిచారకులతో కలసి దివ్య బలిపూజను కొనియాడుటను బహిష్కరిస్తున్నాయి. ఈ మహా ఘోర నేరము ప్రత్యేకముగా గురుత్వములో ఉన్న వారిని ఉద్దేశించి ఏర్పాటుచేయబడినది. ఈ మహా ఘోర నేరమును విచారించు అధికారము విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే ఇవ్వబడింది. ఈ మహా ఘోర నేరమునకు పాల్పడిన గురువులకు శ్రీ. చ. 1381 ప్రకారము, తగిన శిక్షను విధించాలని విశదపరుస్తుంది.

## 5. దైవదూషణగావించు ఉద్దేశముతో కేవలము అప్పమును లేక అప్పమును, ద్రాక్షారసమును దివ్యబలిపూజ వెలుపల లేదా దివ్య బలిపూజలో ఆశీర్వదించుట.

“నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్”, *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 3 §2, దైవదూషణగావించు

ఉద్దేశముతో కేవలము అప్పమును లేక అప్పమును, ద్రాక్షారసమును దివ్య బలిపూజ వెలుపల లేదా దివ్య బలిపూజలో ఆశీర్వదించుట అను మహా ఘోర నేరము గురించి తెలియజేస్తుంది. ఈ మహా ఘోర నేరమును విచారించుటకు విశ్వాస పరిరక్షణ విభాగమునకు మాత్రమే కలదు. ఈ మహా ఘోర నేరమునకు పాల్పడిన గురువులకు తీవ్రతను బట్టి తగిన శిక్షను విధించాలని, అవసరమైతే గురుత్వము నుండి తొలగించుట లేదా జీవితాంతము ప్రాయశ్చిత్తము, పశ్చాత్తాపమును చేయుటకు కొరకు వారికి శిక్ష విధించాలని శ్రీ.చ. 1382 §2 తెలియజేస్తుంది. శ్రీ.చ. 927 "క్లిష్ట పరిస్థితులలో సైతం అప్పద్రాక్షరసములలో కేవలము అప్పమును గాని లేదా కేవలము ద్రాక్షారసమును గాని, దివ్య బలిపూజ వెలుపల రెండింటిని గాని ఆశీర్వదించరాదు". పైన చెప్పబడిన విధముగా ఎట్టి పరిస్థితులలోను చేయరాదు. దైవ దూషణ నిమిత్తమై ఈ విధముగా చేసిన వారిని మహా ఘోర నేరమునకు పాల్పడిన వారినిగా పరిగణించి వారిని విచారించు అధికారము కేవలము విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే ఇవ్వబడింది.

ఈ క్రింద ఉదహరింపబడిన వాటిలో దైవ దూషణ నిమిత్తము అప్పద్రాక్షరసములలో కేవలము అప్పమును గాని లేదా కేవలము ద్రాక్షారసమును గాని, దివ్యపూజ వెలుపల రెండింటిని గాని ఆశీర్వదించుట అను మహా ఘోర నేరముగా పరిగణింపవచ్చు.

1. దైవ దూషణ నిమిత్తమై దివ్య బలిపూజలో ద్రాక్షారసము లేకుండ కేవలము అప్పమును మాత్రమే ఆశీర్వదించుట.
2. దైవ దూషణ నిమిత్తమై దివ్య బలిపూజ వెలుపల ద్రాక్షారసము లేకుండ కేవలము అప్పమును మాత్రమే ఆశీర్వదించుట.
3. దైవ దూషణ నిమిత్తమై దివ్య బలిపూజలో అప్పము లేకుండ కేవలము ద్రాక్షారసమును మాత్రమే ఆశీర్వదించుట.
4. దైవ దూషణ నిమిత్తము దివ్య బలిపూజ వెలుపల ద్రాక్షారసము లేకుండ కేవలము అప్పమును మాత్రమే ఆశీర్వదించుట.
5. దైవ దూషణ నిమిత్తము దివ్య బలిపూజలో అప్పమును, ద్రాక్షారసమును ఆశీర్వదించుట.

6. దైవ దూషణ నిమిత్తము దివ్య బలిపూజ వెలుపల అప్పమును, ద్రాక్షారసమును ఆశీర్వదించుట.

యాజక వర్గములో ఉన్న వారు పైచెప్పబడిన వాటిలో ఏది చేయుటకు ప్రయత్నించినా, ప్రోత్సహించినా, ఆ తీవ్రతను బట్టి తగు శిక్షను పొందుతారు, అవసరమైన యెడల యాజక పదవి నుండి కూడా తొలగించబడి, జీవితాంతము ప్రాయశ్చిత్తము చేయుట కొరకు శిక్షను పొందుతారు.

**ముగింపు**

దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాదములు కతోలిక క్రైస్తవ జీవితానికి అతి ప్రాముఖ్యమైనవి. దివ్య బలి పూజ మానవాళి రక్షణకై స్వయాన క్రీస్తు ప్రభు సమర్పించిన రక్షణ బలి. ఈ దివ్య బలిని, యాజకుడు, బలి గొర్రెపిల్లయైన క్రీస్తు ప్రభు స్థానములో గురువు అనుదినము తండ్రి దేవునకు సమర్పిస్తారు. ఈ దివ్య సంస్కారమును నిర్వహించునది కేవలము గురత్వాభిషేకము పొందిన గురువులు మాత్రమే. సామాన్య విశ్వాసులు ఈ దివ్య సంస్కారమును నిర్వహించరాదు. వారు నిర్వహించుటకు ప్రయత్నించినా అది నిరర్థకముగా ప్రయత్నించుట అవుతుంది. శ్రీసభలో కొన్ని తక్షణ శిక్షలకు లోనైన గురువులు, నిర్వహించు స్థితిలో లేనివారై ఉద్దేశపూర్వకముగా నిర్వహించినా, నిర్వహిస్తున్నట్లు అనుకరించినా, వారు మహా ఘోర నేరమునకు పాల్పడినవారు అవుతారు. దివ్య సత్ప్రసాదము మన ఆత్మలకు ఆహారమైన స్వయాన క్రీస్తు ప్రభుని శరీర రక్తములు. ఆ ప్రభు శరీర రక్తాలను ప్రతి విశ్వాసి కడు భక్తితో, వినయముతో స్వీకరించాలి. దైవ దూషణగావించరాదు. అందుకు పాల్పడిన వారికి శ్రీసభ కఠినమైన శిక్షను విధించి, ప్రభు శరీర రక్తాల పవిత్రతను, గౌరవమును కాపాడుటకు ప్రయత్నిస్తుంది. దైవ దూషణగావించు ఉద్దేశముతో దివ్య సత్ప్రసాదమును అపహరించుట మొదలగునవి జరుగకుండా విశ్వాసులుగా మనమందరము మెలకువతో ఉండాలి. అటువంటి సందర్భాలు తటస్థపడినపుడు శ్రీసభ అధికారులకు వెంటనే తెలియపరచి తగు జాగ్రత్తలు తీసుకొనుటకు ప్రతి విశ్వాసి పాటుపడాలి. ఆ సంర్భాలలో శ్రీసభ అధికారుల ఉత్తరువు మేరకు తగు పరిహార ప్రార్థనలు, ప్రాయశ్చిత్తము చేయాలి.



**అనువాదము: - బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్**

# 5. పాప మన్నిపు దివ్య సంస్కారమునకు విరుద్ధమైన ఘోర నేరాలు

–బ్రదర్ చిట్టెం మధు కుమార్, బ్రదర్ పెదపూడి అంతోని రాజు, బ్రదర్ రుద్రపాటి ప్రవీణ్

## పరిచయం


బ్రదర్ చిట్టెం మధు కుమార్


బ్రదర్ పెదపూడి అంతోని రాజు


బ్రదర్ రుద్రపాటి ప్రవీణ్

పశ్చాత్తాపపడిన వ్యక్తి యొక్క పాపములను క్షమించు అధికారమును క్రీస్తు ప్రభు అపోస్తులులకు ఇచ్చినట్లుగా పరిశుద్ధ గ్రంథములో చూస్తున్నాము. ఈ అధికారమునే శ్రీసభలో యాజక పరిచర్యలో ఉన్న పీఠాధిపతులకు, గురువులకు అపోస్తోలిక వారసత్వమున పీఠాధిపతులకు, వారి ద్వారా గురువులకు ఇవ్వబడినది. ఈ విషయమునే శ్రీసభ చట్టం 965 ప్రస్తావిస్తుంది. రెండవ వాతికను మహాసభ బోధనల ప్రకారం గురుత్వం అనే దివ్యసంస్కారములో, గురువు పరిశుద్ధాత్మ అభిషేకము ద్వారా ఒక ప్రత్యేకమైన ముద్రను పొంది, క్రీస్తు అనుచరునిగా, ఇంకను ప్రత్యేకముగా క్రీస్తు ప్రభుని స్థానములో మెలుగుటకు అర్హుడుగా నియమించబడును. కాని, ఈ పాప మన్నింపు దివ్య సంస్కారమును నిర్వహించుటకు కేవలము గురుత్వ అభిషేకము మాత్రమే కాక ప్రాంతీయ పీఠాధిపతుల ఉత్తరువుల మేరకు మాత్రమే పాప మన్నింపు అధికారమును వినియోగించుకొనగలరు. అభిషేకము పొందిన గురువులు తప్పని పరిస్థితులలో, మరణాపాయ స్థితిలో మాత్రమే పాపమన్నింపును అందించు

అధికారమును కలిగియుందురు. అట్లు కాక అతిక్రమించి చేయుదానిని పాప మన్నింపు అధికార వినియోగము నిరర్థకముగా ప్రయత్నించుట (Attempted Absolution) అని శ్రీసభ పరిగణిస్తుంది. పాప సంకీర్తన దివ్య సంస్కారమునకు వ్యతిరేకముగా చేయు నేరములను ఉద్దేశించి చట్టమును, ఆ నేరముల విచారణ నియమములను ఏర్పాటు చేయుట యొక్క ముఖ్య ఉద్దేశము పాప సంకీర్తన దివ్య సంస్కార పవిత్రతను కాపాడుటకు, పాప సంకీర్తన దివ్య సంస్కార సాంగ్యమును నిర్వహించు గురువు, పాప మన్నింపుకోరు విశ్వాసి యొక్క సమగ్రతను కాపాడుటకు ఆ దివ్య సంస్కారమును పవిత్రముగా నిర్వహించుట కొరకు ఏర్పాటుచేయబడ్డాయి.

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1 పాప మన్నింపు దివ్య సంస్కారమునకు విరుద్ధమైన మహా ఘోర నేరాల గురించి తెలియజేస్తుంది. అవి ఏవనగా:

1. గురువు పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధముగా ఎవరితో కలసి పాపము చేశాడో వారికి పాప మన్నింపును నిరర్థకముగా అందించుట.
2. నిరర్థకముగా పాపమన్నింపును ఇచ్చుట (Attempted Sacramental Absolution), నిషేదింపబడిన గురువు పాప సంకీర్తనమును వినుట.
3. పాప మన్నింపును ఒసగుచున్నట్లు అనుకరించుట (Simulation of the sacramental absolution).
4. పాప సంకీర్తన సమయములోగాని, పాప సంకీర్తన నెపముతోగాని, పాప సంకీర్తన దివ్య సంస్కారమును ఒసగు గురువుతో, పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయుటకు ప్రేరేపించుట. (Solicitation to sin against the sixth commandment of the Decalogue).
5. ప్రత్యక్షముగా లేక పరోక్షముగా పాప మన్నింపు దివ్య సంస్కారములో వెల్లడించిన (పాప సంకీర్తన ముద్రకు సంబంధించిన విషయాలను) బహిర్గతము చేయుట (Direct and Indirect violation of the Sacramental Seal).

6. పాప సంకీర్తన దివ్య సంస్కారములో వెలువరించబడిన విషయాలను ఏదైన ఆధునిక సాంకేతిక పరికరాలతో రికార్డు చేయుట లేదా దురుద్దేశముతో ఏదైన ప్రసార మాధ్యమాలలో వాటిని ప్రచురించి బహిర్గతము చేయుట.

## 1. గురువు పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధముగా ఎవరితో కలసి పాపము చేశాడో వారికి పాపమన్నింపును నిరర్థకముగా అందించుట

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1, సం. 1 గురువు పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధముగా ఎవరితో కలసి పాపము చేశాడో వారికి పాప మన్నింపును నిరర్థకముగా అందించుట అను మహా ఘోర నేరము గురించి తెలియజేస్తుంది. శ్రీ.చ. 977 ఈ విధముగా తెలియజేస్తుంది. "(గురువు) పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధముగా ఎవరితో కలసి పాపము చేశాడో వారికి పాప మన్నింపును మరణాపాయ స్థితిలో తప్ప ఇతర సందర్భాలలో దయచేసినట్లైన అది చెల్లదు". ఈ మహా ఘోర నేరము ఒక గురువు పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా చేయు పాపములలో సహచరులైన వారికి పాప మన్నింపును దయచేయుట నేరము, శిక్షార్హము. కాని, ఒక గురువు ఎవరితోనైతే ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేశాడో ఆ వ్యక్తి మరణాపాయ స్థితిలో ఉన్నట్లైతే పాప మన్నింపును దయచేయవచ్చు. ఈ సదుపాయము, మరణాపాయ స్థితిలో ఉన్న విశ్వాసి ఆత్మ రక్షణ నిమిత్తమై దయచేస్తుంది. మిగతా అన్ని సందర్భాలలో అటుల పాప మన్నింపును దయచేసినట్లైతే శ్రీ.చ. 1384 ప్రకారము ఆ గురువు అపోస్తోలిక పీఠ పరిధికి చెందిన శ్రీసభ సహవాసము నుండి తక్షణ స్వయం బహిష్కరణకు గురౌతాడు (*Latae Sententiae* excommunication reserved to the Apostolic See).

పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా చేయు పాపములు, విరక్తత్వమునకు, పవిత్ర జీవితమునకు వ్యతిరేకముగా చేయు పాపములు. ఈ మహా ఘోర నేరములో ముఖ్యమైన అంశాలు:

1. విరక్తత్వమునకు వ్యతిరేకముగా పాపము చేయుట. 2. శ్రీసభ నియమాలకు వ్యతిరేకముగా చేయు నేరము. 3. పాప మన్నింపును దయచేసిన యెడల చెల్లదు,

ఎందుకనగా అటుల చేసిన గురువు నిరర్థకముగా పాప మన్నింపును దయచేయును కనుక పాప మన్నింపుకోరు ఆ వ్యక్తికి పాప మన్నింపు లభింపదు. 4. ఆ గురువు అపోస్తోలిక పీఠ పరిధికి చెందిన శ్రీసభ సహవాసము నుండి తక్షణ స్వయం బహిష్కరణకు గురౌతాడు (*Latae Sententiae* excommunication reserved to the Apostolic See). ఒక వేళ గురువు, ఎవరితోనైతే ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేశాడో వారని గుర్తించక పాప మన్నింపును దయచేసినట్టైనా ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడదు. ఆ వ్యక్తిని గుర్తించి, పాప మన్నింపును దయచేసినట్టైతేనే ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడును. కేవలము పాప సంకీర్తన వినుట వలన కాక, పాప మన్నింపును దయచేసినట్టైతేనే ఆ మహా ఘోర నేరము చేసినట్లుగా పరిగణింపబడును. ఒక వేళ గురుత్వాభిషేకము పొందక ముందు ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేసిన వ్యక్తి ఆ గురువు చెంతకు పాప మన్నింపుకోరి వచ్చినా పాప మన్నింపు చెల్లదు. ఒక వేళ ఆ వ్యక్తి గురువుతో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేసి, తరువాత వేరొక గురువు దగ్గర పాప సంకీర్తన చేసి ఆ పాపమునకు మన్నింపును పొందుకున్నట్టైతే, తరువాత ఇతర సందర్భాలలో ఆ గురువు దగ్గరకు పాప మన్నింపు కొరకు వెళ్ళవచ్చు.

## 2. నిరర్థకముగా పాపమన్నింపు ఇచ్చుట (Attempted Sacramental Absolution), నిషేదింపబడిన గురువు పాప సంకీర్తనమును వినుట.

పాప విమోచన, పాప క్షమాపణ పొందడంలో అభిషిక్త గురువుల పాత్రపై కతోలిక శ్రీసభ తన బోధనను, యోహాను 20:23 ను అధారముగా చేసుకొని "ఎవరి పాపములనైన మీరు క్షమించిన యెడల, అవి క్షమింపబడును. క్షమించని యెడల అవి క్షిమింపబడవు", అనే సువిశేష ఆధారిత అపోస్తోలిక వారసత్వము ద్వారా పొందిన అధికారమును శ్రీసభలో అపోస్తలుల వారసులైన పీఠాధిపతులు, వారి గురుత్వములో పాలుపంచుకొను గురువుల పరిచర్య ద్వారా దేవుని క్షమానుగ్రహము నిరంతరాయముగా కొనసాగుతుంది. యాజకత్వములో ప్రథమ శ్రేణికి చెందిన పీఠాధిపతులు, రెండవ శ్రేణికి చెందిన గురువులు పాప మన్నింపు దివ్యసంస్కారము ద్వారా పాపములను క్షమించు అధికారమును, గురుత్వాభిషేకము

ద్వారా పొందుతారు. (శ్రీసభ చట్టము (శ్రీ.చ.) 965, తూర్పు దేశాల శ్రీసభల చట్టం (తూ.దే.శ్రీ.చ.) 722§1) పాప విమోచనమును అందించుటకు కేవలము గురుత్వాభిషేకము మాత్రమే కాక, గురుత్వాభిషేకము ద్వారా పొందిన గురుత్వాధికారమును పాప మన్నింపు విషయమై విశ్వాసుల ప్రయోజనము కొరకు వినియోగించుటకు పీఠాధిపతుల ఉత్తరువులు తప్పనిసరి. మరణాపాయ పరిస్థితి విడచి ఇతర సాధారణ పరిస్థితులలో ఈ అధికారమును పీఠాధిపతుల ఉత్తరువులు లేనిదే వినియోగించరాదు. అటుల వినియోగించిన గురువులను, కేవలము పాప మన్నింపు ఒసగుచున్నట్లు అనుకరించు (simulated absolution) వారినిగా పరిగణిస్తుంది.

కథోలిక శ్రీసభ చట్ట ప్రకారము గురుత్వాభిషేకము ద్వారా గురుత్వ అంతస్తులో ఉన్న వారు మాత్రమే పాప మన్నింపును దయచేయగలరు. కాని, చట్ట పరంగా గురుత్వ అంతస్తు, పీఠాధిపతుల ఉత్తరువులను కలిగియుండవలెను. రోమను కతోలిక శ్రీసభ చట్టము 965, తూర్పు దేశాల శ్రీసభ చట్టము 722 ప్రకారము కేవలము అభిషిక్త గురువు మాత్రమే పాప మన్నింపును ఇవ్వగలరు. కాని ప్రత్యేక అధికారిక ఉత్తరువుతో మాత్రమే పాప మన్నింపును గురువులు విశ్వాసులకు ప్రసాదించగలరు. శ్రీ.చ. 966 §1 గురువు ఈ పాప పరిహార అధికారమును పొందుటను గురించి వివరిస్తుంది. శ్రీ.చ. 966 §2 ప్రకారము, ఒక గురువు చట్ట ప్రకారము అధికారము పొందవచ్చును లేదా అధికారము కలిగిన వారి వద్ద నుండి శ్రీ.చ. 969 ప్రకారము పొందవచ్చును. అధికారిక ఉత్తరువులు లేనిదే పాప పరిహార దివ్య సంస్కార సాంగ్యమును నిర్వహించుట న్యాయ బద్ధమైనది కాదు. అనుమతి లేని దివ్య సంస్కార నిర్వహణ, విలువలేని అట్టి సాంగ్యము ఎట్టి ఫలితమును తీసుకురాలేదు. అట్టి ప్రయత్నము అక్రమము.

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1, సం. 2 నిరర్థకముగా పాపమన్నింపును ఇచ్చుట (Attempted Sacramental Absolution), నిషేదింపబడిన గురువు పాప సంకీర్తనమును వినుట గురించి తెలియజేస్తుంది. ఈ నేరమునే శ్రీ.చ. 1379 §1, 2 ప్రస్తావించి ఎవరైతే ఈ నేరమునకు పాల్పడతారో వారిని, యాజక హోదాలో లేని వారైతే శ్రీసభ నుండి తక్షణ స్వయం శిక్షను

పొందుతారు (*Latae Sententiae* Interdict), యాజక హోదాలో ఉన్న వారైతే శ్రీసభ పరిచర్య నుండి తక్షణ స్వయం బహిష్కరణకు గురౌతారు (*Latae Sententiae* Suspension). నిరర్థకముగా పాప మన్నింపును ఇచ్చుట అను మహా ఘోర నేరము (Attempted Sacramental Absolution) ఈ క్రింది సందర్భాలలో పాల్పడు ప్రమాదము ఉన్నది.

1. ఒక విశ్వాసి గురువు కాక, లేదా పీఠాధిపతి కాక, పాప సంకీర్తనమును వినుట, పాప మన్నింపు ప్రార్థన చేయకపోయిన కేవలము పాప సంకీర్తనము వినుట వలన ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లు పరిగణింపబడుతుంది.
2. ఒక విశ్వాసి గురువు కాక, లేదా పీఠాధిపతి కాక, పాప మన్నింపు పార్థన ఉచ్చరణ ద్వారా పాప మన్నింపును దయచేయుటకు ప్రయత్నించుట ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లు పరిగణింపబడుతుంది.
3. ఒక అభిషిక్త గురువు లేదా పీఠాధిపతి పాప సంకీర్తనమును వినుటకు ఉత్తరువులు లేనప్పుడు ఉద్దేశపూర్వకముగా పాప మన్నింపును ఒసగుటకు ప్రయత్నించుట (attempt to absolve) లేదా పాప మన్నింపును ఒసగుచున్నట్లు అనుకరించుట (simulation of the sacrament). పాప సంకీర్తన కొరకు విచ్చేసిన విశ్వాసికి పాప సంకీర్తనమును ఒసగుచున్నట్లు మోసపూరితముగా ప్రవర్తించుట ఈ మహా ఘోరనేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడుతుంది.
4. గురుత్వాభిషేకము చెల్లని గురువు లేదా పీఠాధిపతి నిరర్థకముగా పాప మన్నింపును దయచేయుటకు ప్రయత్నించుట లేదా పాప మన్నింపు ప్రార్థన ఉచ్చరించకపోయినా పాప సంకీర్తనమును వినుచున్నట్లుగా అనుకరించుట, ఈ మహా ఘోరనేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడుతుంది.
5. ఒక సామాన్య విశ్వాసి, ఉపగురువు, గురువు, పీఠాధిపతి పశ్చాత్తాప క్రమమును నిర్వహించుటకు ఉత్తరువులు లేకుండా, పాప సంకీర్తనము విను ఉద్దేశముతో పశ్చాత్తాప క్రమమును ప్రారంభించుట, పాప మన్నింపు ప్రార్థనతో లేదా పాప మన్నింపు ప్రార్థన లేకుండా ప్రారంభించినా, ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడుతుంది.

పైన ప్రస్తావించబడిన విధముగా, యాజక హోదాలో లేని వారైతే శ్రీసభలో తక్షణ స్వయం శిక్షను పొందుతారు (*Latae Sententiae* Interdict), యాజక హోదాలో ఉన్న వారైతే శ్రీసభ పరిచర్య నుండి తక్షణ స్వయం బహిష్కరణకు గురౌతారు (*Latae Sententiae* Suspension). నేర తీవ్రతను బట్టి, ఇంకా అదనపు శిక్షను విధించవచ్చు. శ్రీ.చ. 1041 సం.6 ప్రకారము ఈ ఘోర నేరమునకు పాల్పడినవారు యాజక పదవిని పొందుటకు అనర్హులు. శ్రీ. చ. 1044 §1, సం. 3 ప్రకారము అప్పటికే పొందిన యాజకత్వపు పరిచర్యను అపోస్తోలిక పశ్చాత్తాప విభాగము నుండి అనుమతి లేకుండా కొనసాగుట అసాధ్యము.

### 3. పాప మన్నింపును ఒసగుచున్నట్లు అనుకరించుట (Simulation of the sacramental absolution)

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1, సం. 3 పాప మన్నింపును ఒసగుచున్నట్లు అనుకరించుట (Simulation of the sacramental absolution) గురించి తెలియజేస్తుంది. శ్రీ.చ. 1379 §5 ఏ విశ్వాసియైన ఒక దివ్య సంస్కారమును నిర్వహిస్తున్నట్లు అనుకరిస్తే వారికి తగిన శిక్షను అమలుచేయాలని తెలియజేస్తుంది. 1379 §5 ఉద్దేశపూర్వకముగా ఏ దివ్య సంస్కారాన్నైనా నిర్వహిస్తున్నట్లు అనుకరిస్తే అని తెలియజేస్తుంది కాని "నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)*, మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1, సం. 3 ప్రత్యేకముగా పాప సంకీర్తన దివ్య సంస్కారమును గురించి ప్రత్యేకముగా పరిగణించి ఈ నేరమును మహా ఘోర నేరములలో ఒకటిగా చేర్చబడినది. ఒక గురువు పాప సంకీర్తన దివ్య సంస్కారమును అనుకరించుటలో (simulates the sacrament of reconciliation) పాప సంకీర్తన విని, పాప మన్నింపు పార్థనను బాహ్యముగా ఉచ్చరించినా అంతర్గతముగా దాని ప్రతిఫలమును ఆయన ఉద్దేశించనప్పుడు ఆ దివ్య సంస్కార ఫలాలను ఆ విశ్వాసికి అందించలేడు. కేవలము పాప సంకీర్తన దివ్య సంస్కారమును ఇస్తున్నట్లు నటిస్తుంటాడేగాని నిజానికి ఆ గురువు పాప సంకీర్తన దివ్య సంస్కారాన్ని ఆ విశ్వాసికి అందించుటలేదు. ఈ విధముగా

చేసిన యెడల ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణించవచ్చు.

ఇక్కడ పాప సంకీర్తన దివ్య సంస్కారమును నిరర్థకముగా నిర్వహించుట (attempt to hear sacramental confession) పాప సంకీర్తనమును నిర్వహిస్తున్నట్లు అనుకరించుట (simulation of sacramental absolution) మధ్య తేడాను గమనించాలి. మొదటి సందర్భముటో నేరమునకు పాల్పడువారు గురువు, పీఠాధిపతియైన పాప సంకీర్తనను వినుటకు ఉత్తరువులు (faculty to hear confession) లేకుండా, గురువు, పీఠాధిపతి కానివారు, నిరర్థకముగా పాప సంకీర్తనను వినుటకు ప్రయత్నిస్తారు, రెండవ సందర్భములో గురువు, పీఠాధిపతి పాప సంకీర్తన వినుటకు ఉత్తరువులు కలిగియుండి, ఆంతరంగిక ఉద్దేశమును తృణీకరించుట వలన వారు కేవలము పాప సంకీర్తనను అనుకరిస్తున్నారు అని చెప్పవచ్చు. బహిరంగముగా పాప మన్నింపు ప్రార్థనను ఉచ్చరించినా ఆంతరంగికముగా ఆ ఉద్దేశమును వారు కలిగియుండకుండుటచేత కేవలము దానిని అనుకరిస్తారు. ఇటువంటి మహా ఘోర నేరమునకు పాల్పడిన వారికి తగిన శిక్ష విధించాలని శ్రీసభ చట్టము తెలియజేస్తుంది, అవసరమైతే తీవ్రతను బట్టి శ్రీసభ సహవాసము నుండి కూడా బహిష్కరించమని తెలియజేస్తుంది.

**4. పాప సంకీర్తన సమయములోగాని, పాప సంకీర్తన నెపముతోగాని, పాప సంకీర్తన దివ్యసంస్కారమును ఒసగు గురువుతో, పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయుటకు ప్రేరేపించుట. (Solicitation to sin against the sixth commandment of the Decalogue)**

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1, 4 పాప సంకీర్తన సమయములోగాని, పాప సంకీర్తన నెపముతోగాని, పాప సంకీర్తన దివ్య సంస్కారమును ఒసగు గురువుతో, పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయుటకు ప్రేరేపించుట. (Solicitation to sin against the sixth commandment of the Decalogue) గురించి తెలియజేస్తుంది.

శ్రీ.చ. 1385 ఈ నేరము గురించి తెలియజేస్తూ, అటువంటి నేరమునకు పాల్పడిన గురువులకు తగిన శిక్షను విధించి, అవసరమైతే విధుల నుండి బహిష్కరణ, ఆ నేర తీవ్రతను పరిగణించి, యాజక పదవి నుండి తొలగించాలని తెలియజేస్తుంది. శ్రీ.చ. 1385 ప్రకారము, "ఒక గురువు పాప సంకీర్తనలోగాని లేదా పాప సంకీర్తన సందర్భములో గాని, లేదా పాప సంకీర్తన నెపముతో గాని, పాప సంకీర్తనకు విచ్చేసిన విశ్వాసిని పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయుటకు ప్రేరేపించినా, ఆ గురువుకు ఆ నేర తీవ్రతను బట్టి విధుల నుండి బహిష్కరణ, ఇతర శిక్షలను విధించవలెను, మరీ తీవ్ర పరిస్థితులలో యాజక పదవి నుండి తొలగించవలెను."

ఈ నేరము ఒక గురువుచేత పాప సంకీర్తన సమయములో లేదా సందర్భములో లేదా నెపముతో పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయమని, ఆ గురువుతోగాని లేదా వేరొక వ్యక్తితోగాని ఆ పాపము చేయ ప్రేరేపించిన యెడల, ఈ మహా ఘోర నేరమునకు పాల్పడును. ఒక గురువు పాప సంకీర్తన సమయములో లేదా పాప సంకీర్తనకు ముందు లేదా పాప సంకీర్తన ముగిసిన తరువాత లేదా పాప సంకీర్తన సందర్భములో లేదా పాప సంకీర్తన నెపముతో పాప సంకీర్తన వినెడు స్థలములో లేదా వేరొక స్థలములో విశ్వాసితో అనైతిక ప్రవర్తన లేదా అసభ్యకర ప్రవర్తన, మాటల ద్వారా, సంజ్ఞల ద్వారా, స్పర్శ ద్వారా, వ్రాతపూర్వక సందేశాల ద్వారా, ఆ సమయములో లేదా వేరొక సమయములో చదువుకోదగ్గ సందేశాలు పంపించుట, లేదా ఈ తరహా సంభాషణలను ఆ విశ్వాసితో చేయుట ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడును.

ఈ మహా ఘోర నేరములో ముఖ్య విషయమేమిటంటే, ఒక గురువు పాప సంకీర్తన ఒసగే పరిచారకునిగా విశ్వాసులను పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా పాపము చేయ ప్రేరేపించి, చెడు మార్గములోనికి నడిపించుటను పరిగణిస్తుంది. ఆ గురువు తనతో పాపము చేయమని కావచ్చు లేదా వేరొకరితో పాపము చేయమని కావచ్చు. ఆ గురువుకు పాప సంకీర్తన వినుటకు ఉత్తరువులు ఉన్నా లేకున్నా, ఆ గురువు పాప సంకీర్తనకు వాడు దైవార్చన వస్త్రాలు ధరించినా ధరించకపోయినా, ఆ విశ్వాసి పురుషుడు, స్త్రీయైనా, ఈ నేరమునకు పాల్పడినట్లే.

ఈ మహా ఘోర నేరము యొక్క పరిధి చాలా విశాలమైనది.

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4, సం. 4 ఈ విధముగా తెలియజేస్తుంది. ఆర్టికలు 4 §1 విశ్వాస పరిరక్షణ విభాగముకు మాత్రమే అధికారము ఇవ్వబడిన, పాప సంకీర్తన దివ్య సంస్కారమునకు వ్యతిరేకముగా చేయు మహా ఘోర నేరాల విషయమై, నేరారోపణగావించు వ్యక్తుల పేర్లు లేదా వారి వకీలు పేర్లు ప్రత్యేకముగా వారు సమ్మతిని తెలియజేసిననే తప్ప బహిరంగ పరచకూడదు. ఇంకా శ్రీసభ ధర్మాసనము ఆ నేరారోపణచేయు వ్యక్తి వ్యక్తిత్వము యదార్ధతను పరిశీలించవలెను. ఆ నేరారోపణగావింపబడ్డ గురువుచేత ఏ విధముగా కూడా పాప సంకీర్తన దివ్య సంస్కార ముద్రుకు భంగము కలిగింపకుండా జాగ్రత్తలు వహించాలి. పాప సంకీర్తన ముద్రకు ఎట్టి భంగము కలిగింపకుండా, ఆ గురువుకు స్వల్పముగానున్న అవకాశాలను వినియోగించుకొని తాను ఆ నేరారోపణనిమిత్తమై తనను తాను కాపాడుకొనుటకు తగిన విధముగా వ్యవహరించవలెను. ఎందుకనగా, ప్రతి గురువుకు పాప సంకీర్తన ముద్రను కాపాడవలసిన బాధ్యతను కలిగియుంటాడు.

ఇటువంటి నేరాల విషయములో నేరారోపణ చాలా స్పష్టముగా ఉండాలి. ఒక నిర్దిష్ట వ్యక్తి, సమయము, స్థలము ఇంకా ఇతర పరిస్థితులు స్పష్టముగా ఉండాలి. నేరారోపణ చేయు వ్యక్తి ప్రమాణముచేసి, చేవ్రాలుతో సంతకముతో నేరారోపణ చేయాలి. కాబట్టి నేరారోపణగావింపబడ్డ గురువు తాను ఆ మహా ఘోర నేరమునకు పాల్పడనట్లైతే తనను తాను కాపాడుకొనుటకు పాప సంకీర్తన ముద్రకు భంగము కలుగకుండా కాపాడుకొనుట చాలా కష్టము కాబట్టి, ఇతర వివరములు సరిగా లేనపుడు, ధర్మాసనము గురువుకు అనుకూలముగా తీర్పునిస్తుంది. శ్రీ.చ. 1390 §1 ప్రకారము, అన్యాయముగా ఒక గురువుపై ఈ నేరారోపణగావించి, అది నిర్ధారింపబడినపుడు, నేరారోపణ గావించిన విశ్వాసులు శ్రీసభలో తక్షణమే విధించబడే శిక్షకు (*latae sententiae* interdict) గురియౌతారు. ఆ నేరారోపణగా వించిన వ్యక్తి యాజక వర్గానికి చెందినవాడైతే శ్రీసభలో తక్షణమే విధించబడే శిక్షకు (*latae sententiae* interdict), యాజక విధుల నుండి బహిష్కరణకు (*latae sententiae* Suspension) గురియౌతాడు.

### 5. ప్రత్యక్షముగా లేక పరోక్షముగా పాప మన్నింపు దివ్య సంస్కారములో వెల్లడించిన (పాప సంకీర్తన ముద్రకు సంబంధించిన విషయాలను) బహిర్గతము చేయుట (Direct and Indirect violation of the Sacramental Seal)

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §1, సం. 5 ప్రత్యక్షముగా లేక పరోక్షముగా పాప మన్నింపు దివ్య సంస్కారములో వెల్లడించిన (పాప సంకీర్తన ముద్రకు సంబంధించిన విషయాలను) బహిర్గతము చేయుట (Direct and Indirect violation of the Sacramental Seal) గురించి తెలియజేస్తుంది. శ్రీ. చ. 1386 §1, ఈ నేరము గురించి తెలియజేస్తుంది. ఒక గురువు ప్రత్యక్షముగా పాప సంకీర్తన ముద్రను భంగపరచినట్లైన ఆ గురువు శ్రీసభ సహవాసము నుండి అపోస్తోలిక పీఠ పరిధికి అప్పగింపబడిన తక్షణ స్వయం బహిష్కరణకు (*latae sententiae* Excommunication reserved to the Apostolic See) గురౌతాడు. కేవలము పరోక్షముగా పాప సంకీర్తన ముద్రకు భంగము కలిగించిన యెడల ఆ నేర తీవ్రతను బట్టి తగిన శిక్షకు పాత్రుడవుతాడు.

ఒక గురువుకు పాప సంకీర్తన ముద్రకు భంగము కలిగించకుండా కాపాడు బాధ్యతను కలిగియున్నాడు. ఇది చాలా ముఖ్యమైన బాధ్యత. పాప సంకీర్తనలో పాప మన్నింపును పొంద విశ్వాసి వెల్లడిచేసిన పాపములను వాటికి సంబంధించిన విషయములను ఎట్టి పరిస్థితిలోను, గురువు వెల్లడి చేయకూడదు. ప్రాణాపాయ స్థితిలో సైతం గురువు ఒక విశ్వాసి పాప సంకీర్తనలో వెల్లడించిన విషయాలను బహిర్గతము చేయకూడదు. అటుల చేసిన యెడల పాప సంకీర్తన దివ్య సంస్కార పవిత్రతకు అపకీర్తి, అగౌరవము కలిగించినట్లౌతుంది. ఆ దివ్య సంస్కార గౌరవమును కాపాడుట గురువుకున్న బాధ్యత, కర్తవ్యము. పాప సంకీర్తన ముద్ర అనగా, పాప సంకీర్తన కొరకు విచ్చేసిన వ్యక్తి వివరాలు, ఆ వ్యక్తి వెల్లడించిన పాపాలు, ఆ పాపాలకు సంబంధించిన పరిస్థితులు, వివరాలు మొదలగునవి. పాప సంకీర్తనలో ఒక గురువు క్రీస్తు స్థానములో ఉండి, శ్రీసభ పరిచర్యలో పాపములను విని, దేవుని మన్నింపును విశ్వాసికి అందిస్తాడు. కేవలము దేవుడు మాత్రమే పాప మన్నింపును ఒసగుతాడు. కాబట్టి పాప సంకీర్తనలో వెలువరించిన

విషయాలు బహిర్గతము చేయరాదు. వెల్లడించుటకు కారణాలు, అవి ఎంత క్లిష్టమైనవైనా సరే వెల్లడించరాదు. కాబట్టి పాప సంకీర్తన ముద్ర చాలా పవిత్రమైనది దానికి ఎటువంటి భంగము కలిగించరాదు. ఇది మానవ మాత్రులు చేసిన చట్టముననుసరించి కాక దైవ చట్టముననుసరించి వర్తిస్తుంది. పాప సంకీర్తన ముద్ర ఎంతో పవిత్రమైనది కాబట్టి ఏ గురువుచేత బహిర్గతము చేయబడరాదు. ఒక గురువు, పాప సంకీర్తనలో పాప మన్నింపును పొంద వచ్చిన విశ్వాసికి, మాటల రూపములో, వేరొక రూపములోగాని, ఏ కారణముచేతనైనా ద్రోహము చేయరాదు.

పాప సంకీర్తన దివ్య సంస్కార ముద్ర యదార్ధముగా పాప మన్నింపును పొంద ఆశించిన విశ్వాసి పాప సంకీర్తన చేయుటకు విచ్చేసి వెల్లడి చేసిన పాపములను, ఒక వేళ పాప మన్నింపు నిరాకరింపబడినా కూడా గురువులకు ఆ విషయాలను గోప్యముగా ఉంచ బాధ్యత కలిగియున్నారు. ఆ విశ్వాసి మరణానంతరము కూడా వెల్లడించిన విషయాలు బహిర్గతము చేయకూడదు. ఈ బాధ్యతలో భాగముగా, వెల్లడించిన పరిస్థితులు, పాప మన్నింపును పొందుటకు వాటిని వెల్లడించుట అవసరము లేకపోయినా, ఒక వేళ ఒక పాపము ఒక వ్యక్తితో కలసి చేసినా, ప్రాయశ్చిత్తముగా ఇచ్చినవి, పాపములనుద్దేశించి శోధనలు, పాప మన్నింపు నిరాకరణ లేదా వాయిదా ఈ అంశాలన్నీ పాప సంకీర్తన ముద్రలోని కీలక అంశాలు.

పాప సంకీర్తన ముద్రలో ఇంకా విన్నటువంటి వ్యక్తి, ఎవరిని గురించిన వివరాలు తెలియకపోయినా, వాటిని వెల్లడించరాదు. 1915 లో ప్రవిత్ర సభ మండలి ఇచ్చిన ఉపదేశముననుసరించి, ప్రసంగాలలో కూడా ఇటువంటి విషయాలను బహిర్గతము చేయకూడదని ఉపదేశించింది. ఇతర తరహాలో ఇటువంటి విషయాలు బహిర్గతమవ్వటకు వీలు లేకపోయినా వాటిని గురువు బహిరంగపరచరాదు. ఈ విధముగా అజాగ్రత్తతో ప్రవర్తించినపుడు, విశ్వాసులలో ఆందోళన అదే విధముగా పాప సంకీర్తనమునకు విచ్చేయుటకు ఇబ్బందిని కలిగి ఉంటారు, గురువులపై అపనమ్మకము ఏర్పడుతుంది. కాబట్టి బహిరంగముగా, ఇంకా ఏ విధముగానైనా పాప సంకీర్తనలో వెల్లడించిన విషయాలు బహిర్గతము చేయరాదు.

ప్రత్యక్షముగా పాప సంకీర్తన ముద్రను భంగపరచుట అనగా ఒక విశ్వాసి పాప సంకీర్తనలో వ్యక్తపరచిన పాపములను, ఆ విశ్వాసి వివరములను బహిర్గతము చేయుట. కాబట్టి ప్రత్యక్షముగా పాప సంకీర్తన ముద్రను భంగపరచుటలో రెండు అంశాలు కలిగియున్నాయి అవి, పాపములను, విశ్వాసి వివరములను వెల్లడించుట. విశ్వాసి వివరాలు, కేవలము అతని/ఆమె పేరు, ఇంటి పేరును వెల్లడించుట ద్వారానే జరుగదు, వారి హోదాను, పదవిని, పరిస్థితిని సూచిస్తూ మాట్లాడుట వలన కూడా సంభవిస్తుంది. పైన చెప్పబడిన విషయాలు చోటు చేసుకొన్నపుడు ఆ విశ్వాసి పేరు ఇతర అంశాలు చెప్పకపోయినా, వాటిని ప్రస్తావించినపుడు ఇతరులు ఆ గురువు ఎవరి గురించి మాట్లాడుతున్నాడో తెలుసుకొనగలరు. ఒక గురువు ఈ మహా ఘోర నేరమునకు పాల్పడ్డాడని నిర్ధారించుటకు, పాప సంకీర్తనములో తెలిసిన విషయాలు మాత్రమే కాక, పాపము, పాపి వివరాలు వెల్లడించినా చాలు ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణింపబడుతుంది.

పరోక్షముగా పాప సంకీర్తన ముద్రకు భంగము కలిగించుట అనగా, పాపము, పాపి పేరు వెల్లడించుట ఉద్దేశము కాకపోయినా, పాప సంకీర్తనలో ఒప్పుకున్న పాపమును ప్రస్తావించినపుడు, పాపి ఎవరు అన్న విషయము వినినవారు ఎవరినుద్దేశించి ఆ ప్రస్తావన వచ్చిందో తెలుసుకొనగలరు. ఏది ఏమైనా ఈ విషయాలు చాలా సున్నితమైనవి. ఈ రెండు నేరములను గుర్తించుట, వాటి మధ్య తేడాను గమనించుట చాలా నైపుణ్యముతో కూడిన పని. వీటిని గుర్తించుటలో ఉన్న కష్టాలను పరిగణనలోనికి తీసుకొని 2001వ సంవత్సరములో ఏర్పాటు చేయబడిన నియమముల నుండి కేవలము ప్రత్యక్షముగా పాప సంకీర్తన ముద్రను బహిర్గతము చేయుటను మహా ఘోర నేరాల జాబితాలో చేర్చారు. 2003వ సంవత్సరములో ఏర్పాటు చేయబడిన నియమాలలో పరోక్షముగా పాప సంకీర్తన ముద్రను బహిర్గతము చేయుటను కూడా మహా ఘోర నేరాల జాబితాలో చేర్చారు. 2010, 2021వ సంవత్సరములలో ఏర్పాటు చేయబడిన నియమాలు ప్రత్యక్షముగా, పరోక్షముగా పాప సంకీర్తన ముద్రను బహిర్గతము చేయుట మహా ఘోర నేరమని కొనసాగించాయి. ఒక గురువు అజాగ్రత్తతో ఏ విధముగానైనా పాప సంకీర్తన ముద్రను బహిర్గతము చేసిన యెడల విశ్వాస పరిరక్షణ విభాగ మహా ఘోర నేరాల విచారణకు బాధ్యుడవుతాడు.

**6. పాప సంకీర్తన దివ్య సంస్కారములో వెలువరించబడిన విషయాలను ఏదైన ఆధునిక సాంకేతికపరికరాలతో నమోదు చేయుట లేదా దురుద్దేశముతో ఏదైన ప్రసార మాధ్యమాలలో వాటిని ప్రచురించి బహిర్గతము చేయుట.**

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్టిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 4 §2 పాప సంకీర్తన దివ్య సంస్కారములో వెలువరించబడిన విషయాలను ఏదైన ఆధునిక సాంకేతిక పరికరాలతో నమోదు చేయుట లేదా దురుద్దేశముతో ఏదైన ప్రసార మాధ్యమాలలో వాటిని ప్రచురించి బహిర్గతము చేయుటను గురించి తెలియజేస్తుంది. ఈ మహా ఘోర నేరమునకు పాల్పడిన విశ్వాసులకు తగిన శిక్షను విధించాలి, వారు యాజక వర్గములోని వారైతే వారిని యాజక పదవి నుండి తొలగించుట లేదా జీవితాంతము ప్రార్థన, ప్రాయశ్చిత్తము చేయుట కొరకు శిక్షింపబడవలెను. ఈ నేరమునకు నేపద్యము, 1988, సెప్టెంబరు 23న విశ్వాస పరిరక్షణ విభాగము వెలువరించిన అధికారిక పత్రము. ఆ పత్రము ద్వారా పాప సంకీర్తన దివ్య సంస్కారములో వెలువరించబడిన విషయాలను, సంభాషణలను ఏదైన ఆధునిక పరికరాలతో నమోదు చేసి వాటిని పంచుట లేదా దురుద్దేశముతో ఏదైన ప్రసార మాధ్యమాలలో వాటిని ప్రచురించి బహిర్గతము చేయుటను నిషేధించింది. పాప సంకీర్తన దివ్య సంస్కార పవిత్రతను కాపాడు ఉద్దేశముతో ఈ అధికారిక పత్రమును జారీచేసింది. పాప సంకీర్తన దివ్యసంస్కారములో పాలుపంచుకునే గురువు, విశ్వాసులను, పాప సంకీర్తన ముద్రను కాపాడుట ముఖ్య ఉద్దేశము.

శ్రీ.చ. 1386 §3 ప్రకారము ఎవరైనా ఏదైనా సాంకేతిక పరికరాల ద్వారా పాప సంకీర్తనములో గురువుగాని, పాప మన్నింపు కోరుటకు విచ్చేసిన విశ్వాసి మాట్లాడినవి నమోదు చేయుట ఆ పాప సంకీర్తనము యథార్థమైనది లేదా అనుకరింపబడినదైనా, లేదా సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేయబడినవి, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచురించుట నిషేంధించబడినది. ఆ నేర తీవ్రతను బట్టి వాటిని చేసిన వారికి తగిన శిక్షను విధించాలి, వారు యాజక పదవిలో ఉన్న వారైతే వారిని యాజక పదవి నుండి సైతం తొలగించాలి అని తెలియజేస్తుంది. ఈ నేరములో భాగముగా స్వయాన వారు గాని లేదా ఇంకొకరితోనైనా ఆ సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేయించినట్లైనా, వాటిని ప్రసార మాధ్యమాల

ద్వారా ప్రచురించినా, పంచినా ఈ నేరమునకు పాల్పడినట్లు పరిగణింపబడుతుంది. ఈ నేరమును మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది, పాప సంకీర్తనను సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేయుట, రెండవదిగా, నమోదు చేసిన పాప సంకీర్తనను కొంత భాగమైనా లేదా పూర్తిగానైనా ఇతరులకు అందించుట లేదా పంచుట, మూడవదిగా, పాప సంకీర్తనను నమోదు చేయుట, ఇతరులకు అందించుట లేదా పంచుట. మొదటి రెండు సందర్భాలో నేరము ఇద్దరి వ్యక్తుల ద్వారా చేయబడితే మూడవ సందర్భములో రెండు, ఒకే నేరముగా ఒకే వక్తిచేత చేయబడుట. ఈ నేరము చేయబడినదిగా పరిగణించుటకు, పాప సంకీర్తనమును సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేయబడాలి, కేవలము వినుట వలన కాదు. కేవలము విని ఆ పాప సంకీర్తన ముద్రను బహిర్గతము చేసినట్లైతే ఆ నేరము వేరొక నేరము క్రింద విచారించబడుతుంది.

పాప సంకీర్తనను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచురించుట అనగా, సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేయబడిన పాప సంకీర్తనను ఏదైనా ప్రసార మాధ్యమము ద్వారా, వ్రాతపూర్వక ప్రచురణ ద్వారా గాని, దూరదర్శిని ద్వారా గాని, ఆకాశవాణి ద్వారా గాని, కంప్యూటర్ ద్వారా గాని, అంతర్జాలము ద్వారా గాని, ఏదొక ప్రసార మాధ్యమము ద్వారా గాని ప్రచురించుట. ఈ నేరములో భాగస్తులైనవారు, వారి ప్రమేయము లేకుండా ఈ నేరము చేయలేని పరిస్థితి ఏర్పడినప్పుడు, ఉదాహరణకు సంపాదకులు, నిర్మాతలు, దూరదర్శిని, ఆకాశవాణి పర్యవేక్షకులు వారు కేవలము ధన లబ్దికోసము చేసినా, క్షుణ్ణముగా వీరిని పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకొనవలెను. ఈ నేరమునుద్దేశించిన నియమము పాప సంకీర్తన దివ్యసంస్కార పవిత్రతను పరిరక్షిచుట, గురువు, పాప మన్నింపుపొంద విచ్చేసిన విశ్వాసులను కాపాడుటకు ఏర్పాటు చేయబడినది, తద్వారా ఎవ్వరూ ఈ నేరమునకు పాల్పడకుండా చేయుటకు. ఈ నేరము “నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్”, *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములలో భాగమైయుండగా, ఈ నేరమును కేవలము 2021 మే 23న ఫ్రాన్సిస్ పాపగారిచేత అమలుచేయబడిన “పాస్షితే గ్రేజెమ్ దేయి” (*Pascite gregem Dei*) అనే అపోస్తోలిక పత్రిక ద్వారా శ్రీసభ చట్టములోని ఆరవ పుస్తకమును సవరించారు. (శ్రీసభ చట్టములోని ఆరవ

పుస్తకము శ్రీసభలో చట్టపరమైన శిక్షలను గురించి తెలియజేస్తుంది.) శ్రీసభ చట్టము ఆరవ పుస్తకములో 1386 § 3లో ఈ మహా ఘోర నేరమును పొందు పరిచారు. అంతకు ముందు శ్రీసభ చట్టములో ఈ నేరము ప్రస్తావించలేదు. ఈ మహా ఘోర నేరము, ఈ ప్రస్తుత ఆధునిక పరిస్థితులలో ఉత్పన్నమైన నేరము కాబట్టి దీనిని ఇటీవలే శ్రీసభ చట్టములో చేర్చారు.

## ముగింపు

పాప సంకీర్తన దివ్య సంస్కారము చాలా పవిత్రమైనది. సాక్షాత్తూ అభిషిక్త గురువు క్రీస్తు ప్రభుని స్థానములో దేవుని క్షమాపణను పశ్చాత్తాపపడి దేవుని క్షమాపణను కోరి శ్రీసభ పరిచర్య ద్వారా క్షమాపణను పొందుటకు విచ్చేసిన విశ్వాసులకు, పశ్చాత్తాప్తులకు దానిని అందిస్తాడు. కాబట్టి ఈ బాధ్యత ఎంతో గొప్పదైనది. ఈ దివ్య సంస్కారము పట్ల అగౌరవము, అపకీర్తి తెచ్చు నేరములను అరికట్టు బాధ్యత శ్రీసభకున్నది. ప్రత్యేకముగా పీఠాధిపతులు, గురువులు, విశ్వాసులందరు ఈ బాధ్యతలో భాగస్తులే. ఈ వ్యాసములో మనము క్షుణ్ణముగా ఈ మహా ఘోర నేరాల గురించి, వాటికి సంబంధించిన చట్టాల గురించి తెలుసుకున్నాము. కాబట్టి ఇటువంటి మహా ఘోర నేరాలు శ్రీసభలో చోటు చేసుకోకుండా మనము బాధ్యత వహించాలి తద్వారా దేవుడు ఈ దివ్య సంస్కారాల ద్వారా మనకు ఒసగే గొప్ప మేలులను మనము అనుభవించగలము. శ్రీసభ కాలక్రమేణ, దివ్య సంస్కారాల పవిత్రతకు వ్యతిరేకముగా చేయు నేరము పట్ల నియమాలను సవరిస్తూ, ఆయా పరిస్థితులకు అనుగుణంగా తయారుచేస్తూ ఆ దివ్య సంస్కారాల పవిత్రతను కాపాడుతుంది. ఈ వ్యాస ఉద్దేశము విశ్వాసులలో అవగాహన కల్పించుట, తద్వారా వారు ఈ దివ్య సంస్కారాల పట్ల బహు విశ్వాసముతో మెలుగుతూ వాటిని పరిరక్షిస్తారని ఆకాంక్ష.

# ౬. స్త్రీలకు గురుత్వాభిషేకము ఒసగుటకు నిరర్థకముగా ప్రయత్నించుట

– బ్రదర్ తనబల్ ఫ్రాన్సిస్ చిన్నప్పర్

## పరిచయం



నేటి సమాజములో ప్రతి ఒక్కరు తమ పనులను వేరొకరిపై ఆధారపడకుండా పూర్తిచేస్తున్నారు. ఎవరి కాళ్ళపై వారు నిలబడి, సొంత నిర్ణయాలు తీసుకుంటూ, వారికి వారే అధినేతగా అధికారిగా ఉంటున్నారు. కరోనా మహమ్మారి తరువాత యువతీయువకులు బయటకంటే ప్రసార మాధ్యమాలలో ముఖ్యముగా యూ ట్యూబ్, ఫేస్ బుక్కులలో ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ ప్రసార మాధ్యమాల వలన ప్రతి ఒక్కరూ వారి హక్కులు, గౌరవ మర్యాదల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు, కానీ వినయ విధేయతలు చెల్లాచెదురౌతున్నాయి. ప్రతి దేశ పౌరుడు, తన దేశ, మత, నియమనిబంధనలను పాటించాలి. కానీ నియమాలను పాటించకుండా సొంత పెత్తనాలను నమ్మేవారిని, దేవునికి అవిధేయత చూపిన ఆది తల్లిదండ్రులైన అవ్వ, ఆదాములతో పోల్చవచ్చు, ఎందుకంటే అవిధేయత వలననే లోకంలోనికి పాపం ప్రవేశించింది. ఇలా ఎన్నో సందర్భాలలో సైతాను మనలను దేవుని నుండి దూరంచేసే ప్రయత్నంలో నిమగ్నమైయుంటుంది.

## స్త్రీలకు గురుపట్టాభిషేకము – విశ్లేషణ

పవిత్ర గ్రంథములో పలుచోట్ల సంఘములో స్త్రీల పాత్రను గరించి వివరించబడింది. ఉదాహరణకు 1 తిమోతి 2:10-12 లో పునీత పౌలుగారు పలికినట్లు స్త్రీలు సంపూర్ణ విధేయతతో ఆలకించాలి. పౌలుగారు ప్రత్యేకముగా

'బోధన', 'అధికారము' అనే రెండు అంశాలను గురించి వివరించారు. మరొక చోట, పౌలుగారు ఒక బోధకునికి ఉండవలసిన అర్హతల గురించి తెలిపారు. 1 తిమోతి 3:2 లో దైవ సంఘపు అధిపతి దోషరహితుడును, ఒకే భార్య కలవాడై, త్రాగుబోతుకాక, ఇంద్రియ నిగ్రహము, క్రమశిక్షణ కలవాడై ఉండాలి. అన్నింటికంటే ముఖ్యమైనది, దేవుని వాక్కును విశదీకరించగలవాడై ఉండాలి. మరొక సందర్భములో పౌలుగారు సంఘములో జరుగు ప్రార్థనలయందు స్త్రీ, పురుషుల పాత్రను వివరిస్తారు. కానీ, ప్రత్యేకముగా స్త్రీలు సువార్తను బోధించవలెను అనే ప్రత్యేక అంశాలను పౌలుగారు మాట్లాడలేదు. విధేయతతో బోధన వినడం, సంఘ ప్రార్థనలో చురుకుగా పాల్గొనడం గురించి మాత్రమే బోధించారు. కానీ, స్త్రీలు సువార్తను బోధించడం గురించి పౌలుగారు ఏ సందర్భములోనూ మాట్లాడలేదు. పౌలుగారు పలికినట్లు, దేవుడు మొదట ఆదామును, తరువాత అవ్వమ్మను సృష్టించాడు. అదే విధముగా అవ్వమ్మనే మొదట శోధింపబడినది. ఇది కేవలము యూదా సామ్రాజ్యానికే పరిమితమైనది కాదు, ఎందుకంటే ఆదిపాపం ప్రపంచం మొత్తానికి పాకింది. కానీ, పౌలుగారు స్త్రీలను కించపరిచేందుకు కానీ, వారి విలువ మర్యాదలకు భంగం కలిగించేందుకు కానీ, ఈ విధముగా చెప్పలేదు. దేవుడు ఆదాము, అవ్వలను సృష్టించిన వైనమును తెలియపరిచారు.

ఆది 2:16-17 మంచి చెడులనెంచు తెలివినిచ్చు చెట్టు పండ్లను తప్ప నీవు తోటలో అన్ని పండ్లను తినవచ్చును, ఆ చెట్టు పండు తిన్నచో నీవు తప్పక చనిపోదువు అని దేవుడు పలికెను. ఈ మాటను అవ్వమ్మను సృష్టించక ముందే ఆదాముకు దేవుడు తెలిపాడు. ఆదాము తన భార్య అవ్వమ్మకు చెప్పియుండవచ్చు, వారి ప్రేమబంధం వలన ఈ ఆజ్ఞ వారిరువురికీ తెలిసియుండవచ్చు, అవ్వమ్మకు ఈ ఆజ్ఞ గురించి పూర్తిగా తెలిసియుంటుంది. దేవుని వాక్కును ఆదాము తన భార్యకు బోధించడం అతిముఖ్యం, ఆమెను శోధన నుండి రక్షించడం కూడా తన కర్తవ్యం. దీనినే పునీత పౌలుగారు వివరించారు. వీరిరివురిని ఉదాహరణగా తీసుకుని, బోధించువారెవరో, సంఘములో ఆలకించువారెవరో పౌలుగారు తెలిపారు. క్రీస్తు శ్రీసభకు ఉన్న అన్యోన్య సంబంధాన్ని పౌలుగారు వివరించారు. క్రీస్తు వరుడై తన వధువైన శ్రీసభకు బోధించి, ఆత్మీయ మార్గంలో నడిపించే

అధికారం కలిగినవాడైయున్నాడు. కావున ప్రతీ బోధకుని కర్తవ్యం, సంఘంలోని ప్రజలకు బోధించడం, వారిని ప్రభువైపుకు నడిపించడం, స్త్రీల కర్తవ్యం విధేయతతో బోధనను ఆలకించి, సంఘంలో పాల్గొనడం. క్రీస్తు తన వధువైన శ్రీసభకు బోధించినట్లే, ప్రతి బోధకుడు, తన తోటి స్త్రీలకు బోధించవలెను (ఎఫెసీ 5:22-33).

శ్రీ.చ. 1024 ప్రకారము కేవలము అధికారపూర్వకముగా చట్టబద్ధముగా జ్ఞానస్నానము పొందిన పురుషుడు మాత్రమే గురుత్వ అంతస్తులో ప్రవేశించగలడు. శ్రీ.చ. 1379 §1, 1 ప్రకారము గురుత్వము పొందకుండా, దివ్య సంస్కారమును నెరవేర్చడము కేవలము ఒక ప్రయత్నమే అట్టి దివ్య సంస్కారము చెల్లుబాటుకానిది. శ్రీ.చ. 1379 §3 “ఒక స్త్రీకి గురుపట్టాభిషేకమును ఒసగుటకు ప్రయత్నించిన వారు, స్వీకరించుటకు ప్రయత్నించిన స్త్రీ ఇద్దరు, శ్రీసభ సహవాసము నుండి అపోస్తోలిక పీఠ పరిధికి చెందిన తక్షణ స్వయం బహిష్కరణకు (*latae sententiae* Excommunication reserved to the Apostolic See) గురౌతారు. ఆ ప్రయత్నము చేసిన వారు యాజక వర్గములోని వారైతే, యాజక పదవి నుండి కూడా తొలగింపబడవచ్చు”.

## సత్యోపదేశము

రెండవ జాన్ పౌలు పాపుగారిచే ఆగష్టు 15, 1997వ సంవత్సరములో ప్రచురించబడిన కతోలిక శ్రీసభ సత్యోపదేశము, శ్రీసభ యేసు ప్రభువు అపోస్తలుల ఎన్నికకు కట్టుబడి ఉందని చెబుతుంది. యేసు ప్రభు పన్నెండు మంది పురుషులను అపోస్తలులుగ ఎన్నుకున్నారు. శ్రీసభ క్రీస్తు ప్రభు స్వయముగ తీసుకున్న ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంది. ఈ కారణము చేతనే స్త్రీలను అభిషేకించడం లేదు, అభిషేకించడంలో అర్థం లేదు, విలువ లేదు. డిసెంబరు 2, 2002వ సంవత్సరములో కతోలిక స్త్రీలను అభిషేకించడానికి ప్రయత్నించే చట్టముపై, కతోలిక విశ్వాస పరిరక్షణ విభాగము, కతోలిక స్త్రీలను గురువులుగ అభిషేకించు అంశముపై ఒక ఆదేశాన్ని ఇచ్చింది. అందులో, రెండవ జాన్ పౌలు పాపుగారు రచించిన “ఓర్దినాత్సియో సాచెర్దోతాలిస్” (*Ordinatio Sacerdotalis*) అనే లేఖలో స్త్రీల గురుత్వపు అభిషేకము గురించి ప్రతిపాదించారు.

ఆంగ్లికను సమూహములో మహిళల అభిషేకముపై ప్రశ్న తలెత్తినపుడు, ఆరవ పౌలు పాపుగారు, అపోస్తలుల సాంప్రదాయాన్ని కాపాడే తన పదవికి విధేయత చూపుతూ, క్రైస్తవ ఐక్యతకు కొత్త అడ్డంకులను తొలగించాలనే ఉద్దేశముతో, కతోలిక శ్రీసభ స్థానాన్ని ఆంగ్లికనులకు పాపుగారు గుర్తు చేశారు. చాలా ప్రాథమిక ముఖ్యమైన కారణాల వలన స్త్రీలు గురుత్వానికి ఆమోదయోగ్యము కాదని శ్రీసభ పేర్కొన్నది. ఆ ముఖ్యమైన కారణాలు ఏవనగా:

1. పవిత్ర గ్రంథము ప్రకారము క్రీస్తు ప్రభువు అపోస్తలులుగా పురుషులను మాత్రమే ఎన్నుకున్నారు.
2. క్రీస్తు ప్రభు పురుషులను మాత్రమే ఎన్నుకోవడం ద్వారా శ్రీసభ దానిని అనుసరిస్తుంది.
3. దేవుని ప్రణాళిక ప్రకారము శ్రీసభ చట్టాలు, ఆదేశాలు మహిళలు గురుత్వానికి అమోదయోగ్యము కాదని బోధిస్తుంది.

ఆరవ పౌలు పాపుగారు ఈ ప్రాథమిక కారణాలు మరియు సత్యోపదేశము ద్వారా తాను ప్రకటించి ముగిస్తు ఈ విధముగా తెలియజేశారు, శ్రీసభ మహిళలను గురుత్వానికి అమోదయోగ్యము చేయడం చట్ట పరంగా చేయుటకు శ్రీసభ పరిధిలో లేదని తెలిపారు. ఈ బోధననే శ్రీసభ నిరంతరము పాటిస్తున్నది. పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు, అధికారిక నిర్ణయము ప్రకారము శ్రీసభలో స్త్రీలకు గురుత్వాభిషేకము ఇచ్చుటకు ఎవ్వరికి అధికారము లేదని తెలిపారు. ఈ అధికార బోధనను తిరస్కరించినవారు శ్రీసభను తిరస్కరించినట్లేనని తెలిపారు.

రోమను కూరియా విభాగమైన విశ్వాస పరిరక్షణ విభాగము, డిసెంబరు 19, 2007 వ సంవత్సరములో గురుపట్టాభిషేక దివ్య సంస్కార ఉనికి, గౌరవాన్ని కాపాడుటకు, ఆ విభాగానికి శ్రీ.చ. 30 అనుగుణముగా, ఇవ్వబడిన ప్రత్యేక ఉత్తరువును బట్టి, అప్పటి అమలులో ఉన్న శ్రీ.చ. 1378 కి ఎటువంటి భంగము కలుగకుండా, గురుత్వాభిషేకమును ఒక స్త్రీకి ఒసగుటకు ప్రయత్నించిన, స్వీకరించుటకు ప్రయత్నించిన స్త్రీ, ఇరువురు శ్రీసభ సహవాసము నుండి అపోస్తోలిక పీఠ పరిధికి చెందిన తక్షణ స్వయం బహిష్కరణకు (*latae sententiae* Excommunication reserved to the Apostolic See) గురౌతారు అని

విశ్వాస పరిరక్షణ విభాగ ప్రధానాధికారియైన విలియమ్ కార్డినల్ లెవాడా ఒక అధికారిక పత్రము ద్వారా ఆదేశించారు. ఈ అధికారిక పత్రమునను సరించి 2021లో ఫ్రాన్సిస్ పాపుగారు శ్రీసభ చట్టమును సవరించిన సందర్భములో ఈ విధముగా ఒక స్త్రీకిగురుత్వాభిషేకమును ఒసగుటకు ప్రయత్నించినవారు పైచెప్పబడిన శ్రీసభ సహవాసము నుండి అపోస్తోలిక పీఠ పరిధికి చెందిన తక్షణ స్వయం బహిష్కరణకు గురౌతారని 1379 §3 లో విశదపరిచారు. కేవలము అపోస్తోలిక పీఠము మాత్రమే తగిన విధముగా పశ్చాత్తాపపడి వారి వైఖరిని, తప్పుడు వాదనను సరిచేసుకున్నవారిని మాత్రమే తిరిగి శ్రీసభ సహవాసములో చేర్చుకొనగలదు.

2013 లో ఫ్రాన్సిస్ పాపుగారు, విలేఖరులతో మాట్లాడుతూ, శ్రీసభ మహిళల గురుత్వమును అంగీకరింపదు అని తెలియజేశారు. పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు, కూడా మహిళల గురుత్వమును వ్యతిరేకిస్తూ, ఇది స్వతహాగా క్రీస్తుచే మూసివేయబడిన ద్వారం అని తెలియజేశారు. ఫ్రాన్సిస్ పాపుగారు స్వీడెన్ దేశము సందర్శించి తిరుగు ప్రయాణములో పునీత రెండవ జాన్ పౌలుపాపుగారు పలికిన మాటలను పునః ఉచ్చరిస్తూ, మహిళల గురుత్వము గురించి ఉత్పన్నమగు ప్రశ్నలకు అడ్డుకట్ట వేశారు. అంతేగాక, శ్రీసభ జీవితంలో మహిళల పాత్ర చాలా ప్రధానమైనదని, ముఖ్యముగా తల్లి మరియ పోషించిన పాత్రను అనుసరించడం అని వారిని ప్రశంశిస్తూ తెలియజేశారు. ఇంకనూ దేవుని తల్లి, శ్రీసభ తల్లియైన మరియమాత అపోస్తలులు చేస్తున్న సువార్త పరిచర్యలోను, వారు పొందిన గురుత్వ అంతస్థులోను ఎటువంటి భాగం పంచుకోలేదు అన్న వాస్తవాన్ని స్పష్టముగా తెలియజేశారు. ఈ విధముగా మహిళలను తక్కువగా చూడడం, వారి యెడల పక్షపాతము చూపడం అను కోణములో దీనిని అర్థము చేసుకోకూడదు. బదులుగా, సర్వ జ్ఞాన సంపన్నుడైన ప్రభువుకు విశ్వం యెడల ఉన్న ఒక గొప్ప ప్రణాళికగా దీనిని భావించి ఆచరించాలి అని తెలియజేశారు. శ్రీసభ వేద వ్యాపక పరిచర్య గురుత్వములో వారు పాలుపంచుకొననప్పటికి శ్రీసభలో జ్ఞానస్నానము పొందిన ప్రతి విశ్వాసి క్రీస్తు ప్రభుని గురుత్వములో భాగస్తుడౌతాడు, భాగస్తురాలౌతుంది. సామాన్య గురుత్వములో స్త్రీలు, పురుషులు భేదము లేకుండా, అందరూ భాగస్తులే కాని వీరిలో నుండి కొంతమంది యువకులను ప్రత్యేకముగా ఎన్నుకొని, వారికి

తర్ఫీదునిచ్చి, గురుత్వ పరిచర్యకు వారిని సిద్ధము చేస్తారు. వారే అభిషిక్త గురువులు. కాని, శ్రీసభ జీవితములో స్త్రీల పాత్ర ప్రధానమైనది, వారి స్థానము బర్తీచేయలేనిది. క్రైస్తవ మహిళలు తమకు అప్పగింపబడిన విధిని దాని ఉద్దేశమును పూర్తిగా అర్థముచేసుకోవాలని శ్రీసభ కోరుకుంటుంది. ముఖ్యముగా, మానవీకరణలో సమాజ పునరుద్ధీకరణలో వీరి పాత్ర ప్రధానమైనది అని ఫ్రాన్సిస్ పాపుగారు క్రైస్తవ మహిళలను ఉద్దేశించి తెలియజేశారు. మహిళలను గురువులుగా, అభిషేకించుట శ్రీసభ చట్ట విరుద్ధము.

**ముగింపు:**

శ్రీసభలో అనాదిగా క్రీస్తు ప్రభు అడుగుజాడల్లో నడుస్తూ, గురుత్వానికి స్త్రీలను ఎన్నుకోలేదు. క్రీస్తు ప్రభు వారి పన్నెండుమంది అపోస్తలులుగా పురుషులనే ఎన్నుకోవడంలో ఈ నిర్ణయం తెలుస్తుంది. క్రీస్తు ప్రభు ఆనాటి సాంఘిక పరిస్థితులను బట్టి కేవలము పురుషులనే ఎన్నుకున్నారని తేల్చుట సబబు కాదు ఎందుకంటే ప్రభు ఆనాటి సాంఘిక పరిస్థితులనుబట్టి స్త్రీలను పరిగణించక ఆయన అందరి యూదా మత బోధకులకు భిన్నంగా స్త్రీలకు ఇవ్వాల్సిన తగు గౌరవాన్ని ఇచ్చి చూపించారు. ఉదాహరణకు సమరియ స్త్రీతో సంభాషణ, రక్తస్రావ రోగి ప్రభువును తాకిన సంఘటన, సిమోను ఇంటిలో స్త్రీ ప్రభుని పాదాలను అభ్యంగనము చేయుట, చివరిగా తాను మరణము నుండి పునరుత్థానుడై మొట్ట మొదటిసారి ఒక స్త్రీకి దర్శనమిచ్చుట ఇవన్నీ ప్రభు ఆనాటి పరిస్థితులకు భిన్నముగా మెలగారు. కాబట్టి, స్త్రీలను కూడా ఎన్నుకొనియుండవచ్చు, కాని, ప్రభు కేవలము పురుషులనుండే వారి అపోస్తలులను ఎన్నుకొన్నారు. క్రీస్తు ప్రభుకు జన్మనిచ్చిన తల్లి మరియను కూడా అపోస్తోలిక పరిచర్యకు ఎన్నుకోలేదు. కాబట్టి శ్రీసభలో ఆది నుండి పితామహులు ఈ నిర్ణయానికి కట్టుబడి నేటి వరకున్న జగద్గురువులు ఈ ఆచారమునే కొనసాగిస్తున్నారు. శ్రీసభలో స్త్రీల పాత్ర ఎంతో విలువైనది. ఎన్నో మఠవాస సభలను స్త్రీలు స్థాపించగా వారి అడుగుజాల్లో క్రీస్తును అనుసరిస్తూ ఎంతో మంది పునీతులుగా ప్రకటింపబడుటయేగాక, వారిని శ్రీసభ వేద పండితులుగా కూడా గుర్తించారు వారిలో ముఖ్యులు పునీత సియేన్నా కతెరీనమ్మ, పునీత అవిలాపురి తెరేజమ్మ, పునీత చిన్న తెరేజమ్మ మొదలగువారు. నేటి

పరిస్థితులలో కూడా, శ్రీసభలో స్త్రీలకు చాలా గౌరవము ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఫ్రాన్సిస్ పాపుగారు, రెండు సంవత్సరాల క్రితం, రోమను కూరియా పీఠాధిపతుల విభాగములో కొంతమంది మఠకన్యలను నేర విచారణ బృందములో భాగస్తులుగా వారిని నియమించారు. అపోస్తోలిక పీఠ పదవులలో ఇవి చాలా ఉన్నతమైనవి. స్త్రీలను గురుత్వానికి ఎన్నుకోకపోవుట స్త్రీలను అగౌరవపరచినట్లుకాక, క్రీస్తు ప్రభు ఏర్పాటుచేసిన దివ్య సంస్కారాల ఔన్నత్యాన్ని, కాపాడుట అని తెలుసుకోవాలి. స్త్రీలను గురుత్వానికి ఎన్నుకొనుట అనే అంశము శ్రీసభ పరిధిలో లేదు. అందుకనే గతములో జగద్గురువులు ఈ అంశాన్ని తిరిగి పునఃరుత్పన్నము కాకుండా మహా ఘోర నేరాలలో చేర్చి ఎవరైతే ఈ పనులకు పాల్పడతారో వారిని కఠినముగా శిక్షిస్తుంది. వారిని శ్రీసభ సహోసము నుండి భహిష్కరిస్తుంది. కాబట్టి స్త్రీలు చేయగల మంచి ఎంతో ఉంది, ఆ మంచిని చేయ ప్రోత్సాహిద్దాం, గౌరవిద్దాం.



**అనువాదము:**

**– బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్**

# 7. పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు విరుద్ధమైన ఘోర నేరాలు

- బ్రదర్ కర్రి శేఖర్,
- బ్రదర్ నేకూరి జాయ్ చందు

## పరిచయం


బ్రదర్ కర్రి శేఖర్


బ్రదర్ నేకూరి జాయ్ చందు

కతోలిక శ్రీసభలో గురువులు దైవ సేవ నిమిత్తము, దైవ రాజ్య వ్యాప్తి కొరకు జీవితాంతము అవివాహితులుగా వారి జీవితాలను స్వేచ్ఛతో స్వయముగా సమర్పించుకోవలయును. ఇది దేవుని అనుగ్రహము కాబట్టి దైవ పిలుపును పొందిన యువకులు ఈ ఉద్దేశము కొరకు తమ తర్ఫీదు కాలములో ఈ దైవానుగ్రహములో ఎదుగుతూ, ఉపగురుపట్టమును స్వీకరించు తరుణములో జీవితాంతము దైవ సేవ కొరకు, తనను తాను దేవునికి సమర్పించుకొని అవివాహితునిగా జీవిస్తానని ప్రమాణము చేస్తాడు. జీవితాంతము అవివాహితులుగా ఉండుట గురుత్వ జీవితానికి అంతర్భాగము కానప్పటికి శ్రీసభ మూడవ శతాబ్దము నుండి గురుత్వ అంతస్తులో ఉన్న వారు దీనిని పాటించాలని నిర్ణయించినది. కాబట్టి ప్రతి గురువు దైవానుగ్రహముపై ఆధారపడి, అంకితభావముతో ఈ బహుమానమును కాపాడుకోవాలి. శ్రీ.చ. 277 §1 ఈ విధముగా తెలియజేస్తుంది, "యాజకులు దైవ రాజ్య నిమిత్తమై జీవితాంతము సంపూర్ణ విరక్తత్వమును పాటించుటకు బాధ్యులైయున్నారు, కావున వారు అవివాహితులైయుండవలెను. విరక్తత్వము దేవుని ప్రత్యేక అనుగ్రహము దీని ద్వారా పవిత్ర పరిచారకులు క్రీస్తుకు మరింత సామీప్యములో ఉంటూ అవిభక్త

హృదయముతో స్వేచ్ఛగా వారిని వారు దైవ సేవకు, పరుల సేవకు అంకితమొనర్చుకొనగలరు". శ్రీ.చ. 277 §2 ఈ విధముగా తెలియజేస్తుంది, "యాజకులు, ఎవరి సహవాసముతోనైతే వారి విరక్తత్వమునకు భంగము కలిగే ప్రమాదమున్నదో లేదా ప్రజలలో అపనిందకు దారితీస్తుందో, వారితో మరింత వివేకముతో మెలగవలయును". శ్రీ.చ. 277 §3 "మేత్రాసన పీఠాధిపతికి గురువుల విరక్తత్వ జీవితానికి సంబంధించి ప్రత్యేక సందర్భాలలో, ప్రత్యేక నియమములను ఏర్పాటుచేయ హక్కు కలిగియున్నారు". ఈ విధముగా గురుత్వములో ఉన్నవారు ఈ విరక్తత్వ అంకిత జీవితానికి సంబంధించి కడు జాగ్రత్తతో మెలగవలయును.

ఈ వ్యాసము ప్రత్యేకముగా యాజక క్రమములో ఉన్న వారి నైతిక జీవితము, ముఖ్యముగా పది ఆజ్ఞలలో ఆవర ఆజ్ఞకు వ్యతిరేకముగా చేయు నేరములు, ముఖ్యముగా వయోపరిమితి, మతి స్థిమితము లేని, వధార్హమైన (vulnerable adults) వ్యక్తుల పట్ల చేయు అత్యాచారము, విరక్తత్వమునకు విరుద్ధమైన పాపములను మహా ఘోర నేరముల జాబితాలో చేర్చబడి, రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే విచారించే అధికారముగల నేరముల గురించి తెలుసుకొని వాటికి పాల్పడుట వలన విధించబడు శిక్షల గురించి తెలుసుకుంటాము. ఈ తరహా నేరాలు ముఖ్యముగా రెండు భాగాలుగా విభజించబడ్డాయి. అవి ఏవనగా:

1. యాజక క్రమానికి చెందిన వారు (cleric) పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తులతో లేదా మతిస్థిమితములేని వారితో పాపముచేయుట.
2. యాజక క్రమానికి చెందిన వారు (cleric) లైంగిక తృప్తి కొరకు లేదా లాభాల కొరకు వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తుల అశ్లీల చిత్రాలను సేకరించుట, కలిగియుండుట, ప్రదర్శించుట లేదా పంచుట.

మొదటి నేరము, పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తులతో లేదా మతి స్థిమితములేని వారితో ప్రత్యక్షముగా పాపము చేయుట, రెండవ నేరము లైంగిక తృప్తి కొరకు

లేదా లాభాల కొరకు వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తుల అశ్లీల చిత్రాలను సేకరించుట, వాటిని కలిగియుండుట, ప్రదర్శించుట మున్నగునవి. ఈ నేరాలు విరక్తత్వానికి వ్యతిరేకముగా చేయు నేరములు. ఈ నేరాలకు ఎవరు పాల్పడినా ఆ దేశ చట్టాల ప్రకారము శిక్షార్హులే, కాని, యాజకులకు శ్రీసభలో ప్రత్యేక చట్టాలు కూడా వర్తిస్తాయి. శ్రీసభ తన ఆధీనములో ఉన్న లేదా శ్రీసభకు అప్పగింపబడిన వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తుల స్వేచ్ఛను, హక్కులను కాపాడు బాధ్యత వహిస్తుంది. వారి యెడల ఎటువంటి అత్యాచార నేరాలను శ్రీసభ సహించదు. ఈ దిశలో కాలక్రమేణ శ్రీసభ చట్టాలలో, ఇంకా వాటికి సంబంధించిన చట్టాలకు అనేక మార్పులను తీసుకొస్తుంది.

### 1. యాజక క్రమములో ఉన్న వారు (cleric) పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తులతో లేదా మతి స్థిమితములేని వారితో పాపము చేయుట.

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 6 §1, సం. 1 యాజక క్రమములో ఉన్న వారు (cleric) పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తులతో లేదా మతి స్థిమితములేని వారితో పాపము చేయుటను గురించి తెలియజేస్తుంది. ఈ నియమము ప్రకారము సాధారణముగా మతి స్థిమితములేని వ్యక్తులు కూడా వయోపరిమితిలేని వ్యక్తులుగా పరిగణింపబడతారు. 18 సంవత్సరాలలోపు వారిపై అత్యాచారము, ఇతర లైగింక దాడులకు, పాల్పడిన యాజక క్రమములో ఉన్నవారిని విశ్వాస పరిరక్షణ విభాగము ఏర్పాటు చేసిన నియమముల ప్రకారము విచారించి, నేర నిర్ధారణగావింపబడినపుడు తగిన శిక్షను అమలుచేస్తుంది. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి అది ఏమిటంటే, వయోపరిమితిలేని వారితో లైంగిక నేరము, ఒక యాజకుని చేత వయోపరిమితిలేని వ్యక్తులతో పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకముగా చేయు పాపము వేరు. ఒక దేశ చట్టము ప్రకారము వయో పరిమితిలేని వారితో లైగింక నేరాలకు పాల్పడితే వారు ఎవరైనా శిక్షార్హులే, కాని, యాజక క్రమములో ఉన్నవారికి మాత్రమే ఈ "నోర్మె దె గ్రవియోరిబుస్

దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు వర్తిస్తాయి. వారిచే చేయబడిన నేరములనే శ్రీసభలో మహా ఘోర నేరముల జాబితాలో చేర్చబడ్డాయి. మనము పైన పేర్కొనిన విధముగా, ఒక గురువుకు తాను అవివాహితునిగా, విరక్తత్వ జీవితాన్ని జీవిస్తూ, ఇటువంటి వయోపరిపక్వతలేని వారిని, ఇతరులను ఇటువంటి నేరాల నుండి కాపాడవలసిన బాధ్యత కలిగియున్నాడు. అటువంటి గురువు ఇటువంటి నేరాలకు దూరంగా ఉంటూ, ఆ వ్యక్తులకు అండగా నిలవాలి. ఒక యాజకుడు ఈ తరహా నేరాల విషయములో ప్రత్యక్షముగా, పరోక్షముగా పాల్పడు అవకాశమున్నది. ప్రత్యక్షముగా పాల్పడునప్పుడు, వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వయసువారితో ప్రత్యక్షముగా శారీరక లైంగిక సంబంధము కలిగియుండుట. పరోక్షముగా పాల్పడునప్పుడు, వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వయసు వారికి తనను తాను అసభ్యకరముగా ప్రదర్శించుకొనుట, అశ్లీల కార్యాలు ప్రదర్శించుట మొదలగునవి.

## వయస్సు నిర్ధారణ:

వయో పరిపక్వతకు వ్యతిరేక నేరముల నేపద్యములో వయస్సు నిర్ధారణ, శ్రీసభ చట్టము 1983 ప్రకారము 16 సంవత్సరాలుగా (1395 §2) 2021 వరకు కొనసాగింది. 2021లో ఫ్రాన్సిస్ పాపుగారు శ్రీ.చ. 1395 §2 సవరించి, శ్రీ.చ. 1398 §1, 1 ప్రవేశపెట్టారు. దీనిలో వయసును 16 సంవత్సరాలలోపు వ్యక్తులు అనే మాటలను తొలగించుట వలన వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తులు వ్యక్తిగత సొంత నిర్ణయాలు చేయలేరు, వారు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అధికారములో ఉంటారు. శ్రీ.చ. 97 §1 ప్రకారము 18 సంవత్సరాల వయస్సు కలవారు మాత్రమే వ్యక్తిగతముగా సొంత నొర్ణయాలు చేయగలరు. కాబట్టి శ్రీ.చ. 1398 §1 సం.1 లో ప్రస్తావించబడిన నేరము 18 సంవత్సరాలలోపు వారి గురించి అని నిర్ధారించుకోవాలి. చాలా సంవత్సరాలుగా, అనేక చర్చలు చోటు చేసుకున్నాయి అనేక మంది నిపుణులతో సంప్రదించిన తరువాత 18 సంవత్సరాల వరకు ఒక వ్యక్తి సొంత నిర్ణయాలు తీసుకొనుటకు చట్టరీత్యా పరిపక్వత కలిగియుండదని నిర్ధారించి, శ్రీసభలో అనేక చట్టాల

రూపకల్పన సందర్భములో 18 సంవత్సరాలుగా నిర్ణయించడం జరిగింది. ఉదాహరణకు, వయో పరిపక్వతకు సంబంధించి, 2001లో అమలులోకి తెచ్చిన "నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములలో 16 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు పెంచబడినవి. ఈ నియమమునే 2010 లోను, 2021 లోను కొనసాగింపబడింది.

చిన్నారులను అశ్లీల చిత్రాలలో చిత్రీకరించి, ఆ తరహా నేరాలలో ఆ చిన్నారుల వయస్సు 18 సంవత్సాలలోపు వారిగా నిర్ధారించు ప్రక్రియలో వారి కనబడు విధానాన్నిబట్టి నిర్ణయించరాదు ఎందుకంటే కొన్ని సందర్భాలలో ఆ చిత్రాలలో కనబడువారిని, పెద్దవారినిగా చూపించుటకు తగు మార్పులు సాంకేతికముగా చేసియుండవచ్చు. ఈ నేరారోపణ నుండి మినహాయింపు కొరకు వారు 18 సంవత్సరాల పైబడినవారని వాదిస్తూ, శిక్ష నుండి తప్పించుకొన చూచువారు, సాధారణముగా ఇటువంటి వాదనలకు పాల్పడతారు. ఈ విషయములో సాధారణ వ్యక్తులు, తమకు తాము స్వయముగా చిన్నారుల వయస్సును నిర్ధారించుట తగదు. అందుకొరకు చట్ట పరంగా, నిపుణుల ద్వారా మాత్రమే వయస్సును నిర్ధారించాలి. నిపుణులు వాటిని పరిశీలించి క్షుణ్ణంగా తెలుసుకొనగలరు, ఆ చిత్రాలలో ఉన్న చిన్నారుల ముఖాలను మార్పుచేసినా, నిపుణులు శాస్త్రీయముగా తెలుసుకోగలరు.

## బుద్ధిరహిత/వివేకరహిత వ్యక్తులు (The habitual lack of the use of reason)

శ్రీ.చ. 99 ఈ విధముగా తెలియజేస్తుంది, "ఎవరైతే రోజువారీగా బుద్ధిరహిత/వివేకరహిత వ్యక్తులు వ్యక్తిగత బాధ్యత కలిగియుండలేరు కనుక, వారిని పసిపిల్లలుగా పరిగణింపవలెను". కాబట్టి వయస్సులో పెద్దవారైనా, రోజువారీగా బుద్ధి, వివేకము లోపించి, మతిస్థిమితము లేని వారిని పసిపిల్లలుగా పరిగణించాలి. శ్రీ.చ. 97 §2 ప్రకారము, "ఏడు సంవత్సరాల వయస్సులోపు వ్యక్తులను పసిపిల్లలుగా పరిగణించాలి, వారు వ్యక్తిగత బాధ్యతను కలిగియుండలేరు, ఏడు సంవత్సరాలు నిండిన తరువాత ఆ వ్యక్తులకు బద్ధి/వివేకము కలదని

పరిగణించాలి". ఎవరికైతే రోజువారీగా బద్ధి, వివేకము లోపించి, మతిస్థిమితము లోపిస్తుందో వారు చేసిన పనులను పసిపిల్లలు చేసిన పనులుగా పరిగణించి, వ్యక్తిగత బాధ్యతను ఆపాదించకూడదు.

**వధార్హమైన వ్యక్తులు (vulnerable adults)**

బుద్ధిరహిత/వివేకరహిత వ్యక్తులకు, వధార్హమైన వ్యక్తులకు చాలా వ్యత్యాసమున్నది. మొదటి వారు రోజువారీ బుద్ధి, వివేక లోపము వలన వారు పసిపిల్లలుగా పరిణింపబడితే కొంతమంది వ్యక్తులు బుద్ధి, వివేకము కలిగినా కొన్ని పరిస్థితుల వలన వారు వధార్హస్థితిలో ఉంటారు. ఉదాహరణకు, ఒక వ్యక్తి బుద్ధి, వివేకము కలిగినా, మనోవ్యధకు గురైయుండవచ్చు, కుటుంబములో ఆప్తులను కోల్పోయియుండవచ్చు, ఆర్ధికముగా దెబ్బతినియుండవచ్చు, ఉద్యోగము కోల్పోయియుండవచ్చు, అటువంటి వ్యక్తులను రోజువారీ బుద్ధిరహిత/వివేకరహిత వ్యక్తులుగా పరిగణించక, వధార్హవ్యక్తులుగా పరిగణించాలి. కొంత మంది వ్యక్తులు తాత్కాలికముగా బుద్ధిరహితముగా/వివేకరహితముగా ప్రవర్తించవచ్చు, ఉదాహరణకు, మద్యపు మత్తులోనున్నవారు, మాదక ద్రవ్యాల ప్రభావములో ఉన్నవారు, ఇతర మత్తు ప్రభావములోనున్నవారు.

**2. యాజక క్రమానికి చెందిన వారు (cleric) లైంగిక తృప్తి కొరకు లేదా లాభాల కొరకు వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తుల అశ్లీల చిత్రాలను సేకరించుట, కలిగి ఉండుట, ప్రదర్శించుట లేదా పంచుట.**

"నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్తిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 6 §1, సం. 2, యాజక క్రమానికి చెందిన వారు (cleric) లైంగిక తృప్తి కొరకు లేదా లాభాల కొరకు వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వ్యక్తుల అశ్లీల చిత్రాలను సేకరించుట, కలిగి ఉండుట, ప్రదర్శించుట లేదా పంచుటను గురించి తెలియజేస్తుంది. వయోపరిపక్వతలేని వ్యక్తుల అశ్లీల చిత్రాల గురించి చట్టాలు, శ్రీసభ చట్టము 1917 గాని, 1983 గాని, 1990లో అమలులోకి వచ్చిన తూర్పు దేశ శ్రీసభల చట్టముగాని, ప్రస్తావించలేదు. కాని, శ్రీసభ చట్టము 1983, 2021 లో సవరణలో ఈ నేరాలు పొందుపరచబడ్డాయి. ఇదే కాక, శ్రీసభలో అనేక ప్రత్యేక చట్టాలలో

ఈ తరహా నేరాలను విచారిస్తూ వచ్చింది. నేడు శ్రీసభ చట్టములో ఈ నేరాలకు పాల్పడిన యాజకులను, మఠవాస జీవితములోనున్న వారిని కూడా తగురీతిలో కఠినముగా శిక్షించాలని, యాజకులను, నేర తీవ్రతను బట్టి అవసరమైతే యాజక పదవి నుండి కూడా తొలగించాలని చట్టాలను ఏర్పాటు చేసింది. శ్రీసభ చట్టము 1917, అశ్లీల చిత్రాలను, సాహిత్యమును, నిషేదింపబడిన సాహిత్యముగా భావించి, విచారించింది. అదే విధముగా, ఈ నేరాలను పది ఆజ్ఞలలో ఆరవ ఆజ్ఞకు వ్యతిరేక పాపముగా పరిగణించి విచారించింది.

యాజక క్రమములో ఉన్నవారు, ఈ మహా ఘోర నేరమునకు పాల్పడ్డారని నిర్ధారించుటకు, వారి వద్ద వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలు సేకరించియుండాలి. దీనిని లతీను భాషలో "కొంపారాత్సియో" *(comparatio)*, అనగా కొనుగోలు చేయుట ద్వారా గాని, ఇంకా ఇతర విధానాలలో వాటిని సేకరించుటను సూచిస్తుంది. కొనుగోలు చేయుట ద్వారా లేదా ఇతర విధానాలలో సంపాదించిన, సేకరించిన వాటిని కలిగియుండుట, వారి స్వాధీనములో ఉంచుకొనుట. దీనిని లతీను భాషలో "దెతెన్సియో" *(detentio)*, కలిగియుండుట, వారి ఆధీనములో ఉంచుకొనుట అని అర్థము. సేకరించిన వాటిని, వారి ఆధీనములో ఉన్న వాటిని ఇతరులతో పంచుకొనుట, సరఫరా చేయుట. దీనిని లతీను భాషలో "దివుల్గత్సియో" *(divulgatio)*, పంచుట, వ్యాప్తిచేయుట, సరఫరా చేయుట అని అర్థము. పైన చెప్పబడిన అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలు ఇవి ఏ ఆధునిక పరికరాలతోనైనా సరే, ఈ విధముగా వారు చేసినట్లైతే వారిని నేరమునకు పాల్పడిన వారినిగా పరిగణించి, విచారించి, శ్రీసభ శిక్షిస్తుంది. ఈ పనులు చేసిన యెడల అవి భాహ్యముగా చట్ట ఉల్లంఘన చేసినట్లౌతుంది కాబట్టి, నేరానికి పాల్పడినవారినిగా పరిగణిస్తుంది.

### వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలు సేకరించుట *(comparatio)*

లైంగికతృప్తి కొరకు, వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలు సేకరించుటలో భాగముగా, వాటిని అంగీకరించుట,

ధనముతో గాని, వస్తువుతో గాని మార్చుట, అంతర్జాలము నుండి దిగుమతి చేయుట, కొనుగోలు చేయుట. వాటిని కేవలము వేరు వేరు విధానాలలో, అంతర్జాలము నుండి మాత్రమే కాక, అశ్లీల పుస్తకాల నుండి సేకరించిన బొమ్మలు, పత్రికల నుండి సేకరించినవి, చలన చిత్రాలు, కంప్యూటర్, ప్రసారం చేయదగిన, ప్రసారం చేసిన వీడియోలు, సాంకేతిక యంత్రాలలో భద్రపరిచే విధానాల ద్వారా సేకరించుట. వీటన్నింటిని చట్టము ఒక యాజకుడు కలగియుంటే వాటిని సేకరించినట్లు భావిస్తుంది. కొన్ని సందర్భాలలో అనాలోచితముగా లేదా తన ప్రమేయము లేకుండా, వారి కంప్యూటర్, నేరగాళ్ల భారిన పడి దురుద్దేశముతో చేసిన యెడల, అది నిపుణుల సహాయముతో నిర్ధారించవలసిన విషయము. కాని చాలా సార్లు వాటిని దిగుమతి చేయాలంటే, రుసుము చెల్లించుటకు వ్యక్తిగత వివరాలు అందించవలసిన అవసరము ఉంటుంది కనుక వాటిని జాగ్రత్తగా పరిశీలించి, నిజముగా ఒక యాజకుడు ఈ నేరమునకు పాల్పడినది లేనిది తెలుసుకొనవలెను.

## వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలు కలిగియుండుట *(detentio)*

లైంగిక తృప్తి కొరకు సేకరించిన వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలు కలిగియుండుట అనగా వాటిని భద్రపరచుటను సూచిస్తుంది. సాంకేతిక యంత్రాలలో ఒక చోట భద్ర పరచి భవిష్యత్తులో లేదా కావలసినపుడు వీక్షించుటకు ఉంచుట. వాటిని ఒక నిర్దిష్ట భౌతిక స్థలములో కావచ్చు, సాంకేతిక స్థలములో కావచ్చు. కలిగియుండుట అనగా వాటి యజమాని అని, వాటి కర్త అని అర్థము చేసుకోకూడదు. వాటిని తాత్కాలికముగా లేదా శాస్వతముగా భద్రపరచినా ఈ నేరమునకు పాల్పడినట్లుగా పరిగణించాలి. కొన్ని సందర్భాలలో వాటిని దిగుమతి చేయకుండా, కొన్ని అంతర్జాల పుటలలో వీక్షించు అవకాశముంది, కాబట్టి ఆ విధముగా కూడా వాటిని కలిగియుండుటగా పరిగణించాలి.

## వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలను ఇతరులకు సరఫరా చేయుట/పంచుట *(divulgatio)*

వయోపరిపక్వతలేని 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చలన చిత్రాలు, చిత్రాలను ఇతరులకు సరఫరా చేయుట/పంచుట *(divulgatio)* అనగా, లైంగిక వాంఛతో, ఒక యాజకుని చేత, 18 సంవత్సరాలలోపు వారి అశ్లీల చిత్రాలను మున్నగునవి, ఇతరులకు కొన్ని సేవలకు, వస్తువులకు, రుసుముకు పంపిణీ చేయుట, వ్యాపింపచేయుట. దీనిలో భాగముగా, ఏవిధముగానైనా, సాంకేతిక, భౌతికముగా, చిన్నారుల అశ్లీల చిత్రాలను మున్నగువాటిని ఇతరులతో మార్చుకొనుట, ఇతరులకు పంపుట, చూపుట, దానము చేయుట. ఇది కేవలము వయోపరిపక్వత నొందిన వ్యక్తలకు పంచుట, వ్యాప్తిచేయుట మాత్రమే కాకుండ, యవ్వనస్తుల అశ్లీల చిత్రాలను, చిన్నారులకు చూపించుట, తద్వారా భవిష్యత్తులో వారితో ఇలాంటి పనులను చేయించుటకు వారిని సిద్ధముచేయు ఉద్దేశముతో చూపించుట కూడా నేరము. శ్రీ.చ.1398 §1, సం.2 ఈ విధముగా తెలియజేస్తుంది, "వయోపరిపక్వతలేని చిన్నారులను లేదా రోజువారి బుద్ధి/వివేకము లేని వారిని లేదా చట్టము అటువంటి వారికి ఆ విధముగా గుర్తింపునిచ్చే వారిని అశ్లీల కార్యకలాపాలకు పాల్పడుటకు తయారు చేయుట లేదా ప్రేరేపించుట" ఒక యాజకుడు ప్రయత్నించిన, నిమగ్నమైనా, పదవి నుండి తెలిగించబడాలి, ఇతర శిక్షలు విధించాలి, పరిస్థితులను బట్టి యాజక పదవి నుండి కూడా తొలిగించాలి. ఈ విధముగా చేయుట వలన చిన్నారులను అశ్లీల కార్యక్రమాలలో పాల్గొనుటకు నిర్భంధించుట, మోసపూరితముగా వారిని భయపెట్టి వారు సహకరించునట్లు చేయుట, ఇలా జరుగుచున్నట్లు ఎవరికి చెప్పకుండా వారిని భయపెట్టుట, ఈ తరహా పనులన్నీ ఈ మహా ఘోర నేరమునకు పాల్పడినట్లుగా పరిగణించాలి.

## విచారించుటలో ఎదురయ్యే అడ్డంకులు, విధించు శిక్షలు:

చిన్నారులను అశ్లీల చిత్రాలలో చిత్రించుట అనునది దాదాపు అన్నీ దేశాలలో చట్టరీత్యా నేరము. ఇది ఒక దేశచట్టమునను సరించి విచారించాల్సిన విషయము. ఒక్కోదేశములో అమలులోనున్న చట్టమునను సరించి విచారించాలి. శ్రీసభ

అధికారులకు, ధర్మాసనానికి ఈ తరహా నేరాలను విచారించుటకు కొన్ని అడ్డంకులు ఉంటాయి. ఎక్కడైతే ఈ తరహా నేరాలు చోటు చేసుకుంటున్నాయో బాధ్యతగల పౌరులు తక్షణమే అధికారులకు ఫిర్యాదు చేసి తమ వంతు బాధ్యతను నెరవేర్చాలి. ఇక యాజకుల విషయములో కూడా, ఇటువంటి నేరాలు ఉత్పన్నమైనపుడు, వెంటనే పోలీసు యంత్రాంగానికి తెలియపరచి తగు చర్యలు తీసుకొని, న్యాయ వ్యవస్థతో సహకరించాలి. దేశ అధికారులు ఈ నేరమును విచారిస్తుండగా, శ్రీసభ అధికారులు, ఒక యాజకుని విషయమై ఆ విచారణ ఫలితాల కొరకు వేచియుండాలి. ఆ నేరము చేసినట్లుగా నిర్ధారణైనప్పుడు మాత్రమే శ్రీసభ చట్టములో 1389 §1, సం. 1, 2 ప్రకారము తగు శిక్షలను శ్రీసభలో విధించవచ్చు. స్వతహాగా, చిన్నారుల అశ్లీల చిత్రాలను పరిశీలించు అధికారము చట్టపరంగా శ్రీసభకు చాలా సార్లు ఉండదు. దేశ అధికారుల విచారణపై ఆధారపడి ఉంటుంది. ఒక వేళ చట్ట పరంగా నేరము నిర్ధారణ కాకపోయినా, ఒక యాజకునికి ఆ పరిస్థితుల తీవ్రతను బట్టి తగు శిక్షను విధించవచ్చు. ఇటువంటి నేరాలకు పాల్పడిన యాజకులకు, "నోర్మె దె గ్రవియోరిబుస్ దెలిక్టిస్", *(Normae de gravioribus delictis)* మహా ఘోర నేరాల విచారణ నియమములు, ఆర్టికలు 6 §1, సం. 2 ప్రకారము, నేర తీవ్రతను బట్టి తగు శిక్షను, యాజక పదవి నుండి కూడా తొలగించవచ్చు లేదా జీవితాంతము ప్రార్థనలో, ప్రాయశ్చిత్తము కొరకు శిక్ష విధించవచ్చు.

**ముగింపు:**

శ్రీసభలో ప్రతి యాజకుడు, తాను జీవితాంతము విరక్తత్వముతో దైవ సేవ కొరకు అవివాహితునిగా ఉంటానని ప్రమాణము చేస్తాడు. విరక్తత్వ అంకిత జీవితానికి కట్టుబడి ఉండాలి, విరక్తత్వమునకు వ్యతిరేక పాపముల నుండి తనను తాను కాపాడుకోవాలి. ముఖ్యముగా వయోపరిపక్వతలేని వారితో, మతి స్థిమితములేని వారితో, వారిపై ఆధారపడే వ్యక్తులతో కడు జాగ్రత్తతో, గౌరవముతో మెలగాలి. ఒక యాజకుడు వారి సంరక్షకుడై ఉండాలి. చిన్నారులను, మతి స్థిమితములేని వారు, వధార్ధ్యమైన వారు మంచి వాతావరణములో ఎదుగుటకు మనమంతా కృషిచేయాలి. కొన్ని దేశాలలో వీటికి సంబంధించిన నియమాలు, ఫిర్యాదు చేయు విధానము, విచారణ విధానము అందరకు తెలిసే విధముగా

చట్టపరముగా ప్రచురించాలి. ఇటువంటి నేరాలకు పాల్పడిన యాజకుల జాబితాను కూడా చట్ట పరంగా అందుబాటులో ఉంచాలి. వారి మరణానంతరము కూడా ఆ పేర్లు, వివరాలు చట్టపరంగా, తొలగించకుండా ప్రజల పరిశీలనార్థము అందుబాటులో ఉంచాలని నిర్దేశించాయి.

అందుకనే ఒకవేళ ఇటువంటి పరిస్థితులు ఎదురైతే శ్రీసభ చట్టము, శ్రీసభలో మహా ఘోర నేరాలకు సంబంధించిన నియమముల ప్రకారము కఠినమైన శిక్షను ఎదుర్కొంటారు. ఇలాంటి మహా ఘోర నేరాలు, కేవలము రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగము మాత్రమే విచారించగలదు. వీటి తీవ్రతనుబట్టి ఈ నేరములు శ్రీసభలో అత్యున్నత విభాగమైన విశ్వాస పరిరక్షణ విభాగానికి మాత్రమే పరిమితము గావించబడ్డాయి. ఈ నేరాలు చాలా తీవ్రమైనవి. శ్రీసభలో జ్ఞానస్నానము పొందిన మనమందరము దేవుడు మనకు ప్రసాదించిన గురువుల కొరకు అనుదినము ప్రార్థిద్దాం. వారు మంచి గురువులుగా, మంచి సేవకులుగా ఉండుటకు మన ప్రార్థన వారికి ఎంతో అవసరము. వారు త్రోవ తప్పుటకు మనము కారణము కాకూడదు. వారిని అర్థముచేసుకొని వారి దైవాంకిత జీవితములో నిష్టగా జీవించుటకు మన ప్రార్థన, సహకారము అందించుదాం. ఈ వ్యాస ముఖ్య ఉద్దేశము ఈ అవగాహన కలిగించుట, తద్వారా మనమంతా చిన్నారులను ఇటువంటి విధ్వంసాల నుండి కాపాడి శ్రీసభలో మంచి వాతావరణాన్ని కల్పించుటకు మనము కృషిచేద్దాం.




పీఠాధిపతుల సమాఖ్య ప్రారంభ దివ్యబలి పూజ, రోము నగరము



పీఠాధిపతుల సమాఖ్య 16వ సామాన్య సార్వజనిక సమావేశము,
రోము నగరము





రోమను కూరియా విశ్వాస పరిరక్షణ విభాగము, రోము నగరము
(Dicastery for the Doctrine of the Faith)


**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing